



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక






Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 02 ఆదివారం మార్చి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 166
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక!

- 5 ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి ఎన్నికల నోటిఫికేషన్
- 4 కాంగ్రెస్ పార్టీకి,ఒక స్థానం బీఆర్ఎస్‌కు దక్కేఛాన్స్
- ఎమ్మెల్సీ అభ్యర్థులుగా రేవంత్ అనూహ్య ఎంపిక
- సామాజిక సమీకరణాల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక
- సీపీఐ పార్టీకి కాంగ్రెస్ ఒకస్థానం కేటాయింపు
- సీపీఐ నేత చాడా వెంకట్‌రెడ్డికి ఇచ్చే ఛాన్స్?





2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణలో అయిదు ఎమ్మెల్సీ స్థానాలు భర్తీ కానున్నాయి. ఇందులో నాలుగు కాంగ్రెస్.. ఒక స్థానం బీఆర్ఎస్‌కు దక్కనుంది. కాంగ్రెస్ కు మిత్రపక్షంగా ఉన్న సీపీఐ కు గతంలో ఇచ్చిన హామీ మేరకు ఒక స్థానం కేటాయించాల్సి ఉంది. చాడా వెంకటరెడ్డికి ఈ స్థానం కేటాయించే అవకాశం కనిపిస్తోంది. మిగిలిన మూడు స్థానాల విషయంలో రేవంత్ వ్యూహాత్మక కసరత్తు చేస్తున్నారు. కొత్త అభ్యర్థుల ఎంపిక పైన హైకమాండ్ తో చర్చలు సాగుతున్నాయి. ప్రాంతీయ - సామాజిక సమీకర ణాల ఆధారంగా రేవంత్ లిస్టు సిద్దమైంది. రేవంత్ కసరత్తు ఎమ్మెల్యే కోటా

# కార్యకర్తలను చూస్తే కొండంత ధైర్యం



- కార్యకర్తలంతా నా కుటుంబ సభ్యులతో సమానం
- 30 ఏళ్ల తర్వాత గంగాధరనెల్లూరులో టీడీపీ జెండా
- పార్టీ విజయం కోసం కార్యకర్తలు ప్రాణం పెట్టి పనిచేశారు
- కష్టపడిన కార్యకర్తలను పార్టీ వదులుకోదు
- వ్యూహాత్మకంగా ఎన్నికల్లో వెళ్తే..పులివెందులో గెలిచేవాళ్లం
- కార్యకర్తలకు ఎమ్మెల్యేలు, ఎంపీలు అందుబాటులో ఉండాలి
- గంగాధర నెల్లూరు పర్యటనలో సీఎం చంద్రబాబు పెన్షన్లు పంపిణీ

2

**గంగాధరనెల్లూరు-నవభూమిప్రతినిధి:** 'కార్యకర్తలను చూస్తే నాకు కొండంత ధైర్యం వస్తుంది. 8 నెలలుగా పాలనలో నిమగ్నమై పార్టీ శ్రేణులతో సమావేశం కాలేకపోయా. మళ్లీ కుటుంబ సమానులైన కార్యకర్తలను కలుసుకోవడం సంతోషంగా ఉంది' అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు. గంగాధర నెల్లూరు పర్యటనలో భాగంగా బీసీ, ఎస్సీ కాలనీల్లో వాసు, వసంతమ్మలకు ఆయన పెన్షన్లను పంపిణీ చేశారు. అనంతరం ఎస్సీకాలనీలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు.అక్కడే ఏర్పాటుచేసిన ప్రజావేదికలో ప్రసంగించాక సమీపంలోని రామానాయుడుపల్లె వద్ద శనివారం మండల టీడీపీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ '30 ఏళ్ల తర్వాత గంగాధరనెల్లూరులో టీడీపీ జెండా ఎగరేశాం. పార్టీ విజయం కోసం కార్యకర్తలు ప్రాణం పెట్టి పనిచేశారు. మీకు నేను పూర్తిగా సహకరిస్తా. ఈ నియోజకవర్గాన్ని పార్టీకి కంచుకోటగా

# టన్నెల్ మృతదేహాల గుర్తింపు

- 8 మంది ఆనవాళ్ల గుర్తింపు, దారుణంగా లోపలి పరిస్థితులు
- మృతదేహాల వెలికితీతకు ముమ్మరంగా సహాయక చర్యలు
- సహాయక చర్యల్లో మొత్తం 12 విభాగాల బృందాలు
- అర్ధరాత్రి వరకు 4 మృతదేహాలు బయటకు..
- 5-8 మీటర్లలోతున మట్టి దిబ్బల కింద 4గురి ఆనవాళ్లు
- టన్నెల్ బోరింగ్ మిషన్ కింద మరో నాలుగు మృతదేహాలు
- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి



నాగర్‌కర్నూల్-నవభూమిబ్యూరో

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 8 మంది సిబ్బందిని బయటికి తీసేందుకు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు వివరాలను మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. గల్లంతైన వారి ఆచూకీ మరికొద్ది గంటల్లోనే లభించే అవకాశం ఉందని తెలిపారు. టన్నెల్ వద్ద సహాయక చ్యలను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. టన్నెల్‌లో మనుషులు ఉన్నట్లు ఆనవాళ్లు కనిపించిన ప్రదేశంలో తవ్వకాలు జరుగుతున్నట్లు మంత్రి జూపల్లి వెల్లడించారు. 5-8 మీటర్ల మట్టిదిబ్బ కింద నలుగురి వ్యక్తుల ఆనవాళ్లు ఉన్నట్లు రాడార్ సర్వే ద్వారా చేసిన స్కానింగ్‌లో కనిపించాయని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మరో నలుగురు సిబ్బంది టన్నెల్ బోరింగ్ మిషన్ కింద ఉన్నట్లు తెలుస్తోందని మంత్రి వెల్లడించారు. సహాయక చర్యల్లో మొత్తం 12 విభాగాలు చురుగ్గా పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలపై ఆయన మండిపడ్డారు. పనులు వేగంగా జరగడం లేదని కొందరు విమర్శిస్తున్నారని.. వారికి టన్నెల్ లోపల పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో తెలియట్లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో భయంకర పరిస్థితి, చూడండి విమర్శించేవారు లోపలికి వెళ్లి చూస్తే పరిస్థితి అర్థమవుతుందన్నారు మంత్రి జూపల్లి. కాళేశ్వరంలో 200 కిలోమీటర్ల సొరంగం తవ్వామని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు అంటున్నారని.. మరి పదేళ్లలో ఎస్ఎల్బీసీలో 20 కిలోమీటర్ల టన్నెల్ ఎందుకు తవ్వలేకపోయారని మంత్రి ప్రశ్నించారు. గత పదేళ్లలో ఎస్ఎస్ఎల్బీసీని పూర్తి చేసుంటే ఈ ఘటన జరిగివుండేది కాదన్నారు మంత్రి జూపల్లి కృష్ణారావు.

# మే నెలలో తల్లికి వందనం

- తల్లికివందనం'కు అర్హతపై చంద్రబాబు కీలక ప్రకటన..!!
- ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లి ఖాతాల్లో రూ 15 వేలు చొప్పున జమ చేస్తామన్న సీఎం
- తాజా బడ్జెట్‌లో తల్లికి వందన పథకానికి నిధులు కేటాయింపు

2



చెన్నై-నవభూమిబ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేసారు. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం 2025-26 వార్షిక బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టింది. ఈ బడ్జెట్‌లో సూపర్ సిక్స్ లో రెండు కీలక పథకాలకు నిధులు కేటాయించారు. తల్లికి వందనం పథకం కోసం నిధులు ప్రతిపాదించారు. విద్యార్థుల సంఖ్య మేరకు కేటాయింపులు చేయలేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ సమయంలో సీఎం చంద్రబాబు తాజాగా స్పష్టత ఇచ్చారు. పథకం అమలు ముహూర్తంతో పాటుగా ఇంట్లో ఎంత మంది పిల్లలకు అమలు చేస్తారనే అంశం పైన సందేహాలకు సమాధానం చెప్పారు. తల్లికి వందనంపై క్లారిటీ ఏపీలో కూటమి నేతలు తాము అధికారంలోకి వస్తే తల్లికి వందనం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లి ఖాతాల్లో రూ 15 వేలు చొప్పున జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఇక, అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు తాజా బడ్జెట్‌లో ఈ మేరకు నిధులు కేటాయించారు. మే నెలలో ఈ పథకం అమలు చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టత ఇచ్చారు. గంగాధర నెల్లూరులో పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న చంద్రబాబు ఎంత మంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం కింద సాయం చేస్తామని మరోసారి స్పష్టం చేశారు. పిల్లల ఖర్చుల బాధలు తగ్గించే బాధ్యత తామే తీసుకుంటామన్నారు. మే నెలలో తల్లికి

# రేవంత్‌ను ప్రజలు నమ్మరు

- తెలంగాణలో కేంద్రం రూ. 10 లక్షల కోట్ల విలువైన పనులు చేపట్టింది
- 7 టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటి తెలంగాణకు తెచ్చామన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- హైదరాబాద్ మెట్రో ఫేజ్-2ను కేంద్రం ఆలస్యం చేయదని స్పష్టీకరణ
- బీజేపీని బ్లాక్‌మెయిల్ చేసినంత మాత్రాన రేవంత్ రెడ్డి మీద వ్యతిరేకత పోదు
- సీఎం రేవంత్‌రెడ్డి 9పేజీల బహిరంగ లేఖపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందన



2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను మళ్లించేందుకే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధాలు చెప్పినంత మాత్రాన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తగ్గదని కిషన్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వాస్తవాకు విరుద్ధంగా బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని రేవంత్‌పై మండిపడ్డారు. రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇవ్వడంలో ఒక విధానం ఉంటుందన్నారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. తెలంగాణలో కేంద్రం చేపట్టిన రూ. 10 లక్షల కోట్ల విలువైన పనులను ఇప్పటికే వివరించామని తెలిపారు. తాను ఇతర కేంద్రమంత్రులను బెదిరించానని దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని సీఎం రేవంత్

# కేంద్రంపై పోరుకు స్టాలిన్ సిద్ధం



- నియోజకవర్గాల పునర్విభజన, హిందీ వివాదాలపై కేంద్రంతో డీఎంకె విభేదం
- దేశవ్యాప్తంగా పీఎం శ్రీ స్కూళ్లు..హిందీని తప్పనిసరి చేయడంతో ఆగ్రహం
- మిగతా అన్ని పార్టీల్ని పోగేయాలని నిర్ణయించిన డీఎంకే అధినేత స్టాలిన్
- 5న అఖిలపక్ష భేటీ నిర్వహించి ఎన్డీఏ ప్రయత్నాలను అడ్డుకోవాలని యోచన

చెన్నై-నవభూమిబ్యూరో

వచ్చే ఏడాది చేపట్టే నియోజకవర్గాల పునర్ విభజన, హిందీ వివాదాలపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో విభేధిస్తున్న తమిళనాడు ప్రభుత్వం ఇక అమీతుమీకి సిద్ధమైంది. ఇందుకోసం మిగతా అన్ని పార్టీల్ని పోగేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే ఛీఫ్ ఎంకే స్టాలిన్ అఖిలపక్ష సమావేశం నిర్వహించబోతున్నారు. ఇందులో పాల్గొనాలని అన్ని పార్టీల నేతలకు సందేశాలు పంపుతున్నారు. దేశవ్యాప్తంగా 2026లో నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఇందులో ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లను భారీగా పెంచేస్తున్న కేంద్రం.. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తోందని స్టాలిన్ ఎప్పటినుంచో ఆరోపిస్తున్నారు. జనాభా ప్రాతిపదికన ఈ సీట్లు పెంచుతున్నట్లు కేంద్రం చేస్తున్న వాదనను ఆయన వ్యతిరేకిస్తున్నారు. అలాగే హిందీ భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నాలపైనా మండిపడుతున్నారు. పీఎం శ్రీ స్కూళ్ల పేరుతో దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న విద్యాలయాల్లో తప్పనిసరిగా హిందీ భాషను అమలు చేయాలంటూ కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల్ని తమిళనాడు తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో మార్చి 5న అఖిలపక్ష భేటీ నిర్వహించి ఈ ప్రయత్నాలను అడ్డుకోవాలని సీఎం స్టాలిన్ నిర్ణయించారు. ఇందుకోసం ఆయన అన్ని పార్టీలకు ఆహ్వానాలు పంపుతున్నారు. అయితే తాము ఈ భేటీకి హాజరు కాబోమని తమిళనాడులో విపక్ష బీజేపీ ప్రకటించింది. ఈ భేటీకి హాజరు కాబోమని బీజేపీ ప్రకటించినా ఆ పార్టీ మిత్రపక్షం అన్నాడీఎంకే మాత్రం తాము వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. దీంతో బీజేపికి షాక్ తగిలినట్లయింది. దీంతో డీఎంకే మరింత ఉత్సాహంగా ముందుకెళ్లాలని భావిస్తోంది.

# తీన్మార్ మల్లన్నపై సస్పెన్షన్ వేటు

- బీసీ రిజర్వేషన్ల అంశంపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు సంచలనం
- కాంగ్రెస్ నేతలు సైతం అభ్యంతరం..అసెంబ్లీలో ప్రస్తావన
- గతనెల 5న టీపీసీసీ క్రమశిక్షణ సంఘం మల్లన్నకు నోటీసులు
- 12లోపు గడువు ఇచ్చినా,మల్లన్న నుంచి వివరణ కరవు
- పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ క్రమశిక్షణ సంఘం ఉత్తర్వులు



2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ ను కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది. బీసీ రిజర్వేషన్ల అంశం వేళ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. వీటి పైన కాంగ్రెస్ నేతలు సైతం అభ్యంతరం వ్యక్తం చేసారు. ప్రతిపక్షం ఈ వ్యాఖ్యలను అసెంబ్లీలో ప్రస్తావన చేసింది. ఈ పరిణామాల పైన పార్టీ క్రమశిక్షణా సంఘం

# నిప్పుల కొలిమి

- ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు
- మార్చి నెల నుంచే భానుడి ప్రతాపం
- 125ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఎండలు
- ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు 44 నుంచి 46 డిగ్రీల వరకు నమోదు

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

వేసవి కాలం వచ్చేసింది. మార్చి నెల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. అయితే, అసలు వేసవి ముందుందని, రాబోయే రోజుల్లో ఎండలు మరింత భగభగ మండనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది. ప్రజలకు ఇది నిజంగా పిడుగులాంటి వార్తే. ఎందుకంటే, ఈసారి

# పోసానికి గుండెనొప్పి

- ఆసుపత్రిలో చికిత్సలు..ఏమీ తేలకపోవడంతో మళ్లీ జైలుకు
- అంతా ఉత్తుత్తిదే..అన్న రాజంపేట పోలీసులు


2

రాజంపేట-నవభూమిబ్యూరో

ఏపీలో గత వైసీపీ ప్రభుత్వంలో కూటమి నేతలైన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో అరెస్టు అయి రాజంపేట జైల్లో ఉన్న టాలీవుడ్ నటుడు పోసాని కృష్ణమురళి అస్వస్థతకు గురికావడం అబద్దమని తేలిపోయింది. వైసీపీ నేత పోసాని కృష్ణమురళి గుండెనొప్పి వచ్చినట్లు జరిగిన ప్రచారం అంతా ఫేక్ అని పోలీసులు తేల్చేసారు. ఈ మేరకు రాజంపేట పోలీసులు ఓ ప్రకటన చేశారు. ఇవాళ రాజంపేట జైల్లో ఉన్న పోసాని కృష్ణమురళి గుండె నొప్పిగా ఉందని



# వంగవీటి రాధాకు కీలక పదవి?



2


విజయవాడ-నవభూమిబ్యూరో

ఏపీ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం 2025-26 పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశ పెట్టింది. సూపర్ సిక్స్ లో రెండు పథకాల అమలుకు కేటాయింపులు చేసింది. ఇటు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థుల గెలుపు పైన కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలోనే ఎమ్మెల్యే కోటా ఎన్నికలు జరుగుతన్నాయి. కూటమికే అయిదు స్థానాలు దక్కనున్నాయి. అభ్యర్థుల ఖరారు పైన చంద్రబాబు - పవన్ ఇప్పటికే ఒక విడత సమాలోచనలు చేసారు. కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కొత్త సమీకరణాలు ఏపీలో అయిదు ఎమ్మెల్సీ స్థానాలకు కూటమికే దక్కనున్నాయి. అందులో ఒక స్థానం జనసేన నుంచి మెగా బ్రదర్ నాగబాబుకు దాదాపు ఖాయమైంది. రాజ్యసభ



## కమిషనర్ సీరియస్ వార్నింగ్.. అక్రమార్కులపై ఉక్కుపాదం

**హైదరాబాద్-నవభూమి:** పోలీస్ స్టేషన్లలో సివిల్ పంచాయతీలు చేసినా.. కాసుల కోసం కేసులను పక్కదారిపట్టించి సెటిల్మెంట్లకు పాల్పడిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటానని సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ హెచ్చరించినట్లు తెలిసింది. కమిషనరేట్లో పనిచేస్తున్న కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏసీపీల వరకు ప్రతి అధికారిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ఇటీవల విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొవడమే కాకుండా మహిళా పోలీసులపట్ల అసభ్యంగా మాట్లాడిన బోరబండ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ (ఎస్హెచ్ఓ), డీఐ(లపై బదిలీ వేటు వేశారు. ఒకరిని ట్రాఫిక్ విభాగానికి, మరొకరిని మరో పోలీస్ స్టేషన్ డీఐగా బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బంజారాహిల్స్ స్టేషన్ శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.ఈ వార్తను కూడా అక్రమార్కుల జాబితా సిద్ధం..అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న సిబ్బంది జాబితా తన వద్దకు వచ్చిందని, అంతర్గత విచారణ అనంతరం తప్పకుండా చర్యలు ఉంటాయని సీపీ ఆనంద్ హెచ్చరించినట్లు సమాచారం. కాసుల వేటలో పడుతున్న కొంతమంది ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు కేసులను పక్కదోవ పట్టించి ఇతర ఆదాయ మార్గాలపై దృష్టి సారిస్తునట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి వారిని విధుల నుంచి తప్పించడమే కాకుండా అప్రధాన్యత విభాగాలకు బదిలీ చేస్తామని హెచ్చరించినట్లు తెలిసింది.



## ఉర్దూ మీడియం విద్యార్థులకు గుడ్న్యూస్.. రేపట్నుంచి ఒంటి పూట బడులు




**హైదరాబాద్-నవభూమి:**రంజాన్ పండుగ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉపవాస దీక్షల నేపథ్యంలో రేపటినుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఉర్దూ విద్యార్థులకు ఒంటిపూట బడులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. ఇక నెలవంక కనిపించడంతో.. రేపట్నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభమవుతాయని ముస్లిం మత పెద్దలు ప్రకటించారు.

## ఇంకా కొలిక్కి రాని కొత్త రేషన్కార్డుల జారీ ప్రక్రియ



**హైదరాబాద్-నవభూమి:**కొత్త రేషన్కార్డుల దరఖాస్తులు జీహెచ్ఎంసీ అధికారుల వద్ద ఉండగా, అర్హులను ఎంపిక చేసే బాధ్యతను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు చేపడుతున్నారు. జిల్లా పరిధిలోని 9 సర్కిల్ కార్యాలయాలకు దరఖాస్తుదారులు వచ్చి వెళ్తున్నా, వారికి స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదు. మీసేవా కేంద్రాల ద్వారా రేషన్కార్డుల కోసం చేస్తున్న దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేయాల్సి ఉందని, ఆదివారం లేదా సోమవారాల్లో కార్డుల జారీ విషయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని సర్కిల్ అధికారులు పేర్కొంటున్నారు.మేడ్చల్: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నేటి నుంచి కొత్త రేషన్కార్డులను పంపిణీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలనలో 1,21,016, గ్రామ సభలు, వార్డు సభల్లో 33,435 దరఖాస్తులు రేషన్ కార్డుల కోసం అధికారులకు అందాయి. ఇందులో 33,435 దరఖాస్తుల వంద శాతం డాటా ఎంట్రీ పూర్తయింది. కులగణన ద్వారా విచారణ చేపట్టిన అధికారులు 6,700 మంది అర్హులను గుర్తించారు. వారికి కార్డులు అందజేసే ప్రక్రియ నేటి నుంచి ప్రారంభంకానుంది.

## పదేపదే మూత్రవిసర్జనకు 'ఐటీఇండ్'తో చెక్



**హైదరాబాద్-నవభూమి:**పదేపదే మూత్ర విసర్జన సమస్యతో సతమతమవుతున్న ఓ రోగి సమస్యను హైదరాబాద్లోని ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్యూ) వైద్యులు అరుదైన శస్త్రచికిత్స ద్వారా పరిష్కరించారు. రోగి బ్లాడర్ హెడ్ వద్ద ఐటీఇండ్ అనే పరికరాన్ని అమర్చి ఉపశమనం కల్పించారు. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన 55 ఏళ్ల వ్యక్తి మూత్రవిసర్జనకు చాలా ఇబ్బంది పడుతున్నారు. పదేపదే మూత్ర విసర్జనకు వెళ్లాల్సి రావడం, తీరా వెళ్లాక సరిగా విసర్జన కాకపోవడం, మళ్లీ బ్లాడర్ నిండుగా ఉన్నట్లు అనిపించడం తదితర సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ తరహా సమస్యను 'ప్రైమరీ బ్లాడర్ నెక్ అబ్స్ట్రక్షన్ (పీబీఎన్ఓ)' అంటారని యూరాలజిస్టు డాక్టర్ మద్దూరి విజయ్ కుమార్ శర్మ తెలిపారు. ఈ పీబీఎన్ఓ సమస్య పరిష్కారానికి రోగి మూత్రనాళంలో బ్లాడర్ నెక్ వద్ద ఐటీఇండ్ అనే ఆధునిక పరికరాన్ని అమర్చామని చెప్పారు. ఐటీఇండ్ పరికరం ప్రోస్టేట్ను, బ్లాడర్ నెక్ను తెరుస్తుందని, బ్లాడర్ నెక్ వద్ద మూత్రం సులభంగా పోయేందుకు వీలుగా మూడుచోట్ల ఛానల్స్ ఏర్పాటవుతాయని వివరించారు. ఈ పరికరం అమర్చిన ఐదు నుంచి 7 రోజుల్లో మూత్రనాళంలో మూసుకుపోయిన ప్రాంతాన్ని తెరుస్తుందన్నారు. అనంతరం ఈ పరికరాన్ని తొలగిస్తామని తెలిపారు. కాగా, ఐటీఇండ్ అమరిక వల్ల లైంగిక సామర్థ్యం తగ్గడం వంటి దుష్ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. ఈ తరహా సమస్యలకు సంప్రదాయ చికిత్సల్లో ప్రోస్టేట్ను కొంత తొలగిస్తామని, అందువల్ల వీర్యస్ఖలనం సామర్థ్యం పోవచ్చునన్నారు. కానీ, ఐటీఇండ్లో కోతలే ఉండవు కనుక లైంగిక సామర్థ్యం అలాగే ఉంటుందని చెప్పా రు. ఈ శస్త్రచికిత్స చేయించుకున్న రోజునే రోగి ఆస్పత్రి నుంచి వెళ్లిపోవచ్చునని విజయ్కుమార్ శర్మ పేర్కొన్నారు.

## రైల్వే గేటు వద్ద 2 ఆర్టీసీ బస్సుల ఢీ

**కరీంనగర్-నవభూమి:**కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్స్లను బస్సులో కరీంనగర్కు తరలించి తిరుగు ప్రయాణంలో ఉండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో 19 మంది ఎన్నికల సిబ్బంది గాయపడ్డారు. ఉమ్మడి ఆదిలాబాద్లోని నిర్మల్ జిల్లాకు చెందిన రెండు ఆర్టీసీ బస్సుల్లో అక్కడి బ్యాలెట్ బాక్స్లను ఎన్నికల సిబ్బంది గురువారం రాత్రి కరీంనగర్లోని అంబేడ్కర్ స్టేడియంలో స్ట్రాంగ్రూంకు చేర్చారు. అనంతరం తిరిగి నిర్మల్కు వెళుతున్న క్రమంలో వేకువజామున 3 గంటల ప్రాంతంలో జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తురుకకాశీనగర్ ప్రాంతంలోని రైల్వేగేట్ వద్ద బస్సులు ఒక దాని వెనుక మరొకటి ఢీకొన్నాయి.

# తెలంగాణ మహిళలకు అదిరిపోయే శుభవార్త..

## కుట్టుమిషన్ల పథకం ప్రారంభం.. త్వరలోనే పంపిణీ..!



**హైదరాబాద్-నవభూమి:**ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే పనిలో రేవంత్ రెడ్డి సర్కార్ నిమగ్నమైంది. వరుసగా ఒక్కో హామీని నెరవేరుస్తూ.. సంక్షేమ పథకాల ఫలాలను పేదలకు అందేలా చర్యలు తీసుకుంటోంది. ఇందులో.. రైతులతో పాటు మహిళలకు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రాధాన్యత ఇస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం.. ఆ తర్వాత రూ.500కే గ్యాస్ సిలిండర్ కూడా అందిస్తోంది. అయితే.. తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యం పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. మహిళా సాధికారత దిశగా పలు చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే.. తెలంగాణ ఇందిరమ్మ మహిళ పథకంలో భాగంగా మరో బృహత్తర కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభించేందుకు కసరత్తు చేస్తోంది ప్రభుత్వం. ఈ మేరకు.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కీలక ప్రకటన చేశారు. శనివారం రోజు గాంధీ భవన్లో మాట్లాడిన మహేష్ కుమార్ గౌడ్.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తోందని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీల్లో ఉచిత ప్రయాణం కల్పించామని పేర్కొన్నారు. అయితే.. మహిళలకు స్వయం ఉపాధి కల్పించి ప్రోత్సహించాలనే లక్ష్యంతో.. త్వరలోనే సీఎం రేవత్ రెడ్డి చేతుల మీదుగా ఉచిత కుట్టు మిషన్ల పంపిణీని ప్రారంభించబోతున్నట్టు కీలక ప్రకటన చేశారు. వనపర్తిలో సుమారు 40 వేల మందికి కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అండగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. పీసీసీ కార్యవర్గంలోనూ మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో మహిళలకు ఏ రంగంలోనూ సరైన ప్రాధాన్యత కల్పించలేదని ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ మహిళలు సాధికారత సాధిస్తున్నారని వివరించారు. అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందితేనే ఆ సమాజం సస్యశ్యామలంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ విశ్వసిస్తోందని.. అందుకే మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఇదిలా ఉంటే.. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించినట్టు తెలిపారు మహేష్ కుమార్ గౌడ్. ఉచిత బస్సుతో మహిళలు ఆర్థికంగా బలపడుతున్నారని తెలిపారు. ఉచిత బస్సుకు సంబంధించి ప్రభుత్వం రూ.300 కోట్లు భరిస్తోందని తెలిపారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ను కూడా ప్రభుత్వం అందిస్తోందని.. జీరో బిల్లుతో దాదాపు 50 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని చెప్పుకొచ్చారు మహేష్ కుమార్ గౌడ్.

## ఆధార్ కార్డు లేకపోయినా సేవలు..: తెలంగాణ ప్రభుత్వం



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ హాస్పి టల్స్లో వైద్య సేవలు పొందటానికి ఆధార్ కార్డు అవసరం లేదని ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. ఆధార్ కార్డు లేని కారణంగా ఉస్మానియా జనరల్ హాస్పిటల్లో చికిత్స అందించకపోవడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్కు చెందిన బైరెడ్డి శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్పై ఫిబ్రవరి 25న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుక యారాలతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. గతనెల 15న మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ప్రమీల అనే మహిళకు ఆధార్కార్డు లేని కారణంగా ఉస్మానియా హాస్పిటల్లో ట్రీట్మెంట్ అందించటానికి డాక్టర్లు నిరాకరించినట్లు చెప్పారు. అందుకు సబంధించిన వార్త కథనాలు పలు మీడియా సంస్థలు ప్రచురించినట్లు హైకోర్టుకు ఆధారాలు సమర్పించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. గవర్నమెంట్ హాస్పిటల్స్లో వైద్యసేవలకు ఆధార్ కార్డు అవసరమో..? కాదో చెప్పాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనంతరం పిటిషన్ను ఫిబ్రవరి 28కి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుక యారాలతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం (ఫిబ్రవరి 28న) మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది ఆకాశ్ బాగ్లేకర్ మరోసారి వాదనలు వినిపిస్తూ.. ఈనెల 16న ప్రమీల అనే మహిళకు ఆధార్ లేనందున చికిత్స నిరాకరించినట్లు పలు పత్రికల్లో వార్తా కథనాలు ప్రచురితమైనట్లు చెప్పారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ వ్యవహారంపై కౌంటరు దాఖలు చేశామని చెప్పారు. ఉస్మానియా హాస్పిటల్లో అదే రోజు సదరు మహిళతోపాటు మరో 100 మందికి సైతం ఆధార్ కార్డు లేకుండానే చికిత్స అందించినట్లు తెలిపారు. ఇరు పక్షాల వాదనలు నమోదు చేసిన ధర్మాసనం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధార్ కార్డు లేకండా వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు ప్రభుత్వం వివరణతో సంతృప్తి చెందింది. పిటిషన్పై ఎలాంటి విచారణ అవసరంలేదని మూసివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## నిప్పుల కొలిమి

**(1వపేజీ తరువాయి)**ఎండల తీవ్రత సాధారణం కంటే చాలా ఎక్కువగా ఉండబోతోందట. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు ఈ ఏడాది ఎండలు మండిపోనున్నాయని, ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకుంటాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత సాధారణం కంటే అధికంగా ఉండడమే కాకుండా, వడగాలులు కూడా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ఏప్రిల్, మే నెలల్లో అయితే ఉష్ణోగ్రతలు 44 నుంచి 46 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.. వాతావరణ శాఖ డేటా ప్రకారం, 1901 నుంచి 2025 వరకు సరాసరి సగటు తీసుకుంటే, ఈ ఏడాది ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉందట. అంటే, దాదాపు 125 సంవత్సరాల చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఎండలు మండిపోనున్నాయన్న మాట. దీనికి కారణం గాలిలో తేమ శాతం తగ్గడమేనని వాతావరణ శాఖ అధికారులు విశ్లేషిస్తున్నారు. దక్షిణ, మధ్య తెలంగాణ, హైదరాబాద్లో అగ్నిగుండం ముఖ్యంగా దక్షిణ, మధ్య తెలంగాణతో పాటు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. అంటే, ఈ ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. పగటిపూట బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వీలైనంత వరకు ఇంట్లోనే ఉండటం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు రాత్రి ఉష్ణోగ్రతలు కూడా పైపైకి.. పగలే కాదు, రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు పెరిగే సూచనలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ, ఉత్తర తెలంగాణలో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందట. అంటే, రాత్రిపూట కూడా వేడిమి నుంచి ఉపశమనం లభించడం కష్టమే. ఎండకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు: శరీరాన్ని డీహైడ్రేట్ కాకుండా చూసుకోవడానికి తరచుగా నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు వంటివి తాగాలి. వదులుగా ఉండే, లేత రంగు దుస్తులు ధరించడం వల్ల వేడి నుంచి కొంత ఉపశమనం పొందవచ్చు. ఎండలో బయటకు వెళ్ళేటప్పుడు టోపీ, సన్ గ్లాసెస్ ధరించడం ద్వారా సూర్యరశ్మి నుంచి రక్షణ పొందవచ్చు. వడదెబ్బ తగిలితే ఎలాంటి లక్షణాలు ఉంటాయో తెలుసుకొని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఎండలో ఎక్కువగా తిరగకుండా చూసుకోవాలి. ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉండబోతున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, ఈ వేసవిని సురక్షితంగా గడపడానికి ప్రయత్నించాలి. ఎండకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన పెంచుకోవడం చాలా ముఖ్యం.

## కార్యకర్తలను చూస్తే కొండంత ధైర్యం

**(1వపేజీ తరువాయి)**మార్చాలి. తంబళ్లపల్లె, పుంగనూరులో కాస్త గురి తప్పాం.. తప్ప జిల్లా అంతటా టీడీపీ జెండా ఎగిరింది. మొన్నటి ఎన్నికల్లో సరిగా చేసుకుని ఉంటే పులివెందులలో కూడా మనమే గెలిచేవాళ్లం. 2014-19 మధ్య అవిశ్రాంతంగా పనిచేసి 13.5 గ్రోత్రేట్ సాధించాం. అయినా ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిందంటే దానికి కారణం ప్రజలకు మంచి చేయకపోవడం వల్ల కాదు.. కార్యకర్తల్లో అసంతృప్తి వల్లే. మీలో అణువణువూ పసుపు రక్తం తప్ప మరోటి ఉండదు. మీతో నేను మాట్లాడకుంటే నాపై అసంతృప్తి చెందుతారు. అందుకే కార్యకర్తల కోసం సమావేశం ఏర్పాటు చేయించా. ఇక నుంచి నాకూ,కార్యకర్తలకు మధ్య దూరం ఉండదు. పర్యటనకు వెళ్లిన ప్రతిచోటా కార్యకర్తలతో సమావేశమవుతా' అన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజలతో అనుసంధానం కావడంతో పాటు కార్యకర్తలకూ అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. జనసేన, బీజేపీ నాయకులతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. వన్టైమ్ ఎంపీ, ఎమ్మెల్యేగా భావించకుండా రాజకీయాల్లో ఉన్నన్నాళ్లు ప్రజాప్రతినిధులుగా ఉండేలా పనిచేయాలని ఉద్బోధించారు.వైసీపీ నేతలకు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఉపకారం ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదన్నారు.వారికి ఉపకారం చేయడమంటే పాముకు పాలు పోసినట్లే. అని గుర్తించాల న్నారు.

**నీరూచెట్టు బిల్లులను త్వరలోనే చెల్లిస్తాం**

నీరూచెట్టు పెండింగ్ బిల్లులను త్వరలోనే చెల్లిస్తామని చం ద్రబాబు ప్రకటించారు.టీడీపీ శ్రేణులు కూడా ఇష్టానుసారంగా కాకుండా నాయకత్వం కింద పనిచేయాలని సూచించారు. ఇక మీదట కార్యకర్తలకు, నేతలకు ఏ పనులు కావాలన్నా బూత్కమిటీ, గ్రామకమిటీ, మండల కమిటీ, తర్వాత జిల్లా కమిటీ ద్వారా వస్తేనే మంజూరు చేస్తామన్నారు.జిల్లా ఇన్చార్జి మంత్రి రామ్ప్రసాద్రెడ్డి నియోజకవర్గాల్లో సరిగా పర్యటించడంలేదన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సీ.ఆర్.రాజన్, పెనుమూరు మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు పార్టీ కార్యక్రమాల్లో గతంతో పోలిస్తే ఇప్పుడు వారి జోరు తగ్గిందన్నారు. పాలసముద్రం మండల టీడీపీ అధ్యక్షుడు రాజేంద్ర అలకబూని పార్టీ కార్యక్రమాలకు హాజరుకాకుండా పోతున్నారని, అవసరమైతే నేరుగా అతని పరిస్థితి తెలుసుకుని తగిన విధంగా ముందుకు సాగాలన్నారు.

# వంగవీటి రాధాకు కీలక పదవి?

**(1వపేజీ తరువాయి)**అభ్యర్థుల ఎంపిక సమయం లో చంద్రబాబు స్వయంగా నాగబాబును కేబినెట్ లోకి తీసుకుంటామని ప్రకటించారు. అందులో భాగంగా ఇప్పుడు నాగబాబు ఎమ్మెల్సీ కావటం లాంఛనంగానే కనిపిస్తోంది. తమకు ఒక సీటు కేటాయించాలని బీజేపీ నుంచి ప్రతిపాదన వచ్చినట్లు తెలుస్తోంది. బీజేపీకి ఒక సీటు కేటాయిస్తే మిగిలిన మూడు స్థానాలు టీడీపీకి దక్కనున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్సీ సీటు కోసం 2024 ఎన్నిక ల్లో సీట్లు త్యాగం చేసిన నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. %ూశ్రీంశీ =ఖు౦% ఇదయ్యా నీ అసలు రూపం..సోషల్ మీడియా అల్లాడి పోతుంది రాధాకు ఛాన్స్ టీడీపీ నుంచి ఒక ఓసీ, ఒక బీసీ, ఒక ఎస్సీకి సీటు కేటాయించేలా కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. టీడీపీ నుంచి బీసీ కోటాలో బీదా రవిచంద్ర పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అదే విధంగా వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మోపిదేవి సైతం రేసులో ఉన్నారు. సీనియర్ నేత, మాజీ మంత్రి యనమలకు అవకాశం లేదని పార్టీ నేతల సమాచారం. ఈ సమయంలోనే విజయవాడ కు చెందిన వంగవీటి రాధాకు ఈ సారి ఎమ్మెల్సీగా ఛాన్స్ దక్కుతుందని తెలుస్తోంది. 2019 ఎన్నిక ల సమయంలో రాధ వైసీపీ వీడి టీడీపీలో చేరారు. ఆ సమయంలోనే రాధాకు ఎమ్మెల్సీ పదవి పైన హామీ దక్కింది. కానీ, ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవటంతో రాధాకు అవకాశం దక్కలేదు.

## ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక!

**(1వపేజీ తరువాయి)**ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు పైన రేవంత్ ఫోకస్ చేసారు. ఇప్పటికే అవకాశం ఎవరి కి ఇవ్వాలనే అంశం పైన చర్చలు జరిగాయి. నాలుగు సీట్లు కాంగ్రెస్కు దక్కనున్నాయి. సీపీఐకు ఒక ఎమ్మెల్సీ సీటు ఖాయమైంది. సామాజిక సమీకరణాల ఆధారంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి నట్లు తెలుస్తోంది. ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో అద్దంకి దయాకర్ మాల సామాజిక వర్గ నేతకు మొదటి ప్రాధాన్యత దక్కుతుందని భావిస్తున్నారు. రేవంత్ సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి పేరు ప్రచారంలో ఉంది. అయితే, సామాజిక సమీకరణాల ఆధారంగా ఇప్పుడు అవకాశం దక్కకుంటే రాజ్యసభకు పంపే ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. రేసులో ముఖ్య నేతలు రెడ్డి సామాజిక వర్గం నుంచి జగ్గారెడ్డి, హరి వర్ధన్ రెడ్డి, సామా రామ్మోహన్ రెడ్డి తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎంబీసీల నుంచి మాజీ ఎంపీ అంజన్కుమార్యాదవ్, చరణ్ కౌశిక్ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి వివాదం నడుస్తున్న నేపథ్ యంలో మాదిగ సామాజిక వర్గానికి సీటు కేటాయించాలన్న అభిప్రాయాన్ని మరి కొందరు పార్టీ ముఖ్యులు తెరపైకి తెచ్చారు. మాదిగ సామాజిక వర్గం నుంచి ప్రధానంగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్కుమార్ రేసులో తొలి వరుసలో ఉన్నారు. ఇక మహిళా కోటాలో పారిజాత నర్సింహారెడ్డి, బాణోతు విజయాబాయి రేసులో ఉన్నారు. పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పార్టీ నూతన ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ హామీ ఇచ్చారు. రేవంత్ ఛాయిస్ ఈ క్రమంలో సీఎం రేవంత్ మిత్రుడు కుసుమ కుమార్ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎం భట్టితో పాటుగా మంత్రి ఉత్తమ్ సైతం కుసుమ కుమార్ కు మద్దతు ఇస్తున్నారు. గత 30 ఏళ్ల కాలంగా కాంగ్రెస్ లో ఉన్న నేత కావటంతో.. ఇప్పుడు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలనే ప్రతిపాదన తెర మీదకు వచ్చింది. అదే విధంగా మైనార్టీ కోటాలో ఖమ్మం జిల్లాకు చెందిన నేత జావిద్ పేరు రేసులో ఉంది. ఈ ఆశావాహుల జాబితాతో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్తో రేవంత్ చర్చలు చేస్తున్నారు. హైకమాండ్ ఆమోదం తీసుకున్న తరువాత తుది జాబితాను ప్రకటించే అవకాశం కనిపిస్తోంది.

## రేవంత్ను ప్రజలు నమ్మరు

**(1వపేజీ తరువాయి)**రెడ్డిపై మండిపడ్డారు. కేంద్ర పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సీఎంలకు ఎన్నో లేఖలు రాశానని కిషన్ రెడ్డి తెలిపారు. సీఎంలతో సంబంధం లేకుండా రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే వ్యక్తిని తానని కిషన్ రెడ్డి చెప్పారు. దేశంలో నిర్మించే 7 టెక్స్టైల్ పార్కుల్లో ఒకటి తెలంగాణకు తెచ్చినట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2ను కేంద్రం ఆలస్యం చేయదని చెప్పారు. రేవంత్ ముఖం చూసో.. తాను వద్దంటున్నాననో మెట్రో ఆగదని స్పష్టం చేశారు కిషన్ రెడ్డి. తెలంగాణకు ఆర్ఆర్ఆర్ను కేంద్రం మంజూరు చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు.అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం.. బీజేపీపై ఆరోపణలు చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, రేవంత్పై అసంతృప్తి.. ఆయన మాటల్లో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. బీజేపీని బ్లాక్ మెయిల్ చేసినంత మాత్రాన రేవంత్ రెడ్డి మీద వ్యతిరేకత పోదని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## తీన్మార్ మల్లన్నపై సస్పెన్షన్ వేటు

**(1వపేజీ తరువాయి)**వివరణ కోరింది. ఇక, తాజాగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ గా మీనాక్షి నటరాజన్ ఎంట్రీ ఇస్తూనే కీలక నిర్ణయాలు వెలువడుతు న్నాయి. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై కాంగ్రెస్ పార్టీ ఊహించని నిర్ణయం తీసుకుంది. పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారన్న కారణంతో తీన్మార్ మల్లన్నకు ఫిబ్రవరి 5న టీపీసీసీ క్రమశిక్షణ షోకాజ్ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 12లోపు వివర ణ ఇవ్వాలని పేర్కొంది. అయితే, ఆయన నుంచి ఎలాంటి వివరణ రాలేదు. ఈ నేపథ్యంలో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి పేరిట ఉత్తర్వులు జారీ అయ్యాయి. టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదనని స్పష్టం చేసారు. మల్లన్నను ఎన్నో సార్లు హెచ్చరించినా మార్పు రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించిన కుల గణన ప్రతులు చించడంపై ఏఐసీసీ సీరియస్ అయింది. మల్లన్న చేసిన వాఖ్యల ను పార్టీ ముఖ్య నేతలు తప్పు బట్టారు. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని పార్టీ స్పష్టం చేసింది. ఇక, ఇప్పుడు తీన్మార్ మల్లన్న వ్యవహారం లో పార్టీ తీసుకున్న నిర్ణయం పైన ఎలాంటి స్పందన వస్తుందనేది చూడాలి.

## మే నెలలో తల్లికి వందనం

**(1వపేజీ తరువాయి)**వందనం ఇస్తామని ప్రకటించారు. రైతుల కోసం త్వరలోనే రైతులకు రూ.20వేలు ఆర్థిక సాయం చేస్తామన్నారు. మత్స్యకార కుటుంబా లకు రూ.20వేల ఆర్థిక సాయం చేస్తామని తెలిపారు. ఆర్థిక సాయం చేసే వీలుంటేనే హామీ ఇస్తామని.. లేకుంటే మాయమాటలు చెప్పనని తెలిపారు. ప్రతీ ఏటా పెన్షన్ల కోసం రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. కుటుంబ సంబంధాలు, విలువలకు మన దేశం ప్రపంచానికే ఆదర్శమని చెప్పారు.గత ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని మండిపడ్డా రు. ప్రజలు అన్నీ తెలుసుకొ ని కూటమి ప్రభుత్వాన్ని తీసుకువచ్చారని వ్యాఖ్యానించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికెళ్లి పెన్షన్లు అందిస్తున్నామన్నారు. చెప్పిన ప్రతి హామీ నిలబెట్టుకునేం దుకు నిత్యం కృషి చేస్తున్నా మని వివరించారు. ప్రతి సేవా సెల్ఫోన్ ద్వారా అందించేందుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. రెండు నెలల కాలంలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన ద్వారా పేదల జీవితాల్లో మార్పులు తెస్తామని అన్నారు. సంపద ఎలా సృష్టించాలన్న దానిపై నిత్యం ఆలోచన చేస్తున్నామన్నారు. తాము వచ్చిన 9 నెలల్లోనే 12.9 శాతం వృద్ధి రేటు సాధించామని చెప్పుకొచ్చారు. కేంద్రంతో కలిసి చేసే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చి పనులు త్వరగా పూర్తయ్యేలా కృషి చేస్తున్నామన్నారు. నాగరిక ప్రపంచంలో పారిశుద్ధ్యం చాలా అవసరమని.. మరో 2 నెలల్లో రోడ్లపై గుంతలు పూడ్చటం పూర్తవుతుందని సీఎం తెలిపారు.

## పోసానికి గుండెనొప్పి

**(1వపేజీ తరువాయి)**చెప్పడంతో వెంటనే జైలు అధికారులు పోలీసుల సాయంతో ఆయన్ను రైల్వే కోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఏమీ తేలకపోవడంతో ఆయన్ను అక్కడి నుంచి రిమ్స్కు కూడా పంపారు. అయితే అక్కడ కూడా పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. పోసానికి ఏమీ కాలేదని నిర్ధారించారు. ఈ మేరకు పోసాని అనారోగ్యంతో బాధపడటం ఒక నాటకమని రైల్వే కోడూరు సీఐ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. %ూశ్రీంశీ =ఖు౦% ఇదయ్యా నీ అసలు రూపం..సోషల్ మీడియా అల్లాడి పోతుంది ఇవాళ జైలు నుంచి రైల్వే కోడూరు ఆస్పత్రికి తరలించిన తర్వాత పోసాని కృష్ణమురళి అడిగిన అన్ని టెస్టులు చేయించామని . సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రాజంపేట ఆసుపత్రిలో, రిమ్స్ లో పోసానికి చికిత్స చేయించినట్లు ఆయన వెల్లడించారు. ఆయనకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని, పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని వెల్లడించారు.



## మరో 14 మందిని రక్షించారు.. 8 మంది మంచులోనే..

**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో మంచుచరియలు విరిగిపడ్డ ఘటనలో.. మరో 14 మంది కార్మికుల్ని రక్షించారు. ఇంకా 8 మంది కార్మికులు మంచుచరియల కింద ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు 55 మంది కార్మికుల్లో 47 మందిని రక్షించారు. బద్రీనాథ్, మానా మధ్య ఉన్న బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ క్యాంపుపై మంచుచరియలు విరిగిపడ్డ విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి వరకే 33 మందిని కాపాడారు. వర్షం, మంచు తుఫాన్ వల్ల.. రెస్క్యూ ఆపరేషన్ ఇబ్బందికరంగా మారింది. శుక్రవారం రాత్రి ఆపరేషన్ నిలిపివేశారు. ఇవాళ ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. ఐటీబీపీ పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ మొదలు పెట్టినట్లు జిల్లా డిజాస్టర్ మేనేజ్మెంట్ ఆఫీసర్ ఎన్‌కే జోషీ తెలిపారు. మంచుచరియలు విరిగిపడ్డ ప్రదేశాన్ని ఇవాళ సీఎం పుష్కర్ సింగ్ ధామీ పర్యటించే అవకాశాలు ఉన్నాయి. శుక్రవారం ఉత్తరాఖండ్‌లో మంచు చరియలు బీభత్సం సృష్టించాయి. గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న హిమపాతం సరిహద్దు ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నది. ఈ క్రమంలో చమేలి జిల్లాలోని మన అనే సరిహద్దు గ్రామంలో చమోలి-బద్రీనాథ్ రహదారిపై ఏర్పాటు చేసిన శిబిరంపై పెద్దయెత్తున మంచు చరియలు విరుచుకు పడటంతో అక్కడ పనిచేస్తున్న 57 మంది బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) కార్మికులు చిక్కుకుపోయారు. శుక్రవారం ఉదయం 7.15 గంటలకు ఇది చోటుచేసుకోగా, ఆ సమయానికి కార్మికులు ఎనిమిది కంటైనర్లు, ఒక షెడ్‌లో ఉన్నారు. దీంతో అధికారులు అప్రమత్తమై వారిని బయటకు తీసేందుకు సహాయ కార్యక్రమాలు చేపట్టారు.

## ఆ వాహనాలకు బంకుల్లో ఇంధనం బంద్



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధానిలో కాలుష్య నివారణకు ఢిల్లీ బీజేపీ సర్కార్ కీలక నిర్ణయాలు తీసుకుంది. 15 ఏళ్లు పైబడిన వాహనాలకు మార్చి 31వ తేదీ తర్వాత బంకుల్లో ఇంధనం పోయడం నిలిపివేయాలని నిర్ణయించింది. కాలుష్య కట్టడి చర్యల్లో భాగంగా అధికారులతో పర్యావరణ శాఖ మంత్రి మంజిందార్ సింగ్ సిర్సా శనివారంనాడు సమీక్షా సమావేశం నిర్వహించారు. వాహన కాలుష్య నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని తమ ప్రభుత్వం నిర్ణయించినట్టు సమావేశానంతరం మీడియాతో మాట్లాడుతూ సిర్సా చెప్పారు. పాత వాహనాలపై ఆంక్షలు, తప్పనిసరి యాంటీ స్మోగ్ చర్యలు, దశలవారిగా ఎలక్ట్రిక్ బస్సులు తీసుకురావడంపై సమావేశంలో చర్చించినట్టు తెలిపారు. "పెట్రోల్ పంపుల వద్ద గాడ్జెట్‌లు ఏర్పాటు చేస్తాం. వాటి సాయంతో 15 ఏళ్లు పైబడిన వాహనాలను గుర్తిస్తాం. వాటికి ఇంధనం సరఫరా ఆపేస్తాం" అని మంత్రి తెలిపారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర పెట్రోలియం శాఖకు కూడా తెలియజేశామని చెప్పారు. ఇంధనం సరఫరా ఆంక్షలతో పాటు, ఢిల్లీలోని బహుళ అంతస్తుల భవనాలు, హోటళ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లకు తప్పనిసరిగా యాంటీ స్మోగ్ గన్లను అమర్చాలని వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబర్ కల్లా సుమారు 90 శాతం సీఎన్‌జీ బస్సులను దశలవారిగా ఉపసంహరించుకుని ఎలక్ట్రిక్ బస్సులతో భర్తీ చేయనున్నట్టు చెప్పారు. ఢిల్లీలో కొన్ని పెద్ద హోటళ్లు, పెద్ద ఆఫీస్ కాంప్లెక్స్‌లు, ఢిల్లీ విమానాశ్రయం, పెద్ద నిర్మాణ స్థలాలు ఉన్నాయని, వాటన్నింటికీ వెంటనే యాంటీ స్మోగ్ గన్స్‌ను ఇన్‌స్టాల్ చేయడం తప్పనిసరి చేయనున్నట్టు మంత్రి చెప్పారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లకు కూడా ఇది వర్తింపజేస్తామని తెలిపారు.

## ఇలా చేస్తే ఇండియా నంబర్ 1.. ప్రపంచ బ్యాంకు సూచనలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండియా ధనిక దేశంగా మారాలంటే ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందాలి. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, 2047 నాటికి అధిక ఆదాయ దేశంగా మారాలంటే భారత్ ప్రతి ఏడాది సగటున 7.8శాతం వృద్ధిని సాధించాలి. ప్రస్తుతం ఇండియాలో తలసరి స్థూల జాతీయ ఆదాయం రూ. 2.22 లక్షలుగా ఉంది. ప్రస్తుత స్థాయి నుంచి తలసరి స్థూల జాతీయ ఆదాయం 17.48 లక్షలు అంటే దాదాపు 8 రెట్లు పెరిగితేనే.. 2047 నాటికి భారతదేశం అధిక ఆదాయ దేశంగా మారుతుందని.. అందుకోసం ఈ సూత్రాలను ఆచరణలో పెట్టాలని ప్రపంచ బ్యాంకు సూచించింది. ప్రపంచంలో నెం.1 దేశంగా భారత్ మారాలంటే.. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం.. దేశంలో కొత్త పెట్టుబడులు పెరగాలి. పరిశ్రమలు అభివృద్ధి చెందాలి. ఉద్యోగ అవకాశాలు ఎక్కువ సృష్టించగలగాలు. మరీ ముఖ్యంగా మౌలిక వసతులను బలోపేతం చేయాలి. రోడ్లు, రైలు మార్గాలు, విమానాశ్రయాలు, డిజిటల్ కనెక్టివిటీ మెరుగుపరచడం వల్ల వ్యాపార వాతావరణం మెరుగవుతుంది. దీనితోపాటు విద్యా వ్యవస్థను ఆధునికీకరించాలి. సాంకేతిక నైపుణ్యాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. పరిశోధన రంగంలో పెట్టుబడులను పెంచాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించాలి.. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశమైన భారతదేశం 2032 నాటికి ఎగువ మధ్యతరగతి ఆదాయ దేశంగా మారుతుందని ప్రపంచ బ్యాంకు చెబుతోంది. ఇది సాకారం కావాలంటే దేశంలో ఉన్న యువశక్తిని సద్వినియోగం చేసుకుని.. కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టించాలి. కార్మిక నిబంధనలను సరళీకరించి, మరింత మంది ప్రజలకు ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉంది. ఉత్పాదకతను పెంచేందుకు తయారీ రంగాన్ని బలోపేతం చేయాలి. మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్ లాంటి కార్యక్రమాలను మరింత ప్రోత్సహించాలి. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు వ్యాపార నిబంధనలను సరళీకరించాలి. 2047 నాటికి నెంబర్ 1 కావాలంటే..భారత వ్యవసాయ రంగాన్ని ఆధునికంగా మార్చాలి. కొత్త సాంకేతికతలను అందుబాటులోకి తేవాలి. కర్షకులకు ఎక్కువ ఆదాయం వచ్చేలా వ్యవస్థను మార్చాలి. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలి. ఈ మార్గంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందితే, 2047 నాటికి ప్రపంచంలోనే పెద్ద ఆర్థిక శక్తిగా మారే అవకాశం ఉంది. ప్రభుత్వ విధానాలు, ప్రజల భాగస్వామ్యం, పరిశ్రమల సహకారం ఉంటే, భారతదేశాన్ని ధనిక దేశంగా మార్చడం అసాధ్యం కాదు.

## 200కుపైగా స్థానాల్లో డీఎంకే విజయం తథ్యం..



**చెన్నై- నవభూమి:** వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే 200కు పైగా స్థానాల్లో విజయం సాధిస్తుందని ప్రముఖ హాస్య నటుడు వడివేలు జోస్యం చెప్పారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి స్టాలిన్ రోజులో కేవలం కొన్ని గంటలు మాత్రమే నిద్రిస్తూ, మిగిలిన సమయంలో ప్రజాసేవకు అంకితమవుతున్నారన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో సుధీర్ఘకాలం జీవించాలని కోరుకుంటున్నట్టు ఆయన తెలిపారు. పార్టీ నేతలతో పాటు కార్యకర్తలు కూడా 2026లో పార్టీ ఘన విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## 22న కర్ణాటక రాష్ట్ర బంద్..



**బెంగళూరు-నవభూమి:** మహారాష్ట్రలో కేఎస్ఆర్టీసీ సిబ్బందిపై దాడి, బస్సులకు రంగులు వేయడంతోపాటు బెళగావిలో మరాఠీ మాట్లాడలేదని కండక్టర్‌పై దాడిని ఖండిస్తూ మార్చి 22న రాష్ట్రబంద్‌కు కన్నడ సంఘాల ఐక్యకూటమి అధ్యక్షుడు వాటాళ్ నాగరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కన్నడ సంఘాల ముఖ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాటాళ్ నాగరాజ్ మీడియాతో మాట్లాడుతూ కర్ణాటకలోనే కన్నడిగులను వేధించడం, మహారాష్ట్రకు వెళ్లే బస్సులు, సిబ్బందిపై దాడి చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు.

ఈ వార్తను కూడా చదవండి: తీహార్ నుంచి ఇక ఆయన తిరిగి రాకపోవచ్చు.. కేజ్రీవాల్ అవినీతిపై పర్వేష్ వర్మ

## మహిళా సర్పంచ్ భర్తలకు బిగ్ షాక్.. అధికారం చెలాయించకుండా సర్కార్ ప్రతిపాదనలు



**న్యూఢిల్లీ-నవభూమి:** సాధారణంగా కొన్ని గ్రామాల్లో మహిళలు సర్పంచ్‌లుగా ఎన్నికైనా.. అధికారాలు మాత్రం వారి భర్తలే అనుభవిస్తూ ఉంటారు. ఏదో రిజర్వేషన్ల ప్రకారం.. మహిళలను సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయించి.. గెలిచిన తర్వాత వారి భర్తలు.. పెత్తనం చెలాయిస్తూ ఉంటారు. ఇక కొందరు తమ కుమార్తెలను, తల్లులను సర్పంచ్‌లుగా గెలిపించినా.. పదవులు మాత్రం వారే అనుభవిస్తూ ఉంటారు. ఇది చట్ట ప్రకారం తప్పే అయినా.. అందుకు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. ఎక్కడా అలాంటి దాఖలాలు కనిపించవు. గ్రామాల్లో మహిళలు సర్పంచ్‌లుగా ఉంటే వారు కేవలం సంతకాలు, సభలకు హాజరు కావడమే తప్పితే.. చక్రం తిప్పేది మొత్తం వాళ్ల భర్తలే అయి ఉంటారు. మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇచ్చినా.. వాటిని దుర్వినియోగం చేస్తూ పురుషులే ఇలా లింగ వివక్ష చూపుతున్నారనే ఫిర్యాదులు కోకొల్లలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం ఇలా పురుష ఆధిపత్యానికి చరమగీతం పాడాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలోనే ఈ వ్యవహారంపై అధ్యయనం చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయగా.. తాజాగా ఆ కమిటీ కొన్ని సిఫార్సులను కేంద్ర ప్రభుత్వానికి అందించింది. చాలా మంది సర్పంచ్‌లుగా మహిళలు ఎన్నికైనా వారి భర్తలు పెత్తనం చేస్తుండగా.. అలాంటి వారికి భారీగా ఫైన్లు విధించాలని కమిటీ సూచించింది. ఇలా పరోక్షంగా సర్పంచ్‌గా పెత్తనం చేస్తూ.. మహిళా సాధికారతను దెబ్బతీస్తున్న వారిపై జరిమానాలు విధించాలని కమిటీ వెల్లడించింది. సుప్రీంకోర్టు సూచన మేరకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సుశీల్ కుమార్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం 2023లో ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఇటీవలె పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖకు తన నివేదికను సమర్పించింది. ఇందులో భర్తలు, తండ్రులు, కుటుంబంలోని ఇతర పురుషులు.. సర్పంచ్ అధికారాల్లో పెత్తనం చేయడాన్ని నిరోధించాలంటే మహిళలకు వ్యవస్థాగతంగా ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఎన్నికైన మహిళా ప్రతినిధులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయాలని తెలిపింది. పాలనలో వారికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు.. ప్రత్యేకంగా ఒక వ్యవస్థను తీసుకురావాలని సుశీల్ కుమార్ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. సర్పంచ్‌లుగా ఎన్నికైన మహిళలకు గ్రామాల్లో పాలన కొనసాగించేందుకు కావాల్సిన ట్రైనింగ్ వారికి ఇవ్వాలని పేర్కొంది. అంతేకాకుండా మహిళా సర్పంచ్‌లకు న్యాయపరమైన సలహాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపింది. సర్పంచ్‌లుగా ఎన్నికైన మహిళలకు అండగా ఉండేందుకు ఒక వ్యవస్థను సృష్టించాలని కమిటీ హితవు పలికింది.

## మార్చిలో భానుడి భగభగలే.. 124 ఏళ్లలో అత్యంత వేడి నెలగా ఫిబ్రవరి రికార్డ్




**న్యూఢిల్లీ-నవభూమి:** ఈసారి సూర్యుడి ప్రతాపం మరింత ఎక్కువగా ఉంటుందని భారత వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా మార్చి నెలలో ప్రారంభం అయ్యే ఎండలు.. ఈసారి ఫిబ్రవరి నెల మొదటి నుంచే దంచికొడుతున్నాయి. దీంతో మధ్యాహ్నం పూట ఇళ్లల్లో నుంచి బయటికి రావాలంటేనే జనం జంకుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడి ప్రతాపం కొనసాగుతూనే ఉండటంతో అవసరం అయితేనే బయటికి వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మార్చి నెల మండిపోతుందని ఐఎండీ అధికారులు వెల్లడించారు. ఇక గత నెల ఫిబ్రవరిలో భారీగా ఎండలు ఉన్నాయని.. అవి గత 124 ఏళ్లలోనే అత్యధికమని తేల్చి చెప్పారు. 124 ఏళ్లలో కెల్లా అత్యంత వేడి నెలగా ఫిబ్రవరి నమోదైనట్లు తెలిపారు. వేసవి ప్రారంభానికి ముందే సూర్యుడి ప్రతాపం తాళలేకుండా ఉంటోంది. ఫిబ్రవరి నుంచే మధ్యాహ్నం వేళ రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని ఐఎండీ అధికారులు పేర్కొన్నారు. దేశంలోని చాలా ప్రాంతాల్లో సగటు కంటే గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయని తెలిపారు. మార్చి రెండో వారం లేదా మూడో వారంలోనే తెలుగు రాష్ట్రాల్లో వడగాలుల ప్రభావం కనిపిస్తుందని వాతావరణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక ఏప్రిల్-జూన్ మధ్య 3 నెలల పాటు పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని హెచ్చరికలు చేస్తున్నారు. ఇక ఇప్పటికే కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు.. భారత వాతావరణ శాఖ అధికారులు వడగాలుల హెచ్చరికలు జారీ చేశారు. గత 124 ఏళ్లలో అత్యంత వేడి నెలగా ఫిబ్రవరి నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. గత నెలలో సగటున 22 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని పేర్కొన్నారు. 1901 తర్వాత ఫిబ్రవరిలో ఈ స్థాయి సగటు ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే తొలిసారి అని వెల్లడించారు. అంతేకాదు చరిత్రలోనే తొలిసారిగా ఈ ఏడాది ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు ఏకంగా 15 డిగ్రీలకు పైగా నమోదై సరికొత్త రికార్డును నెలకొల్పాయని తెలిపారు. ఇటీవలి కాలంలో 2023 ఫిబ్రవరి నెలలో నమోదైన సగటు అత్యంత గరిష్ఠ ఉష్ణోగ్రత కంటే ఎక్కువ ఉష్ణోగ్రత నమోదైనట్లు పేర్కొన్నారు. మరోవైపు.. ఈ ఏడాది మార్చి నెలలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని భారత వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. చాలా ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదు అవతాయని వాతావరణ శాఖ సీనియర్ శాస్త్రవేత్త డీఎస్ పాయ్ తెలిపారు. రానున్న నెలల్లో దేశవ్యాప్తంగా ఎండలు దంచికొట్టవచ్చని ఐఎండీ హెచ్చరికలు జారీ చేసిందిఇచ్చింది. మరోవైపు.. ఈ పరిస్థితులపై పర్యావరణవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుణుడు కరుణిస్తే తప్ప వచ్చే 3 నెలలు భానుడి భగభగలు తప్పవని చెబుతున్నారు. కర్బన ఉద్గారాలు, పట్టణీకరణ, అడవులు తగ్గడం వంటి కారణాల వల్లే ఏటా ఎండల తీవ్రత పెరుగుతోందని వెల్లడించారు.

## భార్య వేధింపులతో మరో టెకీ ఆత్మహత్య



**న్యూఢిల్లీ-నవభూమి:** బెంగళూరులో అతుల్ సుభాష్ ఆత్మహత్య ఘటన మరవక ముందే.. భార్య వేధింపులతో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో మరో టెకీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. 'దయచేసి.. మగవాళ్ల గురించి కూడా ఆలోచించండి..' అంటూ ఆత్మహత్యకు ముందు అతడు తీసుకున్న సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యూపీకి చెందిన 25 ఏళ్ల మానవ్ శర్మ ముంబైలోని టీసీఎస్‌లో మేనేజర్. ఏడాది కిత్రం అతడికి వివాహమవ్వగా.. ఈనెల 24న తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నికితా శర్మ తీవ్ర వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు దాదాపు 7 నిమిషాల చివరి సెల్ఫీ వీడియోలో.. 'నా భార్య వేరొకరితో సంబంధం పెట్టుకొని నాపైనే కేసులు పెడతానంటూ వేధిస్తోంది. నన్నెప్పుడు ఓ మనిషిలా కూడా చూడలేదు.. దయచేసి మగవాళ్ల గురించి ఎవరైనా మాట్లాడండి' అని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలోనే మానవ్ భార్య నికితా శర్మ స్పందించారు. 'మానవ్ మద్యానికి బానిసయ్యాడు. పలుమార్లు ఆత్మహత్యకు యత్నించాడు. 3సార్లు నేనే కాపాడాను' అని చెప్పారు.

## కర్ణాటకలో బర్డ్ ఫ్లూ.. రాష్ట్రమంతా హై అలర్ట్



**బెంగళూరు - నవభూమి:** కర్ణాటకలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్టు నిర్ధారణ కావడంతో రాష్ట్రమంతటా హై అలర్ట్ ప్రకటించారు. బెంగళూరు నగరానికి సమీపంలో ఉండే చిక్కబళ్లాపుర తాలూకాలో ఇంతవరకు 36 కోళ్లు మృతి చెందాయి. బళ్లారి జిల్లా సండూరు, రాయచూరు జిల్లా మాన్వి తాలూకా పరిధిలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకి మృత్యువాత పడుతున్నాయి. బెంగళూరులో శుక్రవారం వైద్యశాఖ అధికారుల ప్రత్యేక సమావేశం జరిగింది. రాష్ట్రమంతటా అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు సూచించారు. మనుషులకి ఎక్కడా బర్డ్ ఫ్లూ సోకిన దాఖలాలు లేవని అధికారులు స్పష్టం చేశారు.

## వైట్‌హౌస్‌లో ట్రంప్-జెలెన్‌స్కీ ఘర్షణ..

### తలపట్టుకున్న ఉక్రెయిన్ రాయబారి, వీడియో వైరల్



**న్యూఢిల్లీ-నవభూమి:** తాను అధికారంలోకి వస్తే.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగిస్తానని చెబుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఆ దిశగా చేస్తున్న చర్యలు మాత్రం ఫలించేలా కనిపించడం లేదు. తాజాగా అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో భేటీ అయిన ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ.. ఎలాంటి ఒప్పందం జరగకుండానే బయటికి వెళ్లిపోవడం గమనార్హం. ఇక వైట్‌హౌస్‌లో మీడియా ముందే ఇరువురు దేశాధినేతలు ఘర్షణకు దిగడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ట్రంప్, జెలెన్‌స్కీ భేటీలో వాడీవేడి చర్చ చోటుచేసుకోవడంతో.. శాంతి చర్చల్లో ఇలా జరిగిందేంటి అన్నట్లు ఉక్రెయిన్ రాయబారి ఒక్సానా మార్కరోవా తలపట్టుకుని ఆందోళన చెందుతున్న వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య నిర్వహించిన శాంతి చర్చల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఎలాంటి ఒప్పందం లేకుండానే వైట్‌హౌస్ నుంచి జెలెన్‌స్కీ వెళ్లిపోయారు. అయితే మొదట వారిద్దరి మధ్య శాంతియుతంగానే సమావేశం ప్రారంభం అయింది. కానీ కొద్దిసేపటికే అది వాగ్వాదానికి దారితీసింది. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ ప్రవర్తిస్తున్న తీరు.. మూడో ప్రపంచ యుద్ధానికి దారితీయవచ్చని జెలెన్‌స్కీ వైపు చేయి చూపిస్తూ డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహంతో చెప్పారు.

## టాటూలు వేసుకుంటున్నారా..

### ఎయిడ్స్, హెపటైటిస్ రావచ్చు.. సర్కార్ అలర్ట్



**న్యూఢిల్లీ-నవభూమి:** టాటూలు వేసుకునేవారికి ఇది షాకింగ్ న్యూస్. టాటూలు వేసేందుకు ఉపయోగించే పచ్చతో హెచ్‌ఐవీ ఎయిడ్స్, హెపటైటిస్ బీ, సీ వంటి వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. రోడ్ల పక్కన వేసే పచ్చబొట్లతో అనేక వ్యాధులు సోకుతున్నట్లు గుర్తించినట్లు వెల్లడించింది. వీటికి సంబంధించి ఇప్పటికే కొన్ని కేసులు నమోదు చేశామని.. ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని కర్ణాటక సర్కార్ తేల్చి చెప్పింది. టాటూలు వేయించుకోవడం చాలా మందికి ఇష్టం. కొందరు ఒకటి, రెండు టాటూలు వేసుకుంటే.. మరికొంతమంది అయితే ఒంటిపై ఎక్కడ పడితే అక్కడే పచ్చబొట్లు వేయించుకుంటూ ఉంటారు. ఇక టాటూలు వేసేందుకు చాలా మంది ఆర్టిస్ట్‌లు, టాటూ షాప్‌లు పుట్టుకొస్తున్నాయి. మరోవైపు.. రోడ్ల పక్కన, జాతర్లలో కూడా పచ్చబొట్లు వేసేవారు కనిపిస్తూనే ఉన్నారు. అయితే పరిశుభ్రత పాటించకుండా.. ఎలా పడితే అలా పచ్చబొట్లు వేసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలకు గురి అవుతున్నట్లు కర్ణాటక సర్కార్ తెలిపింది. దీనిపై ఏకంగా కర్ణాటక ఆరోగ్య శాఖ మంత్రి దినేష్ గుండూరావు స్పందించారు. బెంగళూరులోని ఆరోగ్య సౌధలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన దినేష్ గుండూరావు.. ఇలాంటివాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక టాటూలు వేయడానికి ఉపయోగిస్తున్న పచ్చతో చర్మ సంబంధిత వ్యాధులు, రకరకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని కర్ణాటక ఆరోగ్యశాఖ మంత్రి తెలిపారు. రోడ్డు పక్కన పరిశుభ్రతను పట్టించుకోకుండా వేసే పచ్చబొట్లతో హెచ్‌ఐవీ ఎయిడ్స్, హెపటైటిస్ సహా రకరకాల వ్యాధులు సోకుతున్నట్లు గుర్తించామని వెల్లడించారు. పచ్చబొట్లు వేసేందుకు ఉపయోగించే పచ్చలో ఉండే నాసిరకం రసాయనాల కారణంగా.. అది చర్మంలోని పొరలు, నరాల్లోకి వెళ్లి వివిధ ఆరోగ్య సమస్యలకు కారణం అవుతోందని పేర్కొన్నారు. ఆరోగ్య సురక్ష, ఔషధాల నాణ్యతను నిర్ధారించే నిపుణులు.. ఇప్పటికే పలుచోట్ల పచ్చబొట్ల ద్రావణాల నుంచి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

మరోవైపు.. టాటూ సిరాలో కలిపే రింగర్ లాక్టేట్ ద్రావణానికి సంబంధించి 246 బ్యాచ్‌లను పరీక్షించగా.. అందులో 113 నమూనాలు ఉపయోగించడానికి వీలు లేనివి అని తేలిందని దినేష్ గుండూరావు వెల్లడించారు. రింగర్ లాక్టేట్‌ను తయారు చేస్తున్న ఫార్మాస్యూటికల్స్ సంస్థపై ఇప్పటికే 9 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. వీటితోపాటు మరో 25 కేసులు కూడా నమోదు చేసేందుకు అనుమతిని ఇచ్చినట్లు వివరించారు. టాటూ వేసే ఇంకులో ఇల్యూమినేట్ లేదా మెరుపు కలపకుండా కేంద్ర ప్రభుత్వం బీఐఎస్ ద్వారా మరింత కఠినంగా నిబంధనలు చేయాలని ఈ సందర్భంగా దినేష్ గుండూరావు కోరారు.

## రాష్ట్ర హక్కుల రక్షణ కోసం పోరాడదాం: స్టాలిన్




**చెన్నై- నవభూమి:** రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం కేంద్రంపై పోరాటం సాగించాల్సిన సమయం ఆసన్నమైందని తమిళనాడు సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు. జాతీయ విద్యావిధానం పేరుతో నిర్బంధ హిందీ అమలు, నియోజకవర్గాల పునర్విభజన పేరిట లోక్‌సభ స్థానాలు తగ్గించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. శనివారం తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పార్టీ కార్యకర్తలకు స్టాలిన్ బహిరంగ లేఖ రాశారు.

పుట్టినరోజు వేడుకలను నిరాడంబరంగా జరుపుకోవటం తనకు అలవాటు అని.., అయితే ఈసారి హిందీ వ్యతిరేకోద్యమం దిశగా ప్రేరేపించాల్సిన అవసరమున్నందున పార్టీ శ్రేణులందరిని కలుసుకోవాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. అప్రమత్తంగా వ్యవహరించకపోతే రాష్ట్రంలో హిందీ రాజ్యమేలి తమిళభాష పత్తాలేకుండా పోతుందని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, త్రిభాషా విద్యావిధానం అత్యంత అవసరమని తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి అన్నారు.

## సీబీఎస్ఈ పదో తరగతిలో ఇంగ్లిష్, హిందీ తప్పనిసరా?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇక నుంచి ఏటా రెండు సార్లు పదో తరగతి పరీక్షలు నిర్వహించే విషయమై సీబీఎస్ఈ విడుదల చేసిన ముసాయిదా విధానంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీని ప్రకారం ప్రథమ భాషగా ఇంగ్లిష్, ద్వితీయ భాషగా హిందీ, ఐచ్ఛికభాషలుగా ప్రాంతీయ, విదేశీ భాషలు ఉండనున్నాయి. దీన్ని చూస్తుంటే ఇంగ్లిష్, హిందీ తప్పనిసరి భాషలుగా చదవాల్సి ఉంటుందన్న అనుమానాలు కలుగుతున్నాయని పలువురు అంటున్నారు. ఇంగ్లిష్, హిందీ పరీక్షలకు నిర్ణీత తేదీలను కూడా ప్రకటించారు. మిగిలిన అన్ని భాషలకు ఒక్క రోజే పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. దీని ప్రకారం హిందీ తప్పనిసరి అన్న అభిప్రాయం కలుగుతోంది.ప్రాంతీయ భాషల జాబితాలో పంజాబీ లేకపోవడాన్ని అక్కడి ప్రభుత్వం ఎత్తిచూపింది. ఈ సందర్భంగానే ఇంగ్లిష్, హిందీ తప్పనిసరి సబ్జెక్టులా అన్న చర్చ తలెత్తింది. దీనిపై సీబీఎస్ఈ వివరణ ఇస్తూ ఇది ఖరారు చేసిన జాబితా ఏమీ కాదని తెలిపింది. తుది జాబితాలో అన్ని భాషలకు చోటు ఉంటుందని పేర్కొంది. ఇంగ్లిషను ప్రథమ భాషగా, హిందీని ద్వితీయ భాషగా ఎందుకు పేర్కొన్నారనేదానిపై ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ఈ ముసాయిదాపై మార్చి 9లోగా అభిప్రాయాలు చెప్పే అవకాశం ఉండడంతో మరికొన్ని రకాల సందేహాలు కూడా బోర్డు దృష్టికి వెళ్లే అవకాశం ఉంది.



## అందరూ ఆ రాష్ట్రం వైపే చూస్తున్నారు

ఒక రాష్ట్రం మరో రాష్ట్రానికి ఆదర్శం అవ్వటం ఇప్పుడున్న పోటీ రాజకీయాల్లో అంత సులువు కాదు. దేశవిదేశీ పెట్టుబడులను ఆకర్షించటంలో రాష్ట్రాల మధ్య పోటీ ఇంతా అంతా అని చెప్పలేం. గతం తాలూకు ఘనతల గురించి చెప్పుకునేటప్పుడు కూడా ఒకమెట్టు పైనే ఉండేట్లుగా ప్రతి రాష్ట్రమూ ప్రయత్నిస్తుంది. ఇక తమ గడ్డ మీద వ్యాపార అనుకూలతల గురించి, వాటిని అద్భుతంగా ప్రోత్సహించే తమ ప్రభుత్వ విధానాల గురించి ఏ రాష్ట్రమైనా సొంత గొప్పలు చెప్పుకుంటుందే తప్ప మరో రాష్ట్రంపై ప్రశంసా ప్రవచనాలు పలకదు. ఇదంతా ఆరోగ్యకరమైన పోటీనే అనుకుందాం! ప్రచారంలో ముందుండి పెట్టుబడులను ఆకర్షించటం సహజమే అనుకుందాం! కానీ దీనికి భిన్నంగా ఒక రాష్ట్రం ఇప్పుడు అందరికీ ఆదర్శప్రాయమైపోయింది. ఇటీవల అందరూ ఆ రాష్ట్రం వైపే చూస్తున్నారు. దాన్నే అనుకరించాలని ప్రయత్నిస్తున్నారు.

విద్య, ఉద్యోగ రిజర్వేషన్ల విషయంపై 100 ఏళ్ల క్రితమే ఒక చరిత్ర సృష్టించిన తమిళనాడు ఇప్పటికీ ఏదోరకంగా ఆ ఒరవడిని కొనసాగిస్తూనే ఉంది. పెద్ద రాష్ట్రాల్లో ఎక్కడాలేని విధంగా దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి 69 శాతం రిజర్వేషన్లను (బీసీ-30 శాతం, ఎంబీసీ-20 శాతం, ఎస్సీ-18శాతం, ఎస్టీ-1శాతం) అమలుపరుస్తూ ఉండటమే దీనికి నిదర్శం. ఆ అంకెలకు దగ్గరగా ఉండాలనే రాష్ట్రాలకు ఇప్పుడు తమిళనాడు ఆదర్శంగా మారింది. ఎక్కువ శాతం రిజర్వేషన్లను అమలుపరచటమే కాకుండా వాటిని సర్వోన్నత న్యాయస్థానం సమీక్షకు దూరంగా.. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పెట్టించటంలో కూడా తమిళనాడు సఫలమైంది. మరాఠాలకు రిజర్వేషన్లను (విద్య%-%12 శాతం, ఉద్యోగాలు%-%13శాతం) కల్పించటానికి మహారాష్ట్ర చేసిన ప్రయత్నాలకూ, 2023లో కులగణన జరిపి బిహార్ చేపట్టిన చర్యలకూ తమిళ రిజర్వేషన్లే ప్రేరణ. కులగణనకు అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించి, వందల కోట్లు ఖర్చుపెట్టి, కులాల జనాభాతో పాటు విద్య, ఉద్యోగాలు, ఆర్థిక వివరాలు సేకరించిన అనంతరం రిజర్వేషన్లను (65శాతం) పెంచుతూ బిహార్‌లో చట్టం చేసినా హైకోర్టు కొట్టివేసింది. సుప్రీంకోర్టుకు ఎక్కినా ఊరట దక్కలేదు. ఆర్థికంగా బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) కేంద్ర ప్రభుత్వం కల్పించిన 10శాతం రిజర్వేషన్లతో.. సుప్రీంకోర్టు గతంలో నిర్దేశించిన 50శాతం రిజర్వేషన్ల పరిమితికి అడ్డంకి తొలగిపోయిందనే వాదనకూ ఆమోదం లభించలేదు. రిజర్వేషన్లు 50 శాతానికి మించి పెంచటానికి చాలా రాష్ట్రాల్లో చేసిన ప్రయత్నాలకు ఏదో ఒక స్థాయిలో న్యాయస్థానాలు నిలువరించాయి. మహారాష్ట్ర, బిహార్‌తో పాటు రాజస్థాన్, హర్యాణ, జార?ండ్, ఛత్తీస్‌గఢ్‌లు ఈ పరిస్థితిని ఎదుర్కొన్నాయి. రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలు కల్పించిన రక్షణతో ఈశాన్య రాష్ట్రాలు మాత్రం 50 శాతానికి మించి రిజర్వేషన్లను పెంచుకోగలిగాయి.

1992లో ఇచ్చిన మండల్ తీర్పును సుప్రీంకోర్టు పునఃసమీక్షించనంత వరకూ రిజర్వేషన్లను 50 శాతాన్ని దాటించటం సాధ్యం కాదు. 69 శాతం రిజర్వేషన్ల పరిరక్షణకు తమిళనాడు ప్రభుత్వం 1994లో తీసుకువచ్చిన చట్టాన్ని రాజ్యాంగం తొమ్మిదో షెడ్యూల్లో పెట్టటం ఆనాటి రాజకీయ పరిస్థితుల్లో మాత్రమే సాధ్యమైంది. పీవీ నరసింహారావు నేతృత్వంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అన్నాడీఎంకే మద్దతుపై ఆధారపడి ఉంది. 1991 ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీచేసి 39 లోక్‌సభ స్థానాల్లోనూ గెలిచాయి. అదొక అసాధారణ రాజకీయ సన్నివేశం. అందుకే తమిళనాడు ఒత్తిడి ఫలించింది. ఆ తర్వాత అలాంటి ఒత్తిడి కేంద్రానికి ఎదురుకాలేదు. బిహార్‌లో నితీశ్‌కుమార్ ప్రభుత్వం కూడా 65 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ తీసుకొచ్చిన చట్టాలను తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టించలేకపోయింది. ఇక 9వ షెడ్యూల్‌లో పెట్టినంత మాత్రాన సుప్రీంకోర్టు నుంచి రక్షణ ఉంటుందని చెప్పటానికి వీల్లేదు. 2007లో ఇచ్చిన తీర్పులోనే సుప్రీంకోర్టు ఆ విషయాన్ని స్పష్టంచేసింది. రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి విరుద్ధంగా ఉన్న చట్టాలను 9వ షెడ్యూల్‌లో పెట్టినప్పటికీ న్యాయసమీక్ష నుంచి మినహాయింపు లభించదని తేల్చి చెప్పింది. ఆ తీర్పు తర్వాత తమిళనాడు రిజర్వేషన్లకు సంబంధించి దాఖలైన పిటిషన్ ఇంకా సుప్రీంకోర్టులో పెండింగులోనే ఉంది. అందుకే తమిళనాడు రిజర్వేషన్లపై వివాదాన్ని ముగిసిన అధ్యాయంగానూ భావించలేం.ఇప్పటివరకూ జరిగిన పరిణామాలను సమగ్ర దృక్పథం నుంచి చూస్తే రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచటానికి మామూలు స్థాయి కసరత్తు సరిపోదు. అసాధారణరీతిలో రాజకీయంగా ఏకాభిప్రాయం అందుకు అవసరం. ఇప్పుడున్న పరిస్థితుల్లో అది సాధ్యమవుతుందనీ చెప్పలేం. దేశవ్యాప్త కులగణన కోసం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానాన్ని ఆమోదించి కిందటి లోక్‌సభ ఎన్నికల్లో దాన్నే ప్రధాన అంశంగా చేసుకుని పోరాడినా అనుకున్న ఫలితాలను సాధించలేదు. బీజేపీ నేతృత్వంలోని పాలకకూటమి నుంచి కులగణనపై ఇంతవరకూ సానుకూల ప్రకటన వెలువవడలేదు. అసలు ఆ కూటమి అత్యున్నత స్థాయి సమావేశాల్లో దాన్నొక ముఖ్య అంశంగా పరిగణించి చర్చించిన దాఖలాల్లేవు.రిజర్వేషన్లను రాజకీయ లాభనష్టాల ఎత్తుగడల్లో భాగంగా మార్చటంలో పార్టీలన్నిటి పాత్రా ఉంది. బీసీలను వర్గీకరించటానికి నియమించిన జస్టిస్ రోహిణి కమిషన్ ఇచ్చిన నివేదిక గురించి కేంద్రం ఇప్పటివరకూ ఒక్కమాట మాట్లాడలేదు. ఏళ్లు గడుస్తున్నా అందులో ఏముందో బహిరంగం చేయటానికి బీజేపీకి రాజకీయ అనుకూలత కనపడటం లేదు. ఆర్థికంగా తీవ్రమార్పులకు లోనవుతున్న సమాజంలో కులాల వెనుకబాటుతనం, కులాలమధ్య అసమానతల గురించి ఎప్పుడో ఏర్పరుచుకున్న కొన్ని భావాలను మార్చుకోవాల్సి ఉంటుంది. బీసీ వర్గంలో ఉన్న కొన్ని కులాలే అధిక లబ్ధిని పొందాయి. మొన్నటి బిహార్ కులగణనలో అదే తేలింది. తమిళనాడు మొదటి బీసీ కమిషన్ కూడా ఈ విషయాన్ని 1971లోనే చాలా స్పష్టంగా వెల్లడించింది. బీసీల్లోని 11 శాతం కులాలు 37శాతం నాన్‌గజిటెడ్, 48శాతం గజిటెడ్ పోస్టులనూ 47శాతం ఇంజనీరింగ్, 34శాతం మెడికల్ సీట్లనూ, 34శాతం స్కాలర్‌షిప్‌లనూ దక్కించుకున్నట్లు కమిషన్ ఛైర్మన్ సత్తనాథన్ స్పష్టంచేశారు. ఇటువంటి గుత్తాధిపత్యాన్ని నిరోధించటానికి ఏడాదికి రూ.9000 ఆదాయం దాటని వారికే బీసీ రిజర్వేషన్లు ఉండాలని ప్రతిపాదించారు. ఆనాటి కరుణానిధి ప్రభుత్వం ఆ సిఫార్సును పట్టించుకోలేదు. కానీ ఆ తర్వాత వచ్చిన ఎంజీ రామచంద్రన్ ప్రభుత్వం 1979లో ఆ సిఫార్సుని అమల్లోకి తెచ్చింది. డీఎంకే ప్రభుత్వం దీన్నొక రాజకీయ అంశంగా మార్చి అప్పుడు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకేను ఓడించింది. దీంతో ఎంజీఆర్ ఆదాయ పరిమితి జీవోను ఉపసంహరించుకుని డీఎంకేని రాజకీయంగా దెబ్బతీయటంలో భాగంగా రిజర్వేషన్లను ఒక్కసారిగా 49శాతం నుంచి 69శాతం పెంచేశారు. సత్తనాథన్ కమిషన్ 33శాతం రిజర్వేషన్లను బీసీలకు ప్రతిపాదిస్తే డీఎంకే ప్రభుత్వం 31 శాతానికే పరిమితం చేసింది.

# నియోజకవర్గాల పునర్విభజన వెనుక ఎజెండా



నియోజకవర్గాల పునర్విభజన కసరత్తు(డీలిమిటేషన్ ఎక్సర్‌సైజ్)ను ముందుకు తీసుకురావడానికి మోడీ-షా ద్వయం అన్యాయమైన తొందరపాటు అమితమైన ఆసక్తి, కార్యనిర్వాహక పాలనలో, హిందీ పెత్తనాన్ని అధికం చేయడం గా వున్నది, 'ఒక దేశం ఒకే ఎన్నికలు' మొదలైన వాటికి కొనసాగింపుగా ఎన్నికల సంఘం యొక్క తాజా మార్పుల కొనసాగింపులో మరొక తెలివిగల ఫాసిస్ట్ చర్య ఇది. 1971 - 2024 మధ్య కాలంలో వివిధరాష్ట్రాలలో దేశవ్యాప్తంగా జనాభా పెరుగుదలలో విస్తారమైన వ్యత్యాసాలు ఉన్నప్పటికీ, 1973 నుండి వివిధ భారతీయ రాష్ట్రాల నుండి లోక్‌సభ ప్రతినిధుల నిష్పత్తిలో ఎన్నికల నియోజకవర్గాల సంఖ్యలో ఎటువంటి మార్పు లేదు. 1971లో మొదటి సీట్ల స్తంభన తర్వాత, 2001లో రెండవ సారీ పునర్విభజన (ఫ్రీజ్) వచ్చింది.ఇది 2026లో ముగుస్తుంది. ఈ పొడిగింపు యొక్క అసలు ఉద్దేశ్యం, తగ్గిన సంతానోత్పత్తి రేటుతో దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే జనాభా నియంత్రణ చర్యలలో విఫలమైన హిందీ మాట్లాడే ఉత్తర భారత రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటును పొడిగించడం మరియు ప్రోత్సహించడంగా వుంటుంది. అందువల్ల, దక్షిణాది రాష్ట్రాలు ఎత్తి చూపినట్లుగా, కేవలం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన( డీలిమిటేషన్) కసరత్తు చేస్తే, పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల వారి ప్రాతినిధ్యం తగ్గిపోతుంది. మరియు మొత్తం అధికార సమతూకం వారికి వ్యతిరేకంగా ఉంటుంది. మరియు ఇది భారతదేశంలో సమాఖ్య విధానానికి( ఫెడరలిజానికి) మరణ శాసనం అవుతుంది. ప్రస్తుత చట్టం ప్రకారం, జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్ )నిర్వహించాల్సి ఉంటుంది కాబట్టి, ఏళ్ల తరబడి జనాభా పెరుగుదలను ఉద్దేశపూర్వకంగా తగ్గించిన దక్షిణాది రాష్ట్రాలు దాని ద్వారా నష్టపోవడంతో పాటు జరిమానా విధించబడతాయి, పార్లమెంట్లో వారి సంఖ్య తగ్గుతాయి. అందుకే జనాభాతో పాటు ఇతర ప్రమాణాలను తీసుకోవాలనే



డిమాండ్‌ను సమాఖ్య స్ఫూర్తిగా (ఫెడరలిజం యొక్క )ప్రతిపాదకులు బలంగా ముందుకు తెచ్చారు, అంటే రాష్ట్రాల నుండి లోక్‌సభ ప్రతినిధుల నిష్పత్తిని అలాగే ఉంచవచ్చు. అయితే, దక్షిణాది రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని, విస్తృత ఏకాభిప్రాయం ద్వారా సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి బదులు, ఫాసిస్ట్ పాలనలో ఇప్పటివరకు ఉన్న ఎత్తుగడలు ఏకపక్షంగానూ మరియు ఒంటెత్తు పోకడ గాను ఉన్నాయి. ఉదాహరణకు, 1971-2024 జనాభా పెరుగుదల రేటు ఆధారంగా నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) కసరత్తు చేస్తే, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లతో కూడిన నాలుగు రాష్ట్రాల్లో 155 లోక్‌సభ స్థానాలు పెరగనుండగా, ఐదు దక్షిణ భారత రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళలో కలిపి 35 లోక్‌సభ స్థానాలు మాత్రమే పెరుగుతాయి. మళ్లీ, ప్రస్తుతం ఉన్న జనాభాను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గాలపునర్విభజన (డీలిమిటేషన్) చేస్తే, రెండు రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్ , బీహార్‌లకు మొత్తం దక్షిణ భారతదేశం కంటే ఎక్కువ మంది పార్లమెంటు సభ్యులు ఉంటారు. కావున నియోజకవర్గాల సరిహద్దులను పునర్నిర్మించేటప్పుడు రాష్ట్రాలకు ప్రస్తుతం ఉన్న ఎంపీల నిష్పత్తి నిర్వహణపై విశ్వసనీయమైన హామీ అవసరం.

అయితే, కేంద్రంలోని ఫాసిస్ట్ పాలన, ప్రతి సమస్యను చాకచక్యంగా ఉపయోగించుకోవడంలో నేర్పరి. వివిధ సాకులతో, కారణాలతో 2021 జనాభా గణనను నిరవధికంగా వాయిదా వేస్తున్నప్పటికీ, తన సమాఖ్య వ్యతిరేక, ఏకీకృత ఎజెండాకు అనుగుణంగా నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) కసరత్తును ఉపయోగించుకోవడానికి మొగ్గు చూపుతోంది. ఖచ్చితంగా చెప్పాలంటే, రాష్ట్రీయ స్వయంసేవక సంఘ (ఆర్ఎస్ఎస్) నయాఫాసిజం కింద, నియోజకవర్గాల పునర్విభజన కసరత్తు(డీలిమిటేషన్ ), ఇతర రాజ్యాంగ, చట్టపరమైన మరియు పరిపాలనాపరమైన ఎత్తుగడల మాదిరిగానే, భారత సమాఖ్య స్ఫూర్తిని(ఫెడరలిజాన్ని) కూల్చివేయడానికి మరియు భారతదేశం యొక్క బహుభాషా, బహుళ సాంస్కృతిక, బహుళ-జాతుల స్వభావాలను బలహీనపరిచే పాన్-ఇండియన్ మెజారిటీ ప్రాజెక్టను అధిగమించడానికి ఉద్దేశించి ఫాసిస్ట్ రాజ్యం ఆలోచించి చేస్తున్న దుర్మార్గపు చర్య ఇది . భారతదేశంలో సమాఖ్య వాదం( ఫెడరలిజం) యొక్క వినాశనాన్ని ప్రవచించే ఈ హడావిడి నియోజకవర్గాల విభజన కసరత్తులో(డీలిమిటేషన్ ) స్వాభావిక ఫాసిస్ట్ ఎజెండాను ప్రతిఘటించడానికి మరియు ఓడించడానికి అన్ని ప్రజాస్వామ్య, లౌకిక మరియు ప్రగతిశీల శక్తులు మరియు అన్ని రంగాల శ్రేయోభిలాషులకు, వర్గాలకు మేము విజ్ఞప్తి చేస్తున్నాము.

**పి జె జేమ్స్, ప్రధాన కార్యదర్శి, సిపిఐ (ఎం.ఎల్) రెడ్ స్టార్, న్యూఢిల్లీ**

**స్వేచ్ఛానుసరణ: మన్నవ హరిప్రసాద్, బ్యూరో సభ్యుడు సిపిఐ -(ఎం.ఎల్) 82477 28296**

## తూర్పు కనుమలు ఉపాధి గనులు

ఆంధ్రప్రదేశ్‌లో అపార ఉద్యోగ అవకాశాలు ఉన్న రంగం మొక్కలు తయారీ. అంటే నర్సరీ పరిశ్రమ. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ మొక్కల పుట్టిల్లుగా ఉండేది. కాలక్రమేణా ఆంధ్రప్రదేశ్ నర్సరీ రంగంలో చాలా మార్పులు వచ్చాయి. ఉత్పత్తిదారులుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ నర్సరీ రైతులు కేవలం వ్యాపారులుగా మారారు. దీనివల్ల నర్సరీ రంగంలో అపార అవకాశాలను అందిపుచ్చుకోవడంలో రాష్ట్రం వెనుకబడింది. ఈ అవకాశం అందుకుని మహారాష్ట్రలోని పూణే, కేరళలోని చాలా ప్రాంతాలు, బెంగాల్‌లోని 24 పరగణాలు, ఇతర ప్రాంతాల్లో నర్సరీ రంగం బాగా అభివృద్ధిచెంది వారు ఉత్పత్తిదారులుగా మారారు. ఫలితంగా ఆయా రాష్ట్రాల్లో లక్షలాది ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి.

మన రాష్ట్రంలో నర్సరీ రంగం ప్రధానంగా కడియం పరిసర మండలాల్లో వ్యాపించి ఉంది. 1980 ప్రాంతంలో వీరు మొక్కల ఉత్పత్తిదారులుగా ఉండేవారు. తరువాత వచ్చిన మార్పుల వల్ల కడియం ప్రాంతం వెనకబడిపోయింది. దీనికి ప్రధానమైన కారణం నర్సరీ రంగంలో వచ్చిన కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందలేకపోవడమే. దీనిని మహారాష్ట్ర అందిపుచ్చుకుంది. అక్కడి ప్రభుత్వ సహకారం, అనుకూల వాతావరణం కలిసివచ్చింది. ఫలితంగా దేశంలో మహారాష్ట్ర... ముఖ్యంగా పూణే ప్రాంతం నర్సరీ హబ్‌గా మారింది. లక్షలాదిమందికి ఉపాధి లభించింది. మహారాష్ట్ర ప్రభుత్వం నర్సరీ రంగాన్ని, ఉద్యానవన పరిశ్రమలను ప్రోత్సహించింది. పింప్రీ దగ్గర ఇంద్రాణి నది పరివాహక ప్రాంతంలో వేలాది ఎకరాలలో పూల సాగుకు ఒక ప్రత్యేకమైన పారిశ్రామిక ప్రాంతాన్ని కేటాయించింది. దానితో నర్సరీ పరిశ్రమ పూణే పరిసర ప్రాంతాలలో విస్తరించింది. పూల సాగుకు అవసరమైన మొక్కలను తయారు చేయడంతో పాటు ఇతర అలంకరణ మొక్కలను కూడా పెద్ద ఎత్తున తయారు చేయడం ప్రారంభించారు. ఈ ప్రాంతంలో వందలాది టిష్యూ కల్చర్ లేబరేటరీలు ఏర్పాటయ్యాయి. సబ్సిడీలతో పాటు శీతల గిడ్డంగులు, నీరు, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పాలిహౌస్‌లు వంటి ఇతర మౌలిక సదుపాయాలు అందించింది. తద్వారా మహారాష్ట్ర ప్రభుత్వం నర్సరీలను ఒక ప్రధాన ఉపాధి మార్గంగా మలిచింది. ఈ హరిత పరిశ్రమను ఒక మంచి పారిశ్రామిక అభివృద్ధిగా భావించి ప్రోత్సహించింది. దీనితో అత్యంత చవకగా పూణే ప్రాంతాల్లో మొక్కలు లభించడం వల్ల ఇతర ప్రాంతాల నర్సరీ వ్యాపారులు పూణే మీద ఆధారపడ్డారు. మన మొక్కల తయారీ కుంటుబడిపోయింది. కొత్త తరం రంగంలోకి వచ్చింది. వీరు మొక్కలు తెచ్చి అమ్ముకునేందుకు పరిమితమై, ఉత్పత్తిని వదిలేశారు. దీనితో మనకి దక్కాల్సిన ఉపాధి అవకాశాలు దక్కకుండా పోయాయి.అయితే ఇప్పటికీ మనకు చాలా అవకాశాలు ఉన్నాయి. మంచినీరు, అనువైన వాతావరణం ఉంటే లక్షలాది మందికి నర్సరీ పరిశ్రమ ద్వారా ఉపాధి కల్పించవచ్చు. పూణే లాంటి వాతావరణం మనకు చాలా ఎక్కువ ఉంది. చిత్తూరు పరిసర ప్రాంతాలు, మదనపల్లి హార్సిలీ హిల్స్ ప్రాంతం. విస్తారమైన తూర్పు కనుమలు మరొక ఎత్తు. ఇక్కడ సహజంగానే ఉండే చల్లటి వాతావరణం మొక్కలు ఉత్పత్తికి ప్రాణప్రదం. సీలేరు, చింతపల్లి, పెదబయలు, పాడేరు, అరకు, డుంబ్రిగుడ ప్రాంతాల్లో మనం మొక్కల ఉత్పత్తి కేంద్రాలను అభివృద్ధి చేయవచ్చు. దీనివల్ల తూర్పు కనుమల్లో ఉండే గిరిజనులకు ఉపాధి అవకాశాలకు కొదవ ఉండదు. నర్సరీ, పూల సాగు, ఉద్యాన పంటలు పరిశ్రమ స్థాయిలో అభివృద్ధి చెందుతాయి. ప్రస్తుతం ఇవి నమూనాలకే ప్రయోగాలు జరుగుతున్నాయి. అలాగే మన రాష్ట్రం నుంచి దేశ విదేశాలకు మొక్కలను, పూలను ఎగుమతి చేయవచ్చు.దీనికి కావలసింది చిత్తశుద్ధి. టిష్యూ కల్చర్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకురావడం, సహజ వనరులను సద్వినియోగం చేసుకోవడం, ప్రభుత్వం తగినంత నిధులను వినియోగించి నర్సరీ పరిశ్రమను ఈ ప్రాంతంలో విస్తరించేలా చేయడం జరగాలి. దీనికి అవసరమైన సలహా సంప్రదింపులను రాష్ట్రంలో ఉన్న నర్సరీ సంఘాల ద్వారా సమీకరించాలి. వారిని కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం అవసరం. ఇలా చేయడం వల్ల గిరిజన ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగాన్ని నిర్మూలించవచ్చు. అలాగే మంచి వాతావరణంలో ప్రపంచ స్థాయిలో ప్రామాణికత కలిగిన మొక్కలను మనం ఉత్పత్తి చేయవచ్చు. అప్పుడు దేశంలోనే మొక్కల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానానికి చేరుకుంటుంది. దీనికి ప్రభుత్వం చేయాల్సిందల్లా సంబంధిత నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి కేంద్ర వ్యవసాయశాఖ నుంచి ఈ ప్రత్యేక పథకానికి నిధులు వచ్చేలా చూసుకోవడం. మహారాష్ట్రలో లాగ తూర్పు కనుమల్లో ప్రత్యేకమైన నర్సరీ పారిశ్రామిక వాడను నెలకొల్పడం, తూర్పు కనుమల్లో ఉన్న నీటి వనరులను వినియోగించుకోవడం వంటి చర్యలు చేపట్టాలి.ఈ ఉద్యానవన పరిశ్రమ వల్ల లాభాలేమిటంటే గిరిజన ప్రాంతాలలో వేలాదిమందికి ఉపాధి లభిస్తుందిబీ మన రాష్ట్రం నుంచి మేలైన మొక్కల ఉత్పత్తి పెరుగుతుందిబీ ఈ మొక్కలను అనేక రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేయవచ్చుబీ వీటివల్ల మన రాష్ట్రం మొక్కల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలుస్తుందిబీ నర్సరీ పరిశ్రమ వృద్ధి చెందుతుంది. దీనితో అనేక అనుబంధ పరిశ్రమలు కూడా ఏర్పాటవుతాయి.

## ఉపవాసాలు ఎందుకు పాటించాలి?



పవిత్రరమజాన్ రాకడతో శుభాల పర్వం మొదలయింది. ముస్లిములు ఎంతో ఉత్సాహంతో ఉపవాస దీక్షలు ప్రారంభిం చారు. భక్తిశ్రద్ధలతో పవిత్రఖురాన్ పారాయణం చేస్తున్నారు. మసీదులన్నీ భక్తులతో నిండిపోతున్నాయి. చిన్నపిల్లలుసైతం రోజా పాటించడానికి ఉబలాటపడుతున్నారు. దీనిక్కారణం ఏమిటి? అసలుఉపవాసం ఎందుకుండాలి? దానివల్లకలిగే ప్రయోజనం ఏమిటి?దీనికిస్వయంగా దైవమే,'ఉపవాసం వల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది అంటున్నాడు. భయ భక్తులంటే ఏమిటి? మానవుడి మనస్సు దుష్కర్మలపట్ల ఏవగింపును, అసహ్యతను ప్రకటిస్తూ, సత్కర్మల పట్ల అధికంగా మొగ్గుచూపే ఒకానొక స్థితి. ఈస్థితిని మానవ ఆంతర్యంలో జనింపజేయడమే ఉపవాసాల అసలు ఉద్దేశ్యం. అందుకని ఉపవాసం పాటించేవారు బాహ్య పరిశుభ్రతతోపాటు, అంతఃశ్శుద్ధిని కూడాపాటించాలి. నోటిని నియంత్రణలో ఉంచుకోవాలి. అయినదానికీ కానిదానికీ కలగజేసుకొని వాగుడుకాయలా వదరకూడదు. మాట్లాడేఅవసరం లేకపోతే మౌనంపాటించాలి. ఇతరులెవరైనా అకారణంగా రెచ్చగొట్టినా, కయ్యానికి కాలుదువ్వినా తాముఉపవాసదీక్ష పాటిస్తున్నామన్న విషయాన్ని మరిచిపోకూడదు. ఈ స్పృహ ఉన్నప్పుడే అన్నిరకాల చెడులనుండి సురక్షితంగా ఉండేఅవకాశం ఉంటుంది. ఉపవాసదీక్ష పాటిస్తున్నప్పటికీ అసత్యం పలకడం, అసత్యాన్ని ఆచరించడం మానుకోనివారు నిజానికి వ్రతం పాటిస్తున్నట్లుకాదు. కేవలం పస్తులుండడంతో సమానం. ఉపవాసదీక్షల పేరుతో ఇలా ఆకలిదప్పులతో పడిఉండడం పట్ల దైవానికి ఏమాత్రం ఆసక్తిలేదు. ముహమ్మద్ ప్రవక్త(స) ఇలాచెప్పారు: 'ఉపవాసదీక్ష పాటించే చాలామందికి, తమ ఉపవాసాలద్వారా ఆకలిదప్పుల బాధతప్ప, మరెలాంటిప్రయోజన మూచేకూరదు'.

ఒకసారి ఉపవాసదీక్ష పాటిస్తున్న ఇద్దరువ్యక్తులు మసీదులో జొహర్ , అసర్ నమాజులు చేశారు. నమాజు ముగిసిన తరువాత ముహమ్మద్ ప్రవక్త(స) వారినుద్దేశించి,' మీరిద్దరూ మళ్ళీ వజూచేసి నమాజు చేయండి. అలాగే ఈఉపవాసాన్ని పూర్తిచేసి, తరువాత దీని 'ఖజా' (దీనికి బదులు మరొక ఉపవాసం) కూడా పాటించండి'.అని ఆదేశించారు. దానికివారు, 'దైవప్రవక్తా! మేము నమాజులూ ఆచరించాం, రోజా కుడా పాటించాం కదా?మళ్ళీఎందుకు?' అనిప్రశ్నించారు. అప్పుడు ప్రవక్త మహనీయులు, 'మీరుఫలానా వ్యక్తిని అతని పరోక్షంలో నిందించారుకదా, అందుకని'. అనిసమాధానం చెప్పారు. అంటే, ఉపవాసలక్ష్యం మనిషిని ఆకలిదప్పులతో మాడ్చి ఉంచడం ఎంత మాత్రం కాదు. దైవాదేశ ´పాలనలో మరింత రాటుదేలేవిధంగా తీర్చిదిద్దడం. దైవవిధేయతా పరిధిని ఏమాత్రం అతిక్రమిం చకుండా, అన్నిరకాల చెడులనుండి సురక్షితంగా ఉంచడం. సైనికులకు నిర్బంధశిక్షణ ఇచ్చినట్లు, ఏడాదికొకసారి నెలరోజులపాటు నైతికవిలువలు, దైవాదేశపాలన




అభ్యాసం చేయించడం. నెల్లాళ్ళశిక్షణ అనంతరం మిగతా పదకొండు నెలలకాలం దీని సత్ప్రభావం జీవితాల్లో ప్రసరించే విధంగా ఏర్పాట్లుచేయడం. పవిత్రరమజాన్ లో ఏవిధంగా అన్నిరకాల చెడులకు, అవలక్షణాలకు దూరంగా సత్కార్యాల్లో, దానధర్మాల్లో, దైవధ్యానంలో, సమాజ సంక్షేమ కార్యకలాపాల్లో పాల్గొంటారో, అలాగే మిగతా కాలమంతా సమాజంలో శాంతి, న్యాయం, ధర్మం పరిఢవిల్లుతూ జీవితం సాఫీగా గడిచిపోవాలని, పరలోక సాఫల్యం సిద్ధించాలన్నది అసలుధ్యేయం. ఈరమజాన్ లో అటువంటి తర్ఫీదు పొందేభాగ్యం ప్రతి ఒక్కరికీ దక్కాలని మనసారా కోరుకుందాం.

**- యండి. ఉస్మాన్ ఖాన్**

భక్తి

## యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు



ఇటీవలే స్వర్ణ విమాన గోపుర ఆవిష్కరణ పూర్తి చేసుకున్న యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఫాల్గుణ శుద్ధ విదియ నాడు (మార్చి 1న) ప్రారంభం. మార్చి 11వ తేదీ... ఫాల్గుణ శుద్ధ ద్వాదశి వరకూ కొనసాగే ఈ ఉత్సవాల్లో భాగంగా వివిధ అలంకార, వాహన సేవలు, స్వామి వారి కళ్యాణం, రథోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు.మార్చి 1: ఉదయం 10 గంటలకు విష్వక్సేన ఆరాధన, స్వస్తివాచకం, రక్షా బంధనంబీ సాయంత్రం 6.30 గంటలకు మృత్సంగ్రహణం, అంకురారోపణం

మార్చి 2: ఉదయం 8 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, 11 గంటలకు ధ్వజారోహణంబీ సాయంత్రం 6.30 గంటలకు భేరీ పూజ, దేవతాహ్వానం, హవనం

మార్చి 3: ఉదయం 9 గంటలకు మత్స్యావతార అలంకార సేవ, వేద పారాయణలు ప్రారంభంబీ రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ

మార్చి 4: ఉదయం 9 గంటలకు వటపత్రశాయి అలంకార సేవబీ రాత్రి 7 గంటలకు హంస వాహన సేవ

మార్చి 5: ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణాలంకార సేవబీ రాత్రి 7 గంటలకు పొన్న వాహన సేవ

మార్చి 6: ఉదయం 9 గంటలకు గోవర్ధన గిరిధారి అలంకార సేవబీ రాత్రి 7 గంటలకు సింహవాహన సేవ

మార్చి 7: ఉదయం 9 గంటలకు జగన్మోహిని అలంకార సేవబీ రాత్రి 8 గంటలకు అశ్వవాహన సేవ, స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం

మార్చి 8: ఉదయం 9 గంటలకు శ్రీరామ అలంకారం, హనుమంత వాహన సేవబీ రాత్రి 8 గంటలకు గజవాహన సేవ, అనంతరం స్వామివారి కళ్యాణోత్సవం

మార్చి 9: ఉదయం 9 గంటలకు శ్రీమహావిష్ణు అలంకారం, గరుడవాహన సేవబీ రాత్రి 8 గంటల నుంచి దివ్య విమాన రథోత్సవం

మార్చి 10: ఉదయం 10.30 మహా పూర్ణాహుతి, చక్రతీర్థంబీ రాత్రి 7 గంటలకు శ్రీ పుష్పయాగం,

మార్చి 11: ఉదయం 10 గంటలకు అష్టోత్తర శత ఘటాభిషేకంబీ రాత్రి 9 గంటలకు శృంగార డోలోత్సవం, ఉత్సవ సమాప్తి



# నవతార

## చపాతీ పిండి ఎక్కువసేపు తాజాగా ఉంచడానికి సులభమైన చిట్కాలు

చపాతీ అంటే ఇష్టపడని వారు ఎవరూ ఉండరు. చాలా మందికి ప్రతిరోజు చపాతీ తినే అలవాటు ఉంటుంది. ప్రతిరోజూ పిండిని కలిపి చపాతీలు చేయడానికి కష్టంగా ఉంటుంది. అంతేకాకుండా దీనిని చేయడానికి ఎక్కువ సమయం పడుతుంది. అయితే, చపాతీ పిండిని ఒకేసారి కలిపి ఎక్కువ రోజులు తాజాగా ఉంచడానికి కొన్ని సులభమైన చిట్కాలు ఉన్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

కొద్దిగా నూనె వేయండి..చపాతీ పిండిని కలిపేటప్పుడు కొద్దిగా నూనె లేదా నెయ్యి కలపండి. నూనె లేదా నెయ్యి చపాతీలను ఎక్కువ సేపు మృదువుగా ఉంచడంలో సహాయపడుతుంది.

ఎక్కువ నీరు వాడకండి..చపాతీ పిండిని కలిపేటప్పుడు ఎక్కువ నీరు కలపకండా జాగ్రత్త వహించండి. తక్కువ పరిమాణంలో నీరు కలపండి. పిండి చాలా వదులుగా ఉంటే స్థిరత్వాన్ని సమతుల్యం చేయడానికి దానికి కొద్దిగా పొడి పిండిని జోడించండి.

గోరువెచ్చని నీరు లేదా పాలు వాడండి..పిండిని మృదువుగా చేయడానికి, పిండికి గోరువెచ్చని నీరు లేదా పాలు ఉపయోగించండి. మృదువైన గోధుమ పిండిని పొందడానికి 10-15 నిమిషాలు బాగా పిసికి కలపండి. చల్లటి నీటిని ఉపయోగించడం వల్ల పిండి గట్టిగా మారుతుంది. దీంతో చపాతీలు చేయడం కష్టమవుతుంది..గాలి చొరబడని కంటైనర్ ఉపయోగించండికలిపిన పిండిని ఎప్పుడూ ఫ్రిజ్‌లో పెట్టకండి, అది చెడిపోతుంది. బదులుగా పిండిని గాలి చొరబడిని కంటైనర్‌లో నిల్వ చేయండి. పిండిలో గోధుమ బీజం ఉన్నందున అది చెడిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల దానిని ఎక్కువ కాలం నిల్వ చేయడానికి గాలి చొరబడని కంటైనర్‌లో నిల్వ చేయడం చాలా ముఖ్యం.



# వాకింగ్‌కు సమయం లేదా మిత్రమా?..

## అయితే ఈ చిట్కాలు మీకోసమే!



**నడక.. వ్యాయామాల్లోనే అత్యంత సులువైంది. అత్యంత ప్రభావవంతమైంది. స్థిరమైన నడక.. బరువును అంతే స్థిరంగా తగ్గిస్తుంది. ఆరోగ్యానికీ అండగా నిలుస్తుంది. వాకింగ్ చేయాలంటే.. ప్రత్యేకమైన పరికరాలు కొనాల్సిన పనిలేదు. జిమ్‌లో చేరాల్సిన అవసరం అంతకన్నా లేదు. ప్రతిరోజూ 30 నుంచి 40 నిమిషాల సమయం కేటాయిస్తే చాలు. అలాకాకుండా.. 'సమయం లేదు మిత్రమా?' అంటారా? అయితే, ఈ చిట్కాలు మీకోసమే!**

ఆఫీస్‌లో, మాల్స్‌లో మాటిమాటికీ లిఫ్ట్‌ను లిఫ్ట్ అడగకుండా.. మెట్లు ఎక్కడం అలవాటుగా మార్చుకోండి. దీనివల్ల కండరాలు ఎక్కువగా పనిచేస్తాయి. ఫలితంగా, ఎక్కువ క్యాలరీలు ఖర్చవుతాయి. నడక కంటే మెట్లు ఎక్కడం వల్ల దాదాపు 20 రెట్లు ఎక్కువ క్యాలరీలు ఖర్చవుతాయని పలు అధ్యయనాలు తేల్చాయి కూడా! ఇక మెట్లు దిగడం ద్వారా కూడా దాదాపు ఐదు రెట్లు ఎక్కువ క్యాలరీలు ఖర్చు చేసుకోవచ్చు. బయటికి వెళ్లాలంటే.. బైక్ తీయాల్సిన పనిలేదు. కూరగాయలకు, ఇంటి దగ్గరి సూపర్ మార్కెట్లకు చక్కగా నడిచే వెళ్లండి. ఇటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం తో పా ట ు



పెట్రోల్ కూడా పొదుపు చేసినవాళ్లు అవుతారు.

ఆఫీస్‌కు వెళ్లినప్పుడు బైక్, కార్‌ను కాస్త దూరంగా పార్క్ చేయండి. దానివల్ల కొద్దిదూరమైనా నడిచే అవకాశం దొరుకుతుంది. పని ఎలాగూ కుర్చీలో కూర్చునే చేస్తారు. కనీసం క్లయింట్స్‌తో ఫోన్‌లో మాట్లాడేటప్పుడైనా.. అలా లాన్‌లో నడుస్తూ మాట్లాడండి. పచ్చని మొక్కల మధ్య నడిస్తే.. మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని గుర్తుంచుకోండి. ప్రతి పనికీ ఆఫీస్ బాయ్‌పైనే ఆధారపడకండి. నీళ్ల కోసమో, ప్రింట్స్ తెచ్చుకోవడానికో అప్పుడప్పుడూ కుర్చీల్లోంచి లేవండి. క్యాంటీన్‌లో కాఫీ తాగేటప్పుడు కూడా కుర్చీలు, టేబుల్స్ అవసరమా? కొలీగ్స్‌తో కలిసి కాఫీ తాగేటప్పుడు కూడా ఓ నాలుగు అడుగులు వేయండి.

**ఎన్నో ప్రయోజనాలు..**

నడకతో తక్కువ వ్యవధిలోనే ఎక్కువ క్యాలరీలు ఖర్చవుతాయి.

కాళ్లు, శరీరంలో వివిధ రకాల కండరాలు బలోపేతం అవుతాయి.

ఎముకలు కూడా దృఢంగా తయారవుతాయి.

నడక వల్ల కడుపు చుట్టూ ఉండే కొవ్వు కరిగిపోతుంది.

మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగవుతుంది.

రోజూ నడిచే వారి శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి మానసికోల్లాసం కలిగిస్తాయి. ఉత్సాహంగా పని చేస్తూ లక్ష్యాలు చేరుకునేలా చేస్తాయి.

రోజుకు కనీసం 30 నిమిషాలపాటు నడిస్తే.. మంచి ఫలితాలు ఉంటాయి.

# అనాస పువ్వుతో...

**ఇన్‌ఫెక్షన్లు: అనాస పువ్వులోని షికిమిక్ ఆమ్లం, అనెథోల్, లినలూల్ సమ్మేళనాలు బ్యాక్టీరియాతో పోరాడడంతో పాటు పేగుల ఆరోగ్యాన్ని కాపాడతాయి. దాంతో మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు, న్యుమోనియా దరి చేరకుండా ఉంటాయి**



ఫంగస్‌కు వ్యతిరేకంగా: అనెథోల్, లినలూల్ అనే ఫ్లేవనాయిడ్లు ఫంగస్ పెరుగుదలను అడ్డుకుంటాయి.

వైరసకు వ్యతిరేకంగా: టామిఫ్లూ లాంటి యాంటీవైరల్ మందుల తయారీలో అనాస పువ్వులోని షికిమిక్ ఆమ్లాన్ని ఉపయోగిస్తారు

మధుమేహం: అనాస పువ్వులోని అనెథోల్, పిండిపదార్థాలు శక్తిగా మారే ప్రక్రియకు దోహదపడుతూ, రక్తంలో చక్కెర మోతాదును సమంగా ఉంచుతుంది.


యాంటీఆక్సిడెంట్లు: అనాస పువ్వులోని యాంటీఆక్సిడెంట్లు కణ నష్టాన్ని నివారిస్తాయి. ఫలితంగా కణుతులు పెరిగే అవకాశాలు తగ్గుతాయిని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

అజీర్తి: కడుపు ఉబ్బరం, అజీర్తిని తగ్గించే స్వభావం అనాస పువ్వుకు ఉంటుంది.

ఇన్ని సుగుణాలు కలిగిన అనాస పువ్వును తరచూ వంటకాల్లో వాడుకోవడం వాడుకోవడం ఆరోగ్యకరం. సాస్ తయారీలో, సూప్ తయారీలో, మాంసాహార వంటకాల్లో విరివిగా వాడుకోవచ్చు.







# పిల్లల్లో జ్ఞాపకశక్తికి...

పిల్లలు చదువులో రాణించాలంటే వారిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగాలి. కొన్ని ఆహార పదార్థాలతో వాటిని పెంచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటంటే...

ప్రతిరోజూ నీళ్లలో అయిదు బాదం పప్పులను నానబెట్టి, పొట్టు తీసి పిల్లలచేత తినిపించాలి. దీనివల్ల శరీరానికి ఇ విటమిన్, మెగ్నీషియం, ఆరోగ్యకరమైన కొవ్వులు లభ్యమై మెదడు చురుకుగా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది


ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో ఒక అరటిపండు తినిపిస్తే పిల్లలకు తక్షణమే శక్తి లభిస్తుంది. నేచురల్ షుగర్స్, పొటాషియం తగు మోతాదులో అంది ఆలోచనా శక్తి కూడా పెరుగుతుంది.

పిల్లలు బడి నుంచి రాగానే నాలుగు వాల్‌నట్ గింజలు తినిపిస్తే మంచిది. వీటిలో ఉండే మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ లాంటివి మెదడు పనితీరుని వేగవంతం చేసి గుర్తుపెట్టుకునే సామర్థ్యాన్ని పెంచుతాయి.

సాల్మన్, మాకరెల్, సార్డైన్, ట్యూనా లాంటి చేపలతో తయారు చేసిన వంటకాలు తినిపించాలి. వీటిలోని ఫ్యాటీ యాసిడ్ సమ్మేళనాలు మెదడుని ప్రభావితం చేస్తాయి.

రోజూ పడుకునేముందు ఒక గ్లాసు పాలు తాగిస్తే మెదడుకి విశాంతి లభిస్తుంది. పాలలోని ప్రోటీన్లు, ఇతర పోషకాలు... మెదడు సరైన క్రమంలో ఎదిగేందుకు తోడ్పడతాయి. స్వచ్ఛమైన నెయ్యిని ఆహారంలో చేర్చడం వల్ల జ్ఞాపకశక్తి వృద్ధి పొందుతుంది.

కోడిగుడ్లు, పాలకూర, బచ్చలి కూర, దానిమ్మ గింజలు, గుమ్మడి గింజలు, అవిసె గింజలు, యాపిల్, నారింజ, పల్లీలను తరచూ తినిపిస్తూ ఉంటే పిల్లల మెదడు చురుకుగా పనిచేయడమే కాకుండా జ్ఞాపకశక్తి పెరుగుతుంది.



# ఎండు ఖర్జూరతో ఎండలకు చెక్..


ఎండలు ముదురుతున్నాయి. ముందస్తుగానే ఆరోగ్య సంరక్షణ జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వేడి శరీరం ఉండేవారు రోజంతా హైడ్రేటెడ్‌గా ఉండాల్సిన అవసరం ఉన్నది. లేకుంటే లేనిపోని సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే.. పోషకాలు అధికంగా లభించే పదార్థాలను ఆశ్రయించాలి. అలాంటివాటిలో ఎండు ఖర్జూర, పెరుగు ఎంతో మేలు చేస్తాయని ఆహార నిపుణులు చెబుతున్నారు. వేసవిలో సహజంగానే వ్యాయామం తగ్గుతుంది. దాంతో, బరువు పెరిగే అవకాశం ఉంటుంది. బరువు తగ్గాలనుకునేవారికీ ఇబ్బందే! ఇలాంటి సమయంలో ఎండు ఖర్జూరం, పెరుగు సాయం తీసుకోండి. వీటిని ప్రతిరోజూ తీసుకోవడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. కడుపు నిండిన అనుభూతి కలిగి.. భోజనం తక్కువ తినేలా ప్రోత్సహిస్తుంది. దాంతో శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.

వేసవిలో ఇబ్బంది పెట్టే మరో సమస్య.. మలబద్ధకం. ఎండు ఖర్జూరల్లో ఉండే పీచు పదార్థాలు.. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యాన్ని కాపాడుతాయి. ఫలితంగా మల బద్ధకం దూరమవుతుంది. అంతేకాకుండా ఎండు ఖర్జూరలు, పెరుగు కలిపి తీసుకోవడం వల్ల కడుపు చల్లబడుతుంది.

ఖర్జూరల్లో ఐరన్ అధికంగా లభిస్తుంది. ఇది హిమోగ్లోబిన్ లోపం తగ్గించడంలో సాయపడుతుంది. ఫలితంగా రక్త సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

ఎండల్లో ఎక్కువగా తిరగడం వల్ల తలనొప్పి వేదిస్తుంది. మానసిక ఆందోళనా పెరుగుతుంది. ఇలాంటి వారికి.. ఖర్జూరం, పెరుగు రెసిపీ మంచి ఆప్షన్! ఖర్జూరంలో లభించే కార్బోహైడ్రేట్లు.. హార్మోన్ల సమస్యలను దూరం చేస్తాయి. ఫలితంగా, మానసికస్థితి కూడా మెరుగుపడుతుంది.








## జీడీపీ వృద్ధి రేటు 6.2 శాతం




**న్యూఢిల్లీ-నవభూమి:**దేశ ఆర్థిక వ్యవస్థ గాడినపడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబ రుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3) లో జీడీపీ వృద్ధి రేటు 6.2 శాతంగా నమోదైంది. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో నమోదైన 5.6 శాతంతో పోలిస్తే ఇది 0.6 శాతం ఎక్కువ. అయితే ఈ కాలానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అంచనా వేసిన 6.8 శాతంతో పోలిస్తే ఇది 0.6 శాతం తక్కువ. జాతీయ గణాంకాల సంస్థ (ఎన్ఎస్ఓ), కేంద్ర గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ శుక్రవారం ఈ వివరాలు విడుదల చేశాయి. మరోవైపు మార్చితో ముగిసే 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి గాను జీడీపీ వృద్ధి అంచనాలను ప్రభుత్వం 6.4 శాతం నుంచి 6.5 శాతానికి సవరించింది. ఇది నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి వృద్ధి రేటు అవుతుంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) నమోదైన 9.2 శాతంతో పోల్చినా ఇది 2.7 శాతం తక్కువ.రూ.331 లక్షల కోట్ల జీడీపీ: ప్రస్తుత ధరల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సర జీడీపీ రూ.331.03 లక్షల కోట్ల వరకు ఉంటుందని ఎన్ఎస్ఓ అంచనా. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది రూ.29.8 లక్షల కోట్లు (9.9 శాతం) ఎక్కువ. ప్రస్తుత ధరల ప్రకారం డిసెంబరు త్రైమాసిక జీడీపీ కూడా రూ.47.17 లక్షల కోట్ల వరకు ఉంది. గత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఇది 6.2 శాతం (రూ.2.73 లక్షల కోట్లు) ఎక్కువ.

## బిగ్ బాస్కెట్ బిగ్ టార్గెట్.. త్వరలో ఐపీఓకు, ఫుడ్ డెలివరీ విభాగంలోకి ఎంట్రీ..




**న్యూఢిల్లీ-నవభూమి:**టాటా సన్స్ ఆధ్వర్యంలో నడుస్తున్న క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ బిగ్ బాస్కెట్ నిత్యావసర వస్తువుల నుంచి యాపిల్ ఐఫోన్ల వరకు అనేక వస్తువులను నిమిషాల్లోనే డెలివరీ చేస్తూ వినియోగదారులకు నమ్మకమైన సర్వీసులను అందిస్తోంది. రాబోయే రోజుల్లో బిగ్ బాస్కెట్‌ను మరింతగా విస్తరించాలని సంస్థ యాజమాన్యం భావిస్తోంది. క్విక్ ఫుడ్ డెలివరీ విభాగంలోకి కూడా ఎంట్రీ ఇవ్వాలనుకుంటున్నట్లు కంపెనీ సీఈఓ హరిమీనన్ తెలిపారు. అలాగే రాబోయే రెండేళ్లలో ఐపీఓకు రావాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు తాజాగా ముంబైలో జరిగిన రిటైల్ సమ్మిట్‌లో హరి మీనన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన కంపెనీ లక్ష్యాలను గురించి వివరించారు. 2026 మార్చి నాటికి అంటే మరో ఏడాదిలో బిగ్ బాస్కెట్ వ్యాపారాన్ని రెట్టింపు చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసినట్టుగా ఆయన తెలిపారు. ప్రస్తుతం బిగ్‌బాస్కెట్ దేశవ్యాప్తంగా 35 నగరాల్లో సేవలందిస్తోంది. వచ్చే ఏడాదికి 70 నగరాల్లో బిగ్‌బాస్కెట్ తన సేవలను అందించబోతోంది. అలాగే రానున్న 18 నుంచి 24 నెలల్లో బిగ్‌బాస్కెట్ ఐపీఓకు కూడా వస్తుందని హరిమీనన్ తెలిపారు.ప్రస్తుతం భారత్‌లో జొమాటో-బ్లింకిట్, స్విగ్గీ-ఇన్‌స్టామార్ట్ క్విక్ కామర్స్ విభాగంలో దూసుకుపోతున్నాయి. మహా నగరాల్లో కేవలం 10 నిమిషాల్లోనే ఆర్డర్ చేసిన వస్తువులను డెలివరీ చేస్తున్నాయి. త్వరలో బిగ్‌బాస్కెట్ కూడా ఆయా విభాగాల్లో తన వ్యాపారాన్ని విస్తరించాలని భావిస్తోంది. దేశీయ క్విక్ కామర్స్ పరిశ్రమ రాబోయే రోజుల్లో మరింత వృద్ధి చెందుతుందని అంచనాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలో బిగ్‌బాస్కెట్ కూడా తన వ్యాపారాన్ని విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది.

## మార్చిలో బ్యాంకులకు ఇన్ని రోజులు సెలవులా..




**న్యూఢిల్లీ-నవభూమి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్చి నెలలో బ్యాంకు సెలవుల జాబితాను విడుదల చేసింది. హాలిడే క్యాలెండర్ ప్రకారం వచ్చే నెలలో మొత్తం 14 రోజుల పాటు బ్యాంకులు మూసివేస్తారు. ప్రభుత్వ సెలవులు, ప్రాంతీయ సెలవులు, రెండవ, నాల్గవ శనివారాలు, అన్ని ఆదివారాలు సాధారణ సెలవులకు కలిపి ఆర్‌బీఐ జాబితా ప్రకటించింది. హోలీ, రంజాన్ వంటి ముఖ్యమైన పండుగల సమయంలో, ప్రాంతీయ పండుగల సందర్భంగా చాలా రాష్ట్రాల్లో బ్యాంకులు పనిచేయవు. కాబట్టి, ఈ లిస్ట్ ఒకసారి చెక్ చేసుకుని బ్యాంకు పనులను సమయానికి పూర్చిచేసుకోండి.

ప్రతి నెల బ్యాంకు సెలవుల జాబితాను రూపొందిస్తుంది. అలాగే ఈసారి మార్చి సెలవుల జాబితాను ప్రకటించింది. వచ్చే నెల 14 రోజుల పాటు సెలవులుంటాయని.. అన్ని షెడ్యూల్డ్, నాన్-షెడ్యూల్డ్ బ్యాంకులు రెండవ, నాల్గవ శనివారాలలో ప్రభుత్వ సెలవు దినాలను పాటిస్తాయని ఆర్‌బీఐ తెలిపింది.

మార్చి 2025లో %=దీ×% ప్రకటించిన సెలవుల పూర్తి జాబితా:
మార్చి 2025లో %=దీ×% ప్రకటించిన సెలవుల పూర్తి జాబితా:

మార్చి 2 (ఆదివారం) - వారాంతపు సెలవు
మార్చి 7 (శుక్రవారం): చాప్చర్ కుట్ - మిజోరంలో బ్యాంకులు మూసివేయబడతాయి.
మార్చి 8 (రెండవ శనివారం) - వారాంతపు సెలవు
మార్చి 9 (ఆదివారం) - వారాంతపు సెలవు
మార్చి 13 (గురువారం): హోలికా దహన్, అట్టుకల్ పొంగల్ - ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, జార?ండ్, కేరళలో బ్యాంకులు మూసివేత.
మార్చి 14 (శుక్రవారం): హోలీ (ధూలేటి/ధులండి/డోల్ జాత్రా) - త్రిపుర, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, మణిపూర్, కేరళ, నాగాలాండ్ మినహా ఇతర్ర రాష్ట్రాల్లో సెలవు.
మార్చి 15 (శనివారం): ఎంపిక చేసిన రాష్ట్రాల్లో హోలీ - అగర్తల, భువనేశ్వర్, ఇంఫాల్, పాట్నాలో బ్యాంకులు మూసివేత.
మార్చి 16 (ఆదివారం) - వారాంతపు సెలవు
మార్చి 22 (నాల్గవ శనివారం): వారాంతపు సెలవు, బీహార్ దివాస్
మార్చి 23 (ఆదివారం) - వారాంతపు సెలవు
మార్చి 27 (గురువారం): షబ్-ఎ-ఖాదర్ - జమ్మూలో బ్యాంకులకు సెలవు.
మార్చి 28 (శుక్రవారం): జుమాత్-ఉల్-విదా - జమ్మూ కాశ్మీర్‌లో బ్యాంకులకు సెలవు.
మార్చి 30 (ఆదివారం) - వారాంతపు సెలవు
మార్చి 31 (సోమవారం): రంజాన్-ఈద్ (ఈద్-ఉల్-ఫితర్) (షావల్-1)/ఖుతుబ్-ఎ-రంజాన్ - మిజోరాం, హిమాచల్ ప్రదేశ్ మినహా ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ సెలవు.

పై జాబితా ప్రకారం మీ బ్యాంకు సంబంధిత పనిని తదనుగుణంగా ప్లాన్ చేసుకోండి. అయితే, బ్యాంకులు సెలవు రోజుల్లో మూసివేసినప్పటికీ ఆన్‌లైన్ బ్యాంకింగ్, %ఖు×% వంటి సౌకర్యాలు నిరాటంకంగా కొనసాగుతాయి.

## రూ. 2 వేల నోట్లపై ఆర్బీఐ కీలక ప్రకటన.. ఇప్పటికీ చలామణీలోనే




**న్యూఢిల్లీ-నవభూమి:**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2023 మే నెలలో అప్పుడు పెద్ద నోటుగా ఉన్నటువంటి రూ. 2 వేల నోట్లను సర్క్యులేషన్ నుంచి ఉపసంహరిం చుకుంటున్నట్లు ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రజల్ని తమ దగ్గర ఉన్న ఈ పెద్ద నోట్లను వెనక్కి ఇచ్చేయాలని కోరింది. అప్పటినుంచి అవకాశం కల్పించినప్పటికీ.. ప్రజల దగ్గర ఇంకా రూ. 6400 కోట్లకుపైగా విలువైన రూ. 2 వేల నోట్లు ఉన్నట్లు ఆర్బీఐ తాజాగా ప్రకటించింది. దాదాపు 20 నెలలైనా ఇప్పటికీ పూర్తి స్థాయిలో రూ. 2 వేల నోట్లు.. సర్క్యులేషన్ నుంచి బ్యాంకింగ్ వ్యవస్థలోకి రాకపోవడం గమనార్హం. చలామణీలో ఉన్న మొత్తం రూ. 2 వేల నోట్లలో 98.18 శాతం నోట్లు తిరిగి బ్యాంకుల దగ్గరికి చేరినట్లు తెలిపింది కేంద్ర బ్యాంకు. 2023 సంవత్సరం మే 19న ఆర్బీఐ రూ. 2 వేల నోట్ల ఉపసంహరణ ప్రకటన చేసింది. అయితే.. అప్పటికి ఈ నోట్ల విలువ సర్క్యులేషన్‌లో రూ. 3.56 లక్షల కోట్లుగా ఉంది. వీటిని మొత్తం వెనక్కి రప్పించుకునేందుకు సిద్ధమై.. తొలుత బ్యాంకుల్లో ఈ నోట్లను మార్చుకునేందుకు లేదా డిపాజిట్ చేసేందుకు ప్రజలకు అవకాశం కల్పించింది. దీని కోసం ముందుగా 2023, సెప్టెంబర్ 30 వరకు అవకాశం కల్పించారు. తర్వాత మరోసారి అక్టోబర్ 7 వరకు గడువు పొడిగించారు. ఇక అప్పటినుంచి మాత్రం బ్యాంకుల్లో వీటిని మార్చుకునేందుకు వీల్లేదు. కేవలం దేశవ్యాప్తంగా ఉన్న ఆర్బీఐ 19 ప్రాంతీయ కార్యాలయాల్లోనే మార్చుకునేందుకు వెసులుబాటు కల్పించింది. హైదరాబాద్‌లోని ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయంలో కూడా వీటిని మార్చుకోవచ్చు. ఈ క్రమంలోనే ఇప్పటివరకు 98.18 శాతం నోట్లు వెనక్కి వచ్చినట్లు ఆర్బీఐ స్పష్టం చేసింది. ప్రజల దగ్గర ఇంకా రూ. 6471 కోట్ల రూ. 2 వేల నోట్లు ఉన్నట్లు వెల్లడించింది. ఇది మొత్తం సర్క్యులేషన్లో 1.82 శాతానికి సమానం. ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాలతో పాటుగా... రీజనల్ ఆఫీసులకు చేరుకోలేని వారు పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఆయా కార్యాలయాలకు పంపొచ్చని తెలిపింది. ఇక ప్రాంతీయ కార్యాలయాలు హైదరాబాద్ సహా బెంగళూరు, అహ్మదాబాద్, ముంబై, నాగ్‌పుర్, ఢిల్లీ, పట్నా, తిరువనంతపురం, చెన్నై, ఛండీగఢ్, భువనేశ్వర్, భోపాల్, భేల్‌పుర్, కాన్పుర్, జైపూర్, గువాహటి, లక్నో, కోల్‌కతా, జమ్మూల్లో ఉన్నాయి. చివరగా తెలుసుకోవాల్సిన అత్యంత ముఖ్యమైన విషయం ఏంటంటే.. రూ. 2 వేల నోట్లు ఉపసంహ రించుకుంటున్నా.. ఇప్పటికీ చట్టబద్ధ కరెన్సీగా (లీగల్ టెండర్) కొనసాగుతుందని ఆర్బీఐ స్పష్టం చేసింది. అంటే వీటిని రద్దు చేయలేదని ఇప్పటికీ చెల్లుబాటులోనే ఉన్నట్లు పేర్కొంది.

## దిగ్గజ ప్రభుత్వ బ్యాంక్ కీలక ప్రకటన..

### ఒక గుడ్‌న్యూస్.. ఒక బ్యాడ్‌న్యూస్.. కొత్త రూల్స్ అమల్లోకి..!



**న్యూఢిల్లీ-నవభూమి:**పంజాబ్ నేషనల్ బ్యాంకు లెండింగ్ రేట్లకు సంబంధించి కీలక ప్రకటనలు చేసింది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేట్లను తగ్గించింది. ఇది 2025, మార్చి 1 (శనివారం) నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఇది ఈఎంఐలపై ప్రభావం చూపుతుందని చెప్పొచ్చు. అంటే లోన్లకు సంబంధించి ఈఎంఐ తగ్గుతుంది లేదా లోన్ టెన్యూర్ తగ్గుతుంది. ఇది ఫిక్స్‌డ్ రేట్ లోన్లకు వర్తించదని గుర్తించుకోవాలి. అంటే ఫ్లోటింగ్ రేట్ లోన్లపై వర్తిస్తుంది. కొత్తగా లోన్లు తీసుకునేవారికి కూడా వడ్డీ రేట్లు తగ్గడంతో పాటుగా ఈఎంఐ తగ్గుతుందని చెప్పొచ్చు. ఇదే సమయంలో ప్రభుత్వ దిగ్గజ బ్యాంకు మరోవైపు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను పెంచేసింది. ఇక్కడ లోన్ వడ్డీ రేట్లు, ఈఎంఐ పెరుగుతాయని చెప్పొచ్చు.

ఎంసీఎల్ఆర్ పెంపు కూడా మార్చి 1 నుంచే అమల్లోకి వచ్చింది. ఎంసీఎల్ఆర్ అంటే కనీస వడ్డీ రేటు. ఆర్బీఐ అన్ని బ్యాంకులకు ఒకే విధానం ఉండాలన్న ఉద్దేశంతో దీనిని తీసుకొచ్చింది. దీని కంటే తక్కువ వడ్డీకి బ్యాంకులు లోన్లు ఇచ్చేందుకు వీల్లేదు. ఎంసీఎల్ఆర్ పెరిగితే లోన్ వడ్డీ రేట్లు పెరుగుతాయి.. ఈఎంఐ పెరుగుతుంది. ఇదే సమయంలో ఎంసీఎల్ఆర్ తగ్గితే ఈఎంఐ తగ్గుతుంది. అయితే.. ఇక్కడ లోన్లు ఈబీఎల్ఆర్, ఎంసీఎల్ఆర్‌కు లింక్ అయి ఉన్న వాటికి సంబంధించి మారతాయని చెప్పొచ్చు. ఎంసీఎల్ఆర్ అనేది అన్ని టెన్యూర్ల లోన్లకు సంబంధించి 0.05 శాతం మేర పెరిగిందని చెప్పొచ్చు. ఓవర్ నైట్ ఎంసీఎల్ఆర్ 8.35 శాతం నుంచి 8.40 శాతానికి పెరిగింది. ఒక నెల ఎంసీఎల్ఆర్ 8.45 శాతం నుంచి 8.50 శాతానికి పెరిగింది. 3 నెలల ఎంసీఎల్ఆర్ 8.65 శాతం నుంచి 8.70 శాతానికి పెరిగింది. 6 నెలల ఎంసీఎల్ఆర్ 8.90 శాతం, ఏడాది ఎంసీఎల్ఆర్ 9.05 శాతంగా ఉన్నాయి. 3 సంవత్సరాల టెన్యూర్ ఎంసీఎల్ఆర్ 9.35 శాతానికి పెరిగింది. ఎక్కువగా కన్జ్యూమర్ లోన్స్.. ఏడాది టెన్యూర్ ఎంసీఎల్ఆర్‌కు లింక్ అయి ఉంటాయి. ఈబీఎల్ఆర్ తగ్గించిన నేపథ్యంలో.. దీనికి లింక్ అయి ఉండే హోం లోన్లపై వడ్డీ రేట్లు లేదా ఈఎంఐ లేదా టెన్యూర్ తగ్గుతుంది. ఎంసీఎల్ఆర్ పెరిగిన నేపథ్యంలో దీనికి లింక్ అయి ఉండే లోన్లపై ఈఎంఐ పెరుగుతుంది లేదా టెన్యూర్ పెరుగుతుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల కీలక రెపో రేట్లను తగ్గించిన నేపథ్యంలో బ్యాంకులు కూడా లెండింగ్ రేట్లను తగ్గించాల్సి వస్తోంది. ఈ క్రమంలోనే ఆయా బ్యాంకులు కీలక ప్రకటనలు చేస్తున్నాయి.

## త్వరపడండి.. తగ్గిన బంగారం ధరలు.. ఇదే మంచి టైం



**న్యూఢిల్లీ-నవభూమి:**బంగారం కొనాలనుకునే వారికి గుడ్ న్యూస్. దేశంలో మరోసారి బంగారం ధరలు తగ్గాయి. తాజా రేటు ప్రకారం 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర 84,450గా ఉంది. ఇక 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ.79,590గా ఉంది. గత కొద్ది రోజులుగా బంగారం ధర తగ్గుతూ వస్తోంది. ముఖ్యంగా జువెలర్స్ నుంచి డిమాండ్ తగ్గడం, మదుపర్ల లాభాల స్వీకరణ వంటి కారణాలతో దేశవ్యాప్తంగా బంగారం ధరలు తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇక కిలో వెండి ప్రస్తుతం 94,230గా ఉంది.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఇవే (24 క్యారెట్)
హైదరాబాద్: రూ. 87,440,
విశాఖపట్నం: రూ.86,420
ఢిల్లీ: రూ. 84,150
అహ్మదాబాద్: రూ. 84,410
చెన్నై: రూ. 84,540
ముంబై: రూ. 84,300
కోల్‌కతా: రూ, 84,190

బంగారం స్వచ్ఛతను క్యారట్లలో కొలుస్తారన్న విషయం తెలిసిందే. 24 క్యారట్ల బంగారం అంటే 99.9 స్వచ్ఛమైనదని అర్థం. ఇక నగల తయారీకి వాడే 22 క్యారట్ల బంగారం స్వచ్ఛత 91.6 శాతం. జీఎస్‌టీ అమలుకు పూర్వం వివిధ రాష్ట్రాల్లో బంగారం మధ్య తేడాల్లో ఎక్కువగా ఉండేవి. ఆ తరువాత పన్ను విధానం సరళీకృతం కావడంతో వివిధ ప్రాంతాల మధ్య బంగారం ధరల్లో తేడాలు తగ్గాయి. అయితే, స్థానిక పరిస్థితులు, డిమాండ్ - సప్లై అంతరాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తుంటాయి.

## యూపీఐ 3.0 కొత్త ఫీచర్లు ఇవేనా

**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌లో యూపీఐ ఓ విప్లవం అని చెప్పక తప్పదు. చిల్లర కోసం అవస్థపడే రోజుల నుంచి రూ.1 కూడా మొబైల్ ద్వారా చెల్లించే అవకాశం భారతీయులకు దక్కింది. దీంతో, ప్రస్తుతం ఎక్కడ చూసినా యూపీఐ చెల్లింపులు సర్వసాధారణం అయిపోయాయి. యూపీఐ, యూపీఐ 2.0తో చూసిన భారతీయులకు యూపీఐ 3.0 అందించేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే యూపీఐ 2.0తో డిజిటల్ చెల్లింపులు సులభతంగా మారిన విషయం తెలిసిందే. ఓవర్ డ్రాఫ్ట్ అకౌంట్లు, ఇన్‌వాయిస్ వెరిఫికేషన్లు, ఆటోపే వంటి ఎన్నో ఆధునాతన ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇంతకు మించిన అద్భుత సౌకర్యాలు యూపీఐ 3.0తో అందుబాటులోకి వస్తాయని చెబుతున్నారు

యూపీఐ 3.0 ఫీచర్స్..దేశంలో యూపీఐ చెల్లింపులు మరింతగా విస్తరించడానికి ప్రధాన అడ్డంకి.. ఇంటర్నెట్ కనెక్టివిటీ లేకపోవడమే. అయితే, యూపీఐ 3.0తో నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ (ఎన్ఎఫ్‌సీ) లేదా బ్లూటూత్ ఆధారిత చెల్లింపులు అందుబాటులోకి వస్తాయట. ఈ సౌకర్యంతో ఇంటర్నెట్ సదుపాయం లేని గ్రామీణ ప్రాంతాల్లో కూడా సులువుగా చెల్లింపులు చేయొచ్చని చెబుతున్నారు.ఇతర దేశాల్లో కూడా యూపీఐని విస్తరించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున కసరత్తు చేస్తోంది. యూఏఈ, సింగపూర్, ఫ్రాన్స్ వంటి దేశాల్లో ఇప్పటికే యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చేశాయి. అయితే, యూపీఐ 3.0తో అంతర్జాతీయంగా నగదు బదిలీ, వ్యాపార చెల్లింపులు కూడా సాధ్యమవుతాయట. కరెన్సీ మార్పిడి తలనొప్పులు లేకుండానే ఈ చెల్లింపులు పూర్తి చేసుకునే ఛాన్స్ ఉంటుందట.క్రెడిట్ కార్డులు, ప్రీ అప్రూవ్డ్ లోన్స్‌ను యూపీఐతో అనుసంధానం చేయడంపై ఇప్పటికే ఆర్‌బీఐ కొన్ని సంకేతాలు ఇచ్చింది. ఇది అందుబాటులోకి వస్తే సంప్రదాయిక బ్యాంకింగ్ సేవలతో సంబంధం లేకుండానే రుణ లభ్యత పెరుగుతుందని తెలుస్తోంది. యూపీఐ ద్వారా నేరుగా స్వల్ప మొత్తాల్లో రుణాలు తీసుకునే అవకాశం లభిస్తుందని సమాచారం.

సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో యూపీఐ 3.0లో ఏఐ ఆధారిత సైబర్ సెక్యూరిటీ వ్యవస్థ కూడా ఏర్పాటు చేయొచ్చని తెలుస్తోంది. బయోమెట్రిక్ వెరిఫికేషన్, అత్యాధునిక ఎన్‌క్రిప్షన్ వంటి వాటిని అమలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.ప్రస్తుతం యూపీఐ చెల్లింపులపై రోజుకు రూ.1 లక్ష పరిమితి ఉన్న విషయం తెలిసిందే. ఈ పరిమితిని పెంచే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా రియల్ ఎస్టేట్, స్టాక్ మార్కెట్ చెల్లింపులకు ఈ పరిమితి పెంపు ఉండొచ్చని సమాచారం.అయితే, యూపీఐ 3.0ని కేవలం చెల్లింపులకే పరిమితం చేయకుండా ఓ విస్తృత వ్యవస్థగా మలిచే యోచన కూడా ఉన్నట్టు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. నగదు రహిత ఆర్థిక వ్యవస్థ దిశగా భారత్ పురోగమించేందుకు యూపీఐ కీలకం కానుందని ట్రేడ్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

### మళ్లీ ఒకటో తేదీన మారిన గ్యాస్ రేట్లు..

## లేటెస్ట్ గ్యాస్ సిలిండర్ ధరలు ఇవే..



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రతి నెలా ఒకటో తేదీన గ్యాస్ సిలిండర్ ధరలు మారుతుంటాయన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మార్చి ఒకటో తేదీన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు కీలక ప్రకటన చేశాయి. గ్యాస్ సిలిండర్లకు సంబంధించి కొత్త ధరల్ని ప్రకటించాయి. సాధారణంగా ఒకటో తేదీనే కాకుండా.. ప్రతి నెలా 15వ తేదీన కూడా ఆయిల్ కంపెనీలు గ్యాస్ సిలిండర్ రేట్లను సవరిస్తుంటాయి. అంటే ఇక్కడ ధరలు పెరగొచ్చు లేదా తగ్గొచ్చు లేదా స్థిరంగా ఉండొచ్చు. ఇటీవలి కొన్ని నెలల నుంచి గృహ అవసరాలకు వినియోగించేటువంటి వంట గ్యాస్ సిలిండర్ ధరల్ని అసలు మార్చట్లేవు కూడా. అప్పట్లో మహిళా దినోత్సవం, రాఖీ పండగల సమయాల్లో రూ. 200, రూ. 100 చొప్పున ఒకేసారి తగ్గిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అప్పటి నుంచి డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరల్ని ఏం మార్చకపోగా.. ఇదే సమయంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు (వాణిజ్య సిలిండర్) మారుతూనే ఉన్నాయి. ఇటీవల 2 నెలల సమయంలో రేట్లు తగ్గగా ఇప్పుడు స్వల్పంగా పెరిగాయి. ఇప్పుడు ఎక్కడ గ్యాస్ సిలిండర్ రేట్లు ఎలా ఉన్నాయనేది తెలుసుకుందాం. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ రేట్లు మార్చి నెలలో కూడా మారలేదు. ఈ సమయంలోనే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర మరోసారి పెరిగింది. కమర్షియల్ అంటే ఇది ఎక్కువగా హోటల్స్, రెస్టారెంట్లు వంటి చోట్ల వినియోగిస్తుంటారని చెప్పొచ్చు. ఢిల్లీలో గత నెలలో రూ. 7 చొప్పున రేటు తగ్గగా ఇప్పుడు రూ. 6 పెరిగింది. ప్రస్తుతం 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ. 1797 నుంచి ఇప్పుడు రూ. 1803 కు పెరిగింది. జనవరిలో ఇది రూ. 1804గా ఉండేది. ఇక కోల్‌కతాలో చూస్తే ఫిబ్రవరిలో రూ. 1907గా ఉండగా.. ఇప్పుడు రూ. 1913కు చేరింది. ఇదే ముంబై నగరంలో చూసినట్లయితే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ. 1749.50 నుంచి ఇప్పుడు రూ. 1755.50 కి చేరింది. చెన్నైలో కూడా స్వల్పంగా పెరిగి రూ. 1918కి చేరింది. హైదరాబాద్‌లో కూడా స్వల్పంగా తగ్గింది. అంతకుముందు జనవరి, ఫిబ్రవరిలో కూడా స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి.

## మరో బాంబ్ పేల్చిన ట్రంప్.. నిండామునిగిన ఇన్వెస్టర్లు.. రూ. 94 లక్షల కోట్లు లాస్!




**వాషింగ్టన్- నవభూమి:** ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా పతనం అవుతున్నాయి. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు ఇందుకు దోహదం చేస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా ప్రెసిడెంట్‌గా తిరిగి ఎన్నికైన తర్వాత డొనాల్డ్ ట్రంప్ వరుసగా టారిఫ్స్ ప్రకటిస్తుండగా ఈ ప్రభావంతో వాణిజ్య యుద్ధ భయాలు పెరిగిపోతున్నాయి. ఇప్పుడు మరోసారి టారిఫ్స్ ప్రకటన చేయగా.. శుక్రవారం రోజు స్టాక్ మార్కెట్ సూచీలు ప్రపంచవ్యాప్తంగా కుదేలయ్యాయి. కెనడా, మెక్సికో నుంచి అమెరికాకు వచ్చే దిగుమతులపై 25 శాతం టారిఫ్స్.. మార్చి 4 నుంచే అమలు చేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఇదే సమయంలో చైనా ఉత్పత్తులపై మరో 10 శాతం టారిఫ్స్ అదనంగా విధించనున్నట్లు తెలిపారు. ఈ తాజా ప్రకటనే మార్కెట్లను కుదిపేసింది. ఇదే ప్రభావం మన మార్కెట్లపైనా పడటంతో మన సూచీలు కూడా క్షీణించాయి. ఇన్వెస్టర్లు ఈ క్రమంలోనే భారీగా నష్టపోతున్నారు. నిఫ్టీ వరుసగా 8వ సెషన్లో కూడా క్షీణించింది. ఇక వరుసగా ఐదో నెల నష్టపోవడం గమనార్హం. 1996 తర్వాత వరుసగా ఇన్ని నెలలు నష్టపోవడం ఇదే తొలిసారి. విదేశీ సంస్థాగత మదుపరుల అమ్మకాలు భారీగా పెరగడం.. ప్రపంచ అనిశ్చిత పరిస్థితులు దెబ్బకొట్టాయి. దేశీయంగా అక్టోబర్- డిసెంబర్ త్రైమాసికాల జీడీపీ వృద్ధి గణాంకాల విడుదల నేపథ్యంలోనే మదుపరులు అప్రమత్తత పాటించారు. రూపాయి విలువ మరో 28 పైసలు క్షీణించి డాలర్‌తో పోలిస్తే ప్రస్తుతం రూ. 87.46 వద్ద ఉంది. బ్రెంట్ ముడి చమురు 1.27 శాతం తగ్గి 73.10 డాలర్ల వద్ద ఉంది. ఆసియా మార్కెట్లతో పాటుగా అమెరికా, ఐరోపా మార్కెట్లు కూడా నష్టపోయాయి. ఈ క్రమంలోనే మార్కెట్లు నష్టపోయిన క్రమంలో మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ శుక్రవారం ఒక్కరోజే రూ. 9 లక్షల కోట్లకుపైగా తగ్గి రూ. 384 లక్షల కోట్లకు దిగొచ్చింది. ఇక వారంలోనే రూ. 20 లక్షల కోట్ల సంపద పతనమైంది. ఇదే సమయంలో 2024 సెప్టెంబర్ 27 నాటి జీవన కాల గరిష్టం అయిన రూ. 477 లక్షల కోట్లుగా సంపద ఉండగా.. అక్కడి నుంచి చూస్తే ఏకంగా రూ. 93.91 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. శుక్రవారం సెషన్లో సెన్సెక్స్ చివరకు 1414 పాయింట్లు తగ్గి 73,198 వద్ద ముగిసింది. నిఫ్టీ 420 పాయింట్ల పతనంతో 22,124.70 వద్ద సెషన్ ముగించింది. ఈ సంవత్సరంలో సెన్సెక్స్, నిఫ్టీకి ఒకరోజులో వచ్చిన అత్యధిక నష్టాలు ఇవే కావడం గమనార్హం. వరుసగా ఐదో నెలలో కూడా నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ గతేడాది సెప్టెంబర్ 27న 85,978 పాయింట్ల వద్ద జీవన కాల గరిష్టాల్ని తాకగా.. అక్కడి నుంచి 12,780 పాయింట్లు తగ్గింది. ఇది దాదాపు 15 శాతం. నిఫ్టీ కూడా 15 శాతానికిపైగా పతనమైంది. కిందటి రోజు ఐటీ స్టాక్స్ ఎక్కువగా పడిపోయాయి. ఈ క్రమంలోనే కిందటి రోజు నిఫ్టీ నష్టాల్లో ఇన్ఫోసిస్, ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంకు, టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్ల వాటానే 47 శాతంగా ఉంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in




## జనన ధ్రువీకరణ పత్రాల సమర్పణపై పాస్‌పోర్టు కొత్త నిబంధనలు



**న్యూఢిల్లీ-నవభూమి:** పాస్‌పోర్ట్ పొందేందుకు ప్రభుత్వం కొత్త నిబంధనలు రిలీజ్ చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. 1980 నాటి పాస్‌పోర్ట్ రూల్స్‌లో సవరణ చేసింది. పాస్‌పోర్ట్ దరఖాస్తు చేసుకున్న సమయంలో.. జనన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని కొత్త రూల్స్‌లో పేర్కొన్నారు. సవరించిన నిబంధనల ప్రకారం.. 2023, అక్టోబర్ 1 కన్నా ముందు జన్మించిన వాళ్లు.. బర్త్ సర్టిఫికేట్‌ను ప్రూఫ్‌గా ఇవ్వాలని పేర్కొన్నారు. మున్సిపాల్టీల్లో ఇచ్చే బర్త్ సర్టిఫికేట్లు లేదా, మెట్రికులేషన్, స్కూల్ సర్టిఫికేట్లు, లేదా ప్యాన్ కార్డ్, పీపీవో, ఎల్ఐసీ బీమా పాలసీ పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాల్సి ఉంటుందని కేంద్రం తెలిపింది.

ఇక 2023, అక్టోబర్ ఒకటో తేదీ తర్వాత జన్మించిన వారు మాత్రం.. రిజిస్ట్రార్ ఆఫ్ బర్త్ అండ్ డెత్స్ లేదా మున్సిపల్ కార్పొరేషన్ లేదా ఇతర అధికారులు ఇచ్చే జనన ధ్రువీకరణ పత్రాలు సరిపోతాయని ఆ నోటిఫికేషన్‌లో తెలిపారు.

## 8 నుంచి మణిపూర్‌లోని అన్ని మార్గాల్లో రాకపోకలు సాగాలి : కేంద్ర హోంమంత్రి



**న్యూఢిల్లీ-నవభూమి:** రెండు తెగల మధ్య వైరంతో రెండేళ్లుగా అట్టుడుకుతున్న మణిపూర్ లో శాంతి భద్రతల పరిస్థితిపై శనివారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రపతి పాలన కొనసాగుతున్న మణిపూర్‌లో భద్రతా పరిస్థితులపై ఆయన సమీక్ష జరిపారు. మార్చి 8వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని మార్గాల్లో ప్రజలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాకపోకలను అడ్డుకునే వారిపై, రోడ్ల దిగ్బంధాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మణిపూర్ అంతర్జాతీయ సరిహద్దు వెంట డిజిగ్నేటెడ్ ఎంట్రీ పాయింట్లకు ఇరువైపులా ఫెన్సింగ్ వర్క్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని, మాదకద్రవ్యాల బెడదలేని రాష్ట్రంగా మణిపూర్‌ను తీర్చిదిద్దాలని హోంమంత్రి షా ఆదేశించారు. మణిపూర్‌లో డ్రగ్ ట్రేడ్ నెట్‌వర్క్‌ను సమూలంగా నిర్మూలించాలని సూచించారు. నార్త్ అవెన్యూలో మధ్యాహ్నం 11 గంటలకు జరిగిన ఈ కీలక సమావేశంలో మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఆర్మీ, పారామిలిటరీ అధికారులు పాల్గొన్నారు. కాగా మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించిన అనంతరం అక్కడి పరిస్థితులపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరగడం ఇదే మొదటిసారి. 2023 మే నెలలో మణిపూర్‌లోని మైతీ, కుకీ తెగల మధ్య తలెత్తిన వైరం తీవ్ర హింసాకాండకు దారితీసింది. ఈ హింసాత్మక ఘటనల్లో సుమారు 200 మంది ప్రాణాలు కోల్పోయారు. వేల మంది నిరాశ్రయులయ్యారు. ముఖ్యమంత్రి ఎన్ బీరేన్‌సింగ్ ఇటీవల రాజీనామా చేయడంతో ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. శాంతిని నెలకొల్పే చర్యల్లో భాగంగా ప్రజలు తమ వద్ద ఉన్న అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలను వారం రోజుల్లోగా అప్పగించాలని మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా ఇటీవల విజ్ఞప్తి చేశారు. దాంతో వారం రోజుల వ్యవధిలో 300కు పైగా ఆయుధాలను ప్రజలు అప్పగించినట్లు సమాచారం.

## ఉత్తరాఖండ్ దుర్ఘటన.. నలుగురు దుర్మరణం.. ఆచూకీలేని మరో ఐదుగురు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తరాఖండ్‌లో మంచు చరియలు విరిగిపడిన ఘటనలో నలుగురు బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ కార్మికులు దుర్మరణం పాలయ్యారు. మరో ఐదుగురి ఆచూకీ తెలియాల్సి ఉంది. 50 మందిని రెస్క్యూ సిబ్బంది రక్షించారు. ఆచూకీ లభ్యం కాని వారి కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ విషయాన్ని రక్షణ శాఖ డెహ్రాడూన్ ఏరియా పబ్లిక్ రిలేషన్ అధికారి మీడియాకు వెల్లడించారు. ఉత్తరాఖండ్‌లో గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న హిమపాతంవల్ల మంచు గుట్టల్లా పేరుకు పోయింది. ఈ క్రమంలో చమోలి జిల్లాలోని మన గ్రామ సమీపంలోని చమోలి-బద్రీనాథ్ రహదారిపై ఏర్పాటు చేసిన బీఆర్వో శిబిరంపై పెద్దఎత్తున మంచు చరియలు విరిగిపడ్డాయి. దాంతో అక్కడ పనిచేస్తున్న 59 మంది బీఆర్వో కార్మికులు మంచులో చిక్కుకుపో యారు. శుక్రవారం ఉదయం 7.15 గంటలకు ఈ ఘటన చోటుచేసు కుంది. ఆ సమయంలో బీఆర్వో కార్మికులు ఎనిమిది కంటెయినర్‌లు, ఒక షెడ్డులో ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన అధికారులు వారిని బయటకు తీసేందుకు సహాయక చర్యలు చేపట్టారు. మొత్తం 54 మందిని ప్రాణాలతో బయటికి తీశారు. వారికి మన గ్రామంలో ఏర్పాటు చేసిన ఐటీబీపీ శిబిరంలో చికిత్స అందిస్తు న్నారు. వారిలో నలుగురు పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో ఇంకా ఆచూకీ దొరకని ఐదుగురు కార్మికుల గురించి ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రమాదంలో మంచు చరియల కింద చిక్కుకున్న అందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

## చిన్నారి ప్రవర్తనే లైంగిక దాడికి కారణమన్న కలెక్టర్.. విమర్శలు వెల్లువెత్తడంతో వేటు

**చెన్నై- నవభూమి:** మూడున్నర ఏళ్ల చిన్నారి తప్పుడు ప్రవర్తనే ఆమెపై లైంగిక దాడికి కారణమని జిల్లా కలెక్టర్ అన్నారు. ఆయన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆ కలెక్టర్‌పై ప్రభుత్వం వేటు వేసింది. ఆ జిల్లా నుంచి బదిలీ చేసింది. తమిళనాడులోని మైలదుత్తురై జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మూడున్నర ఏళ్ల బాలికపై 16 ఏళ్ల బాలుడు లైంగిక దాడికి పాల్పడటం ఆ రాష్ట్రంలో సంచలనం రేపింది. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు మైనర్ బాలుడ్ని అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఫిబ్రవరి 28న మైలదుత్తురై జిల్లా కలెక్టర్ ఏపీ మహాభారతి ఒక కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా చిన్నారిపై జరిగిన లైంగిక దాడి గురించి ఆయన మాట్లాడారు. 'నాకు అందిన రిపోర్ట్ ప్రకారం ఆ పాప తప్పుగా ప్రవర్తించింది. బాలుడి ముఖంపై ఆ చిన్నారి ఉమ్మి వేసింది. అదే ఆమెపై లైంగిక దాడికి కారణం కావచ్చు. అందువల్ల పోక్సో చట్టం కింద నమోదైన ఈ కేసును రెండు వైపులా పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం' అని అన్నారు. మరోవైపు కలెక్టర్ ఏపీ మహాభారతి వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. తన చర్య లైంగిక దాడికి దారి తీస్తుందని ఆ చిన్నారికి ఎలా తెలుస్తుందని కొందరు ప్రశ్నించారు. మూడున్నర ఏళ్ల అమాయక బాలిక ప్రవర్తనను ఒక జిల్లా కలెక్టర్ తప్పుపట్టడంపై మరికొందరు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం దీనిపై స్పందించింది. జిల్లా కలెక్టర్ ఏపీ మహాభారతిపై శనివారం వేటు వేసింది. ఆయనను మైలదుత్తురై నుంచి బదిలీ చేసింది. ఆ అధికారికి ఏ పోస్ట్ ఇవ్వలేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

## స్కూల్ పాఠ్యాంశాల్లో మార్పులు.. ఇందిరాగాంధీ ఫోటోలు తొలగింపు



**న్యూఢిల్లీ-నవభూమి:** బంగ్లాదేశ్‌లో అధికారం చేపట్టిన మహమ్మద్ యూనస్ ప్రభుత్వం.. సమూల మార్పులకు తెరలేపిన విషయం తెలిసిందే. ఇక షేక్ హసీనా గద్దె దిగిన తర్వాత.. క్రమంగా భారత్‌కు శత్రుదేశంగా మారుతోంది. పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోవడంలో కీలక పాత్ర పోషించిన భారత్‌ను కాదని శత్రుదేశమైన పాకిస్తాన్‌తో ఇప్పుడు స్నేహం చేస్తోంది. ఇప్పటివరకు మిత్రదేశంగా ఉన్న భారత్‌ను దూరం పెడుతోంది. ఈ క్రమంలోనే బంగ్లాదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల ఆనవాళ్లను తుడిచిపెట్టేందుకు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలోనే షేక్ హసీనా తండ్రి, బంగ్లాదేశ్ జాతిపిత షేక్ ముజిబుర్ రెహమాన్ ఫోటోలను తొలగించింది. అంతేకాకుండా మాజీ ప్రధాని షేక్ హసీనా పేరును కూడా తీసేసింది. ఇక బంగ్లాదేశ్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఫోటోలను కూడా బంగ్లాదేశ్ పాఠ్యాంశాల నుంచి చెరిపేశారు. 2025-2026 అకడమిక్ సంవత్సరానికి సంబంధించి.. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం.. విద్యార్థుల స్కూలు పాఠ్యాంశాల్లో కీలక మార్పులు చేసింది. అన్ని తరగతుల టెక్స్ట్‌బుక్స్ నుంచి మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా అనే పేరును బంగ్లాదేశ్ నేషనల్ కరికులమ్ అండ్ టెక్స్ట్‌బుక్ బోర్డు పూర్తిగా తొలగించేసింది. దీంతో పాటు బంగ్లాదేశ్ జాతిపిత షేక్ ముజిబుర్ రెహమాన్, భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఫోటోలను కూడా తీసివేయడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా బంగ్లాదేశ్ స్వాతంత్ర్య ఉద్యమంలో భారతదేశ పాత్రను తగ్గిస్తూ కొత్త పుస్తకాలు ముద్రించడం గమనార్హం. %బంగ్లాదేశ్ ఏర్పడిన తర్వాత 1972 ఫిబ్రవరి 6వ తేదీన పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో నిర్వహించిన భారీ ర్యాలీలో అప్పుడు భారత ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ.. బంగ్లాదేశ్ జాతిపిత ముజిబుర్ రెహమాన్‌తో కలిసి పాల్గొని ప్రసంగం చేశారు. ఆ తర్వాత అదే ఏడాది మార్చి నెలలో బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఇందిరాగాంధీ పర్యటించారు. అయితే ఈ సంఘటనలకు సంబంధించిన ఫొటోలు ఇప్పటివరకు బంగ్లాదేశ్ విద్యార్థుల హిస్టరీ టెక్స్ట్‌బుక్స్‌లో ఉండేవి. కానీ తాజాగా సవరించి కొత్తగా విడుదల చేసిన టెక్స్ట్‌బుక్‌లలో వాటిని తీసేశారు. అంతేకాకుండా 1971 యుద్ధంలో భారత ఆర్మీ, ముక్తివాహిని పాల్గొన్న అంశాలు.. అదే ఏడాది డిసెంబరు 16వ తేదీన పాక్ సైన్యం లొంగిపోయిన విషయాలను కొత్త సిలబస్‌లో అలాగే ఉంచారు. పాకిస్తాన్ నుంచి విడిపోయి.. బంగ్లాదేశ్ కొత్త దేశంగా ఏర్పడడానికి, బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం రావడానికి కారణ భారత్ అంటూ గతంలో పుస్తకాల్లో ముద్రించగా.. తాజాగా వాటిని మార్చారు. ఇక అన్ని టెక్స్ట్‌బుక్‌లకు వెనకాల పేజీలో బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా చెప్పిన సందేశం ఉండగా.. తాజాగా దాన్ని తీసేశారు. ఇక ముజిబుర్ రెహమాన్ నాయకత్వాన్ని పొగుడుతూ రాసిన అంశాలను కూడా తగ్గించి.. ఆ స్థానంలో బంగ్లాదేశ్ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఇతర నేతల ప్రస్తావనను చేర్చారు.

ఈ సవరణల కారణంగా ప్రైమరీ, సెకండరీ, హయ్యర్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన 441 పుస్తకాల్లో మార్పులు చేయాల్సి రానుంది. 2025 అకడమిక్ ఇయర్‌కు కొత్త పుస్తకాలు 40 కోట్లకు పైగా ముద్రించనున్నట్లు బంగ్లాదేశ్ విద్యాశాఖ తేల్చింది. 2012 కరికులమ్ ఫ్రేమ్‌వర్క్‌కు అనుగుణంగా ఈ సవరణలు చేశామన్న ఎన్‌సీటీబీ ఛైర్‌పర్సన్ రీజుల్ హసన్.. భవిష్యత్తులో మరిన్ని మార్పులు ఉంటాయని తెలిపారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఆ దేశంలోని స్టూడెంట్స్ రోడ్డెక్కడంతో చెలరేగిన అల్లర్లు చివరికి గతేడాది ఆగస్టు 5వ తేదీన మాజీ ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి పారిపోయి భారత్‌లో తలదాచుకుంటున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వంలో ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం కొనసాగుతోంది.

## మళ్లీ తండ్రి అయిన ఎలాన్ మస్క్.. 14వ సంతానం, ఏం పేరు పెట్టారంటే?




**వాషింగ్టన్- నవభూమి:** ప్రపంచ అపర కుబేరుడు ఎలాన్ మస్క్ మరోసారి తండ్రి అయ్యారు. తాజాగా పుట్టిన బిడ్డ ఆయనకు 14వ సంతానం కావడం గమనార్హం. ప్రస్తుతం లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న షివోన్ జిలిస్‌కు మగబిడ్డ పుట్టినట్లు స్వయంగా ఆమెనే వెల్లడించారు. ఇక ఆ పుట్టిన బిడ్డకు సెల్డాన్ లైకుర్గస్ అని పేరు కూడా పెట్టారు. ఎలాన్ మస్క్‌కు ప్రస్తుతం 13 మంది పిల్లలు ఉండగా.. అందరికంటే ముందు పుట్టిన బిడ్డ.. అనారోగ్యంతో పుట్టిన కొన్నిరోజులకే మృతి చెందింది. టెస్లా, స్పేస్‌ఎక్స్, ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్‌కు మరో సంతానం కలిగింది. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వంలో డోజ్‌కు చీఫ్‌గా ఉన్న ఎలాన్ మస్క్‌కు 14వ సంతానం కింద మగ బిడ్డ జన్మించాడు. ఎలాన్ మస్క్ సహజీవనం చేస్తున్న న్యూరోలింక్ ఎగ్జిక్యూటివ్ షివోన్ జిలిస్‌కు ఈ బిడ్డ పుట్టాడు. వంరోవైవ్య.. ఇప్పుడు పుట్టిన బిడ్డకు సెల్డాన్ లైకుర్గస్ అని పేరు పెట్టినట్లు షివోన్ జిలిస్ వెల్లడించారు. ఇక ఇప్పటికే ఎలాన్ మస్క్ 14 బిడ్డలకు తండ్రి కాగా.. అందులో మొదటి బిడ్డ అనారోగ్య కారణాల వల్ల పుట్టిన 10 వారాలకే మృతి చెందాడు. ఈ విషయంపై తాను ముందుగా ఎలాన్ మస్క్‌తో మాట్లాడినట్లు షివోన్ జిలిస్ తెలిపారు. తమ జంటకు సెల్డాన్ లైకుర్గస్ అనే కుమారుడు పుట్టినట్లు ప్రపంచానికి తెలియజేయాలని నిర్ణయించు కున్నట్లు షివోన్ జిలిస్ వెల్లడించారు. తమ జంటకు మూడో బిడ్డ ఆర్కాడియా పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని షివోన్ జిలిస్ చెబుతున్నట్లు వివరించారు. కాగా షివోన్ జిలిస్ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని చెప్పగా.. ఆ పోస్ట్‌కు ఎలాన్ మస్క్ హార్ట్ సింబల్‌తో రిప్లై ఇవ్వడం గమనార్హం. ఇక ఇప్పటివరకు ఎలాన్ మస్క్‌కు 12 మంది సంతానం ఉన్నారు. ఆయన మొదటి భార్య జస్టిన్‌కు జన్మించిన తొలిబిడ్డ అనారోగ్య కారణాలతో మృతి చెందింది. ఆ తర్వాత ఆ ఎలాన్ మస్క్-జస్టిన్ జంట ఐవీఎఫ్ పద్ధతిలో ఐదుగురు పిల్లలకు జన్మనిచ్చారు. కొన్నేళ్ల బంధం తర్వాత 2008లో వారిద్దరూ ఎలాన్ మస్క్-జస్టిన్ జంట విడిపోయింది.

తర్వాత బ్రిటన్ నటి తాలులాహ్ రిలేను మస్క్ వివాహమాడారు. అయితే వారికి సంతానం లేదు. అనంతరం కెనడియన్ గాయని గ్రిమ్స్‌తో సంబంధం నెరిపారు. వారికి ముగ్గురు పిల్లలు. అనంతరం తన ప్రతిష్ఠాత్మక సంస్థ బ్రెయిన్ టెక్నాలజీ స్టార్టప్ న్యూరాలింక్‌లో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న జిలిస్‌తో సహజీవనం చేస్తున్నారు. వీరికి ఇప్పటికే ముగ్గురు పిల్లలు ఉండగా.. తాజాగా ఈ జంట నాలుగో బిడ్డకు జన్మనిచ్చింది. ఇదిలాఉండగా.. ఇటీవల తన బిడ్డకు తండ్రి మస్క్ అంటూ రచయిత్రి ఆష్లీ సెయింట్ క్లెయిర్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఐదు నెలల క్రితమే తానో బిడ్డకు జన్మనిచ్చానని అయితే గోప్యత, భద్రతా కారణాల వల్ల ఈ విషయం బహిర్గతం చేయలేదని ఆమె తెలిపారు. దీనిపై ఇప్పటివరకు మస్క్ ఎలాంటి స్పష్టమైన ప్రకటనా చేయలేదు. ఒకవేళ ఈ బిడ్డకు కూడా మస్క్ తండ్రి అని తేలితే.. ఇప్పటివరకు ఆయనకు 14 మంది సంతానం ఉన్నట్లు అవుతుంది.

## 15 ఏళ్ల వాహనాల మాదిరిగానే.. బీహార్‌లో ఎన్డీయే ప్రభుత్వాన్ని నిషేధించాలి: తేజస్వి యాదవ్



**పాట్నా-నవభూమి:** బీహార్‌లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంపై ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ మండిపడ్డారు. సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం పాత వాహనం మాదిరిగా ప్రజలకు భారంగా మారిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో 15 ఏళ్ల వాహనాల మాదిరిగా ఆ ప్రభుత్వాన్ని నిషేధించాలని అన్నారు. శనివారం ఈ మేరకు ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు. 'బీహార్‌లో సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని 20 ఏళ్ల ఎన్డీయే ప్రభుత్వం ఇప్పుడు పాతగా, పాడైన వాహనంగా మారింది. బీహార్ అంతటా 15 ఏళ్ల కంటే ఎక్కువ కాలం నాటి వాహనాలపై నిషేధం ఉంది. ఎందుకంటే అవి ఎక్కువ పొగను విడుదల చేస్తాయి. కాలుష్యాన్ని పెంచుతాయి. ప్రజలకు హానికరం. అందుకే 20 ఏళ్ల దుర్భరమైన ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో పనిచేయడానికి ఎందుకు అనుమతించాలి? ఈ ప్రభుత్వం బీహార్ ప్రజలకు భారంగా మారింది. దీనిని మార్చాలి' అని అందులో పేర్కొన్నారు. కాగా, గత 20 ఏళ్లుగా నితీశ్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలో పేదరికం, నిరుద్యోగం, అవినీతి, నేరాలు, వలసలు వంటి ప్రాణాంతక కాలుష్యాన్ని వ్యాప్తి చేసిందని తేజస్వి యాదవ్ మండిపడ్డారు. నితీశ్-బీజేపీ ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరించడం వలన 20 ఏళ్లలో రెండు తరాల జీవితాలు నాశనం అయ్యాయని విమర్శించారు. 'ఈ శిథిలమైన, అనారోగ్యకరమైన, నమ్మదగని ప్రభుత్వాన్ని తొలగించి, కొత్త ఆలోచన, కొత్త దృక్పథం, కొత్త ఉత్సాహం, కొత్త దిశను తీసుకురావాలని బీహార్ యువత నిశ్చయించుకున్నారు. ఇది విశ్వసనీయమైనది. ఉద్యోగాలు, ఉపాధి, అభివృద్ధిని అందించడానికి అంకితభావంతో ఉంటుంది' అని ఆ పోస్ట్‌లో ప్రస్తావించారు.

## మహా శివరాత్రి వేలంలో ఒక్క నిమ్మకాయ రూ.13 వేలు.. దాని స్పెషాలిటీ ఏంటంటే?



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** దేశవ్యాప్తంగా ఇటీవల మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న శైవక్షేత్రాలు అన్నీ మహా శివరాత్రి సందర్భంగా భక్తులతో కిక్కిరిసిపో యాయి. ఏ ఆలయం చూసినా ఓం నమః శివాయ, హరహర మహాదేవ శంభోశంకర అంటూ భక్తితో హోరెత్తాయి. ఇక మహా శివరాత్రి సందర్భంగా చాలా ప్రాంతాల్లో రకరకాల ఉత్సవాలు నిర్వహిస్తూ ఉంటారు. ఆ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని.. ఆ శివుడి కటాక్షం పొందేందుకు ప్రయత్నిస్తారు. అయితే తాజాగా తమిళనాడులో శివరాత్రి సందర్భంగా నిర్వహించిన ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన వేలం పాటలో ఒక నిమ్మకాయ రూ.13 వేలు పలికి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. తమిళనాడు ఈరోడ్ జిల్లాలోని విలక్కేతి గ్రామంలో పళమ్తిన్ని కరుప్ప ఈశ్వరన్ ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా బుధవారం అర్ధరాత్రి బహిరంగంగా వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని ప్రధాన దేవత విగ్రహంపై ఉంచిన వస్తువులను ఈ వేలం పాటలో ఉంచితే.. అక్కడికి వచ్చిన భక్తులు రికార్డు స్థాయిలో వేలం పాట పాడి వాటిని దక్కించుకుంటారు. ఈ నేపథ్యంలోనే అక్కడ దేవతపై ఉంచిన పవిత్రమైన వస్తువులు, వెండి ఉంగరం, వెండి నాణెం, నిమ్మకాయలను శివరాత్రి రోజున వేలం వేస్తారు. అయితే ఈ వేలంలో ఒక నిమ్మకాయ రికార్డు స్థాయిలో రూ. 13 వేల ధర పలకడంతో అక్కడ ఉన్న వారంతా ఆశ్చర్యపోయారు. ప్రతీ ఏడాది నిర్వహించే ఈ వేలంలో పాల్గొనేందుకు భక్తులు భారీగా పోటీ పడుతుంటారని ఆలయ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఈ నిమ్మకాయను దక్కించుకునేందుకు ప్రతీ ఏడాది చాలా మంది పోటీలో ఉంటారని తెలిపాయి. ఇక తంగరాజ్ అనే భక్తులు నిమ్మకాయను రూ.13 వేలకు కొనుగోలు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇక అరచలూరు గ్రామానికి చెందిన చిదంబరం అనే వ్యక్తి ఆలయ దేవతపై ఉంచిన వెండి ఉంగరాన్ని రూ.43,100కు కొనుగోలు చేశారని తెలిపారు. ఇక వెండి నాణేన్ని రూ.35 వేలకు రవికుమార్, భానుప్రియ ఇద్దరు సంయుక్తంగా దక్కించుకున్నారని పేర్కొన్నారు. అయితే ఇలాంటి వస్తువులు తమ ఇళ్లకు చేరడం వల్ల తమకు అంతా శుభం జరుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఇక ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు అవాక్కవుతున్నారు.

## భర్త ఫ్రెండ్స్ సామూహిక అత్యాచారం చేసినట్లు మహిళ ఆరోపణ.. తప్పుడు ఫిర్యాదుగా తేలడంతో అరెస్ట్



**లక్నో-నవభూమి:** భర్త స్నేహితులు తనను కిడ్నాప్ చేసి సాముహిక అత్యాచారానికి పాల్పడినట్లు ఒక మహిళ ఆరోపించింది. ప్రైవేట్ భాగంలో సీసా చొప్పించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆ మహిళ ఆరోపణలు తప్పని దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో ఆమెను అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. గత ఏడాది జూన్‌లో కవి నగర్ ప్రాంతంలో నివసించే వికాస్ త్యాగిపై ఒక మహిళ ఫిర్యాదు చేసింది. సహజీవనం చేస్తున్న అతడు తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారం చేశాడని ఆరోపించింది. దీని వల్ల కడుపులోని బిడ్డ చనిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొంది. కాగా, జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట స్టేట్‌మెంట్ రికార్డ్ సందర్భంగా ఆ మహిళ మాట మార్చింది. ఏకాభిప్రాయంతో తమ మధ్య సంబంధం ఉందని, త్యాగి తనను కొట్టాడని, కోర్టు బయట తాము ఒప్పందం చేసుకున్నట్లు తెలిపింది. డాక్టర్ సలహా పాటించసోవడం వల్లనే గర్భస్రావం జరిగినట్లు చెప్పింది. మరోవైపు గత ఏడాది ఆగస్ట్‌లో ఆ మహిళ మళ్లీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. త్యాగి, బావమరిది, అతడ్ని ఫ్రెండ్ కలిసి చంపుతామని తనను బెదిరించడంతో అలా స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు ఆరోపించింది. అదే నెలలో మళ్లీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. త్యాగి తాను పెళ్లి చేసుకున్నట్లు చెప్పింది. అతడిపై చర్యలను నిలిపివేయాలని కోరుతూ దరఖాస్తు చేసింది. కాగా, ఈ ఏడాది జనవరిలో ఆ మహిళ మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. త్యాగితో పెళ్లి తంతు పూర్తి కాలేదని ఆరోపించింది. త్యాగి తన ఇద్దరు స్నేహితులతో కలిసి తనపై సామూహిక లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు చేసింది. త్యాగి తనను కొట్టడంతోపాటు ఒంటిపై మద్యం పోసి నిప్పంటించినట్లు ఆరోపించింది. దీంతో పోలీసులు దర్యాప్తు చేశారు. సామూహిక అత్యాచారం ఆరోపణలు తప్పని తేలింది. ఆమె శరీరంపై కాలిన గాయాలున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 17న త్యాగిని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. మరోవైపు తాజాగా ఫిబ్రవరి 25న ఆ మహిళ మరోసారి సంచలన ఆరోపణలు చేసింది. ముందు రోజు రాత్రి వేళ భర్త త్యాగి ముగ్గురు స్నేహితులు తనను కిడ్నాప్ చేశారని, మత్తు ఇంజెక్షన్ ఇచ్చి తనపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపించింది. ప్రైవేట్ భాగంలో సీసా చొప్పించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. అయితే తాజా ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేశారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఆ రాత్రి ఆమె కారులో వెళ్లి ఇంటికి తిరిగి వచ్చినట్లు గమనించారు. త్యాగి స్నేహితుల కాల్ డాటా పరిశీలించారు. నేరం జరిగినట్లు ఆ మహిళ ఆరోపించిన ప్రాంతంలో వారు లేరని తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో తప్పుడు ఫిర్యాదు చేసినట్లు గ్రహించిన పోలీసులు శుక్రవారం ఆ మహిళను అరెస్ట్ చేశారు.

## ఇంటర్వ్యూలో ఐఐటీ బాబాపై దాడి.. కాషాయ దుస్తుల్లో వచ్చిన వారు చేశారని ఫిర్యాదు

**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళాలో అభయ్ సింగ్ అనే ఐఐటీ బాబాగా సోషల్ మీడియాలో తెగ ఫేమస్ అయిన విషయం తెలిసిందే. ఐఐటీలో చదివి ఉన్నత ఉద్యోగాన్ని కూడా వదిలేసి ఆధ్యాత్మికత వైపు అడుగుపెట్టిన ఈ ఐఐటీ బాబాను ఓ మీడియా ఛానెల్ ఇంటర్వ్యూ చేసి.. విషయాలు రాబట్టడంతో ఒక్కసారిగా అందరి దృష్టినీ ఆకర్షించాడు. మీడియా, సోషల్ మీడియాలో ఈ ఐఐటీ బాబా పేరు మారుమోగిపోతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఐఐటీ బాబాపై దాడి జరిగినట్లు వార్తలు రావడం తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ఈ విషయాన్ని స్వయంగా ఆ ఐఐటీ బాబానే పోలీసులకు చెప్పి ఫిర్యాదు చేయడం గమనార్హం. ఉత్తర్‌ప్రదేశ్ నోయిడాలోని ఓ టీవీ ఛానెల్‌కు శుక్రవారం.. ఐఐటీ బాబా ఒక ఇంటర్వ్యూ ఇచ్చాడు. అయితే అదే సమయంలో కొందరు కాషాయ దుస్తులు ధరించి ఛానెల్ స్టూడియో రూమ్‌లోకి ప్రవేశించి.. తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అంతటితో ఆగకుండా తనపై వారు దాడికి పాల్పడ్డారని ఆరోపించాడు. ఈ వ్యవహారంపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత తనకు న్యాయం చేయాలంటూ పోలీస్ అవుట్ పోస్ట్ ముందు బైఠాయించి నిరసనకు దిగడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. వెంటనే ఈ వ్యవహారంపై జోక్యం చేసుకున్న అధికారులు, పోలీసులు.. ఆ ఐఐటీ బాబాకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించడంతో వ్యవహారం సద్దుమణిగింది. మరో వైపు.. ఈ ఘటన జరగడానికి ముందు సదరు ఛానల్ యాంకర్‌పై ఐఐటీ బాబా దాడి చేసినట్లు సమాచారం. హర్యానాకు చెందిన అభయ్ సింగ్.. ఐఐటీ బాంబేలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్ పూర్తిచేసినట్లు వెల్లడించారు. కొన్నిరోజులపాటు కార్పొరేట్ సంస్థలో పనిచేసిన అభయ్ సింగ్.. ఆ తర్వాత ఉద్యోగాన్ని వదిలే శారు. ఆ తర్వాత ఫొటోగ్రఫీపై ఇష్టంతో ఆ రంగం వైపు వెళ్లారు. ఈ క్రమంలోనే ఆధ్యాత్మికం వైపు అడుగులు వేసిన ఐఐటీ బాబా.. కుంభమేళాకు వచ్చి ఓ మీడియా ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇవ్వడంతో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది. ఇక ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్-పాక్ మధ్య మ్యాచ్‌లో భారత్ ఓడిపోతుందని.. పాక్‌దే విజయమని ముందు జోస్యం చెప్పడంతో మరోసారి వార్తల్లో నిలిచాడు. దీంతో నెటిజన్లు తీవ్ర స్థాయిలో ఐఐటీ బాబాపై విమర్శలు గుప్పించారు. ఇక భారత్ మ్యాచ్ గెలిచిన తర్వాత.. నీ జోస్యం ఏం అయిందంటూ ట్రోల్స్ చేశారు. కొందరు ఐఐటీ బాబాపై బెదిరింపులకు కూడా దిగారు. ఇలాంటి తరుణంలో తాజాగా అతడిపై దాడి జరగడం తీవ్ర చర్చకు దారి తీసింది.



నవచిత్ర

# మనోజ్ ఇంటి జనరేటర్‌లో షుగర్ ఎందుకు వేశావ్ అన్నా.. మంచు విష్ణు ఏమన్నారంటే?



తన ఇంట్లోని జనరేటర్‌లో మంచు విష్ణు చక్కెర పోశాడని అందుకే కరెంట్ ఆగిపోయిందని మంచు మనోజ్ కొన్ని రోజుల క్రితం ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తాను, తన భార్య ఇంట్లో లేనప్పుడు తమ అమ్మకు పుట్టినరోజు కేక్ ఇచ్చేందుకు ఇంటికి వచ్చిన విష్ణు బౌన్సర్లతో కలిసి జనరేటర్‌లో చక్కెర కలిపిన డీజిల్ పోశాడని ఆరోపించాడు. ఆ సమయంలో తమ తల్లి, 9 నెలల కూతురు, బంధువులు మాత్రమే ఇంట్లో ఉన్నారని తెలిపాడు. అర్ధరాత్రి జనరేటర్లు పనిచేయలేదని, విద్యుత్ హెచ్చుతగ్గులు ఏర్పడ్డాయని, ప్రమాదం జరిగేలా కుట్ర చేశారని మనోజ్ ఆరోపించాడు. అయితే మనోజ్ చేసిన వ్యాఖ్యలపై తాజాగా ఒక చిట్ చాట్‌లో స్పందించాడు మంచు విష్ణు.మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప . ఈ సినిమాలో మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తుండగా.. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నాడు. ఏప్రిల్ 25న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది ఈ చిత్రం. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్ నిర్వహిస్తుంది చిత్రబృందం. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఎక్స్‌లో అభిమానులతో ముచ్చటించారు విష్ణు. ఈ సందర్భంగా వారు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చాడు.మంచు విష్ణు సమాధానమిస్తూ.. ఫ్యూయల్‌లో చక్కెర పోస్తే మైలేజ్ పెరుగుతుందని వాట్సాప్‌లో చదివాను అందుకే పోశానంటూ చెప్పుకోచ్చాడు. దీంతో ఈ కామెంట్ విపరీతంగా వైరల్‌గా మారింది.


# అలాంటి ప్రచారం వద్దంటూ తమన్నా రిక్వెస్ట్!



పాండిచ్చేరిలో జరిగిన క్రిప్టో కరెన్సీ మోసానికి సంబంధించి హీరోయిన్లు తమన్నా, కాజల్ అగర్వాల్ విచారించాలని పాండిచ్చేరి పోలీసులు నిర్ణయించిన సంగతి తెలిసిందే. పాండిచ్చేరిలో జరిగిన క్రిప్టో కరెన్సీ మోసానికి సంబంధించి హీరోయిన్లు తమన్నా, కాజల్ అగర్వాల్ విచారించాలని పాండిచ్చేరి పోలీసులు నిర్ణయించిన సంగతి తెలిసిందే. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే అధిక లాభం పొందవచ్చని ఆశ చూపి పాండిచ్చేరికి చెందిన పది మంది నుంచి సుమారు 2.40 కోట్లు వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు అశోకన్ అనే విశ్రాంతి ఉద్యోగి ఫిర్యాదు చేసారు. క్రిప్టో కరెన్సీ కోయంబత్తూరు ప్రధాన కేంద్రంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో తమన్నా, ఇతర ప్రముఖులు కొందరు పాల్గొన్నారు. మహాబలిపురం ఓ స్టార్ హోటల్ లో జరిగిన ఈ కార్యక్రమంలో నటి కాజల్ అగర్వాల్ కూడా హాజరైంది. అటుపై ముంబైలో పార్టీ నిర్వహించి వేలాది మంది నుంచి డబ్బు సేకరించారు. ఈ ఘటనకు సంబంధించి నితిష్ జైన్, అరవింద్ కుమార్ లను అరెస్ట్ కూడా చేసారు. %యూశ్రీంశీ =ఘు౦% - యూత్ స్టార్ బ్యాక్ టూ బ్యాక్ ప్లానింగ్! కేసు దర్యాప్తులో భాగంగా తమన్నా, కాజల్ ని కూడా పోలీసులు విచారించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో వాళ్లిద్దరికి నోటీసులు కూడా జారీ అవుతున్నట్లు వార్తలొస్తున్నాయి. అయితే ఈ ప్రచారాన్ని తమన్నా ఖండించింది. ఇదంతా తప్పుడు ప్రచారమంటోంది. ఇలాంటి తప్పుడు ప్రకటనలు , వీడియోలు వేయొద్దు అంటూ మీడియాను అభ్యర్ధించింది. చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పరిశీలన చేస్తున్నట్లు తెలిపింది.క్రిప్టో కరెన్సీ కేసులో నేను ఉన్నట్లు వార్తలొస్తున్న విషయం నాదృష్టికి వచ్చింది. ఇలాంటి తప్పుడు కథనలు, నివేదికలు నమ్మొద్దు. వాటిని మీడియా సంస్థల్లో ప్రసారం చేయొద్దు. అయితే ఇదంతా తప్పుడు ప్రచారమా? కాదా? అన్నది పోలీసులు నిగ్గు తేల్చాల్సి ఉంది. ఈ కేసుకు సంబంధించి ఇంకా కాజల్ అగర్వాల్ స్పందించలేదు. ఆమె నుంచి ఎలాంటి స్పందనొస్తుందో చూడాలి.

# ప్రగ్యా అందాల షో

తెలుగు ప్రేక్షకులకు మిర్చిలాంటి కుర్రాడు సినిమాతో పరిచయం అయినా 'కంచె' సినిమాతో స్టార్‌డం దక్కించుకున్న ముద్దుగుమ్మ ప్రగ్యా జైస్వాల్. మెగా హీరో వరుణ్ తేజ్ హీరోగా క్రిష్ దర్శకత్వంలో వచ్చిన కంచె సినిమా కమర్షియల్‌గా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. ముఖ్యంగా హీరోయిన్‌గా నటించిన ప్రగ్యా జైస్వాల్‌పై ఆ సమయంలో పాజిటివ్ కామెంట్స్ వచ్చాయి. ముందు ముందు టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా సినిమాలు చేయబోతుంది అనే విశ్వాసం చాలా మంది వ్యక్తం చేశారు. కానీ కట్ చేస్తే టాలీవుడ్‌లో కంచె తర్వాత ఆ స్థాయి గుర్తింపు తెచ్చి పెట్టిన పాత్ర ఆమెకు దక్కలేదు. ఒకటి రెండు హిట్స్ ఆమె ఖాతాలో పడ్డా అవి ఆమెకు ఆఫర్లు తెచ్చి పెట్టలేక పోయాయి. అయినా కెరీర్‌లో నిలదొక్కుకోవడం కోసం పదేళ్లుగా ఇండస్ట్రీలో ఆఫర్ల కోసం కుస్తీ పడుతుంది. అడపా దడపా ఆఫర్లు వస్తూ ఇంకా ఇండస్ట్రీలో కొనసాగుతోంది. సక్సెస్ దక్కాలి, మంచి పాత్ర పడాలని ప్రగ్యా చాలా కాలంగా వెయిట్ చేస్తుంది. ఇండస్ట్రీలో హిట్ లేకున్నా ఇన్నాళ్లు కొనసాగడంకు ప్రధాన కారణం ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు అనడంలో సందేహం లేదు. రెగ్యులర్‌గా సోషల్ మీడియా ద్వారా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. దాంతో ఈ అమ్మడు ఎప్పుడు చూసినా వార్తల్లో ఉంటుంది.




తాజాగా మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి ఇన్నర్స్‌ను చూపిస్తూ వయ్యారాలు ఒలకబోస్తూ కవ్విస్తున్నట్లుగా ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. దాంతో ఈ అమ్మడు మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ స్థాయి అందాల ఆరబోత కేవలం ప్రగ్యా జైస్వాల్‌కే సాధ్యం అంటూ నెట్టింట కొందరు కామెంట్ చేస్తున్నారు. ఇంత అందం ఉన్నా కూడా ప్రగ్యాకి సరైన ఆఫర్లు రాకపోవడం విడ్డూరంగా ఉంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా ఇండస్ట్రీలో ఈ అమ్మడికి ముందు ముందు అయినా ఆఫర్లు రావాలని అభిమానులు, ఫాలోవర్స్ కోరుకుంటున్నారు. ఈ ఫోటోల్లో ప్రగ్యా అందాలు అరాచకం అంటూ తెగ లైక్ చేస్తూ షేర్ చేస్తున్నారు. ప్రగ్యా ఇటీవల బాలకృష్ణతో కలిసి వచ్చిన డాకు మహారాజ్ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అయినా వెంటనే ఈ అమ్మడికి ఆఫర్లు రావడం లేదు. తెలుగులో ఈ అమ్మడు అఖండ-2 సినిమాలో నటించే అవకాశాలు దక్కించుకుంది. అఖండ సినిమాలో నటించిన ప్రగ్యాకి సీక్వెల్‌లో నటించే అవకాశం దక్కింది. బాలయ్యతో మూడో విజయాన్ని అఖండ 2తో దక్కించుకోవడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఆ విజయంతో అయినా టాలీవుడ్‌లో ప్రగ్యా జైస్వాల్ బిజీ అయ్యేనా చూడాలి.

# బాలీవుడ్‌లో కొత్త ట్రెండ్.. హీరోయిన్ ఆ డ్రెస్ వేసుకుంటే తల్లి అయినట్లే.!





బాలీవుడ్ కపుల్స్ కియారా అద్వానీ, సిద్ధార్థ్ మల్హోత్రా త్వరలోనే తాము తల్లిదండ్రులు అవ్వబోతున్నట్లు శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇన్‌స్టాగ్రామ్‌లో కియారా అద్వానీ, సిద్ధార్థ్ మల్హోత్రా తమ రెండు చేతులు ముందుకు చాచి చిన్నారి సాక్స్ ఫొటో పంచుకున్నారు. మా జీవితాల్లోకి గొప్ప బహుమతి త్వరలో వస్తుంది అంటూ ఈ ఫొటోకి క్యాప్షన్ ఇచ్చారు. ఇక ఈ విషయం తెలిసి అభిమానులు, సినీ సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇదిలావుంటే తాము పేరెంట్స్ అవ్వబోతున్నట్లు మరో ఫొటోను పంచుకుంది ఈ జంట. ఇందులో కియారా బ్లాక్ కలర్ పోల్కా డాట్ డ్రెస్ ధరించి ఉంది.అయితే ఈ డ్రెస్‌కి సంబంధించి సోషల్ మీడియాలో ప్రస్తుతం ఒక ట్రెండ్ నడుస్తుంది. ఎవరైన హీరోయిన్ బ్లాక్ కలర్ పోల్కా డాట్ డ్రెస్ ధరించి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టిందంటే ఆమె ఖచ్చింతంగా తల్లి కాబోతుందని అర్థం అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. దీనికి ఉదాహరణగా ఇంతకుముందు హీరోయిన్‌లు ఈ డ్రెస్ ధరించి తల్లి కాబోతున్నట్లు ప్రకటించా రు. ఒక ఎవరెవరు ఈ ట్రెండ్ ఫాలో అయ్యారు అనేది చూసుకుంటే.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్కా శర్మ విరాట్ కోహ్లీ దంపతులు తాము తల్లిదండ్రులు అవ్వ బోతున్నట్లు ప్రకటించినప్పుడు అనుష్కా శర్మ బ్లాక్ కలర్ పోల్కా డాట్ డ్రెస్ ధరించింది. అనంతరం ప్రియాంక చోప్రా కూడా తాను తల్లి అయ్యేముందు ఈ డ్రెస్ ధరించి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. ఆ తర్వాత ఆలియా భట్.. రీసెంట్‌గా కియారా అద్వానీ కూడా తాను తల్లి అవుతున్నానని చెబుతూ పోల్కా డాట్ డ్రెస్ ధరించి అందరికి హింట్ ఇచ్చింది. ఇంకా వీరే కాకుండా షాహిద్ కపూర్ భార్య మీరా రాజ్‌పుత్, ఇంగ్లాండ్ యువరాణి కేట్ మిడిల్‌టన్ తదితరులు కూడా గర్భవతి సమయంలో పోల్కా డాట్ డ్రెస్ ధరించారు. అయితే ఈ ట్రెండ్‌ను ఫ్యూచర్‌లో మరింతమంది హీరోయిన్‌లు ఫాలో అయ్యేటట్లు తెలుస్తుంది.

# టెండూల్కర్ కూతురు, గంగూలీ కూతురు



సచిన్ టెండూల్కర్ - సౌరవ్ గంగూలీ..ఆ ఇద్దరూ సమకాలిక క్రికెటర్లు. టీమిండియా బెస్ట్ ఓపెనింగ్ జోడీ కూడా. ప్రపంచకప్ టోర్నీలలో కలిసి ఆడారు. ఎన్నో విజయవంతమైన మ్యాచ్ లతో టీమిండియా గౌరవాన్ని పెంచారు. భారత క్రికెట్ అభివృద్ధికి సహకరించిన నిష్ణాతులు. అయితే వారి తరం వెళ్లింది. ఇప్పుడు కొత్తగా స్టార్ క్రికెటర్లు ప్రవేశించారు. అయితే టెండూల్కర్, గంగూలీ కంటే ఇప్పుడు ప్రజల కళ్లు వారి అందమైన కుమార్తెలపైనే. సచిన్ కుమార్తె సారా టెండూల్కర్ ఇప్పటికే పెద్ద సెలబ్రిటీ. మోడల్‌గా సారా రాణిస్తోంది. అలాగే సౌరవ్ గంగూలీ కుమార్తె సనా గంగూలీ అందం, ఆకర్షణలో ఎందులోను తగ్గదు. ఈ ఇద్దరి వయస్సు, విద్యా అర్హతల గురించి యూత్ ఎక్కువగా చర్చిస్తోంది. సారా టెండూల్కర్ 1997 అక్టోబర్ 12న జన్మించారు. ప్రస్తుతం ఆమెకు 27 సంవత్సరాలు. సనా గంగూలీ 2021 నవంబర్ 3న జన్మించారు. ప్రస్తుతం ఈ అమ్మాయికి 23 సంవత్సరాలు. ఇద్దరి మధ్యా నాలుగేళ్ల వయసు గ్యాప్ ఉంది. ఒకే జెనరేషన్‌లో వేవ్స్ క్రియేట్ చేస్తున్న అందగత్తెలు. సారా టెండూల్కర్ ఆర్థిక రాజధాని ముంబై నగరంలో పెరిగారు. ప్రతిష్టాత్మక ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో తన ప్రారంభ విద్యను పూర్తి చేశారు. తన తల్లి ఆరోగ్య సంరక్షణ వృత్తి నుండి ప్రేరణ పొందిన సారా ఈ రంగంలో ఆసక్తిని పెంచుకుంది. లండన్‌లో తన విద్యను కొనసాగిస్తోంది. సారా ఎంతో అంకితభావంతో లండన్ మెడికల్ కాలేజీలో చేరింది. అక్కడ ఆమె వైద్య వృత్తి లో ఉన్నత చదువును కొనసాగిస్తోంది. సనా గంగూలీ కోల్‌కతాలోని లోరెటో హౌస్ స్కూల్‌లో తన పాఠశాల విద్యను ప్రారంభించింది. ఆమె విద్యా నైపుణ్యం ఆమెకు ప్రతిష్టాత్మక యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ లో స్థానం సంపాదించిపెట్టింది. వర్శిటీలో ఈ యంగ్ బ్యూటీ ఆర్థిక శాస్త్రాన్ని అభ్యసించింది. యుసిఎల్‌లో ఉన్నప్పుడు సనా అంకితభావంతో కూడిన విద్యార్థిగా మాత్రమే కాకుండా అనేక ఇంటర్న్‌షిప్‌లలో కూడా పాల్గొంది. సనా తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంది. ఈ ఇద్దరు క్రికెటర్ల కుమార్తెలు గొప్ప స్థానానికి ఎదుగుతారని అభిమానులు భావిస్తున్నారు.

నవక్రీడ

# గాయపడ్డ ఆసీస్ బ్యాటర్.. సెమీస్‌కు మాథ్యూ షార్ట్ డౌటే



**లాహోర్-నవభూమి:** ఆస్ట్రేలియా ఓపెనింగ్ బ్యాటర్ మాథ్యూ షార్ట్ గాయపడ్డాడు. దీంతో అతను చాంపియన్స్ ట్రోఫీ సెమీస్‌లో ఆడేది అనుమానంగా ఉన్నది. ఆఫ్ఘనిస్తాన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో అతను గాయపడ్డాడు. 15 బంతుల్లో 20 రన్స్ కొట్టిన అతను.. కొంత ఇబ్బందిపడినట్లు తెలుస్తోంది. అయితే గ్రూపు బీ నుంచి నాలుగు పాయింట్లతో ఆస్ట్రేలియా సెమీస్‌కు వెళ్లింది. ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో.. షార్ట్ 63 రన్స్ చేశాడు.ఫామ్‌లో ఉన్న షార్ట్ గాయపడడంతో ఆస్ట్రేలియాకు సెమీస్‌లో కష్టాలు ఎదురయ్యే ఛాన్సు ఉంది. సెమీస్‌లో షార్ట్ ఆడేది అనుమానమే అని కెప్టెన్ స్మిత్ పేర్కొన్నాడు. అతను ఇబ్బందిపడుతున్నాడని, సరిగా కదలేకపోతున్నాడని, అతను త్వరగా రికవరీ కావడం కష్టమే అన్నాడు. అయితే షార్ట్ స్థానంలో మరో భారీ హిట్టర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్‌కు అవకాశం ఇచ్చే ఆలోచనలో ఆస్ట్రేలియా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇటీవల లంకతో జరిగిన వన్డే సిరీస్‌లో అతను విఫలం అయ్యాడు. ఆల్‌రౌండర్ ఆరన్ హార్డీ ని కూడా తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. సెమీస్‌లో ఇండియా లేదా న్యూజిలాండ్‌తో ఆస్ట్రేలియా ఆడే ఛాన్సు ఉన్నది. ఇండియాతో అయితే మంగళవారం దుబాయ్‌లో, కివీస్‌తో అయితే బుధవారం లాహోర్‌లో ఆ మ్యాచ్‌లు ఉంటాయి.

ఆదివారం కివీస్‌తో జరిగే మ్యాచ్ తర్వాతే దీనిపై క్లారిటీ వస్తుంది. గ్రూపు బీ నుంచి ఆస్ట్రేలియా ప్రస్తుతం లీడింగ్‌లో ఉన్నా.. ఇంగ్లండ్‌పై సౌతాఫ్రికా నెగ్గితే అప్పుడు ఆ గ్రూపు స్థానాలు మారుతాయి. ఒకవేళ ఇంగ్లండ్ భారీ తేడాతో గెలిస్తే, అప్పుడు ఆఫ్ఘనిస్తాన్ రెండో స్థానానికి వెళ్లే ఛాన్సు ఉన్నది.

# షమీకి రెస్ట్.. హర్షదీప్‌కు ఛాన్స్ !



**దుబాయ్-నవభూమి:** భారత ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీకి రెస్ట్ ఇవ్వనున్నారు. చాంపియన్స్ ట్రోఫీలో న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లో.. షమీ లేకుండానే టీమిండియా బరిలోకి దిగనున్నది. పాకిస్థాన్‌తో మ్యాచ్ సమయంలో షమీ పిక్క కండరాలు పట్టేసిన విషయం తెలిసిందే. దీంతో అతనికి రెస్ట్ ఇవ్వాలని టీం మేనేజ్మెంట్ ఆలోచిస్తున్నది. అయితే ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లో.. షమీ స్థానంలో హర్షదీప్‌కు ఛాన్స్ ఇవ్వాలని భావిస్తున్నారు.బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కల్ సమక్షంలో హర్షదీప్ శుక్రవారం ప్రాక్టీస్ చేశాడు. ప్రాక్టీస్ సెషన్‌లో హర్షదీప్ 13 ఓవర్లు బౌల్ చేశాడు. షమీ మాత్రం 7 ఓవర్లు బౌల్ చేసినట్లు తెలుస్తోంది. పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం మూడు ఓవర్లు వేయగానే.. షమీ తన కుడి కాలి కోసం ఫిజియో చికిత్స తీసుకున్నాడు. అయితే కీలకమైన సెమీస్ మ్యాచ్ ముందు.. షమీకి రెస్ట్ ఇవ్వాలని టీం మేనేజ్మెంట్ భావిస్తున్నది. బౌలింగ్ లైనప్‌లో స్వల్పంగా తేడా ఉంటుందని అసిస్టెంట్ కోచ్ రియాన్ డోస్చే తెలిపారు.

# చాంపియన్స్ ట్రోఫీ నుంచి ఇంగ్లండ్ ఔట్..




**కరాచీ-నవభూమి:** ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల కెప్టెన్సీకి జోస్ బట్లర్ గుడ్‌బై చెప్పాడు. ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీలో శనివారం దక్షిణాఫ్రికాతో మ్యాచ్ తన కెప్టెన్సీలో చివరి మ్యాచ్ అంటూ ప్రకటించాడు. మెగాటోర్నీలో టైటిల్ ఫేవరేట్లలో ఒకటిగా బరిలోకి దిగిన ఇంగ్లండ్ వరుస ఓటములతో లీగ్ దశలోనే వెనుదిరిగింది. ఈ నేపథ్యంలో జట్టు ఓటమికి బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు బట్లర్ ప్రకటించాడు.

శుక్రవారం జరిగిన మీడియా భేటీలో బట్లర్ మాట్లాడుతూ 'ఇంగ్లండ్ కెప్టెన్సీ నుంచి నేను వైదొలుగుతున్నాను. జట్టుతో పాటు నాకు ఇది సరైన సమయమని భావిస్తున్నాను. చాలా క్లియర్‌గా ఉంది. టోర్నీ అనేది ముఖ్యం. వరుసగా రెండు ఓటములతో టోర్నీ నుంచి వైదొలిగాం. గత కొన్ని సిరీస్‌ల నుంచి జట్టు ప్రదర్శన సరిగ్గాలేదు. నా కెప్టెన్సీకి ఇక్కడితో ముగింపు పడింది. ఇది ఒక రకంగా అవమానకరం' అని అన్నాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: SHAIK SHAHANAZ, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com RNI No: TEL TEL: 82083